



# ఈనాడు







కరీంనగర్ 20-8-2019 మంగళవారం సిటీ సంపుటి 46 సంచిక 11

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 14+12 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




## పొరుగుబోతు మాటలవి

- ఇమ్రాన్ వ్యాఖ్యలతో శాంతికి విఘాతం
- ట్రంప్‌తో ప్రధాని మోదీ
- అరగంట పాటు ఫోన్‌లో సంభాషణ

దిల్లీ: భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర పదజాలాన్ని ఉపయోగిస్తున్న పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ధోరణిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్ద తీవ్రస్థాయిలో ఎండగట్టారు. మోదీ సోమవారం ఫోన్‌లో ట్రంప్‌తో సంభాషించారు. జమ్మూ-కశ్మీర్‌లో ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశాక వీరిరువురి మధ్య చర్చలు జరగడం ఇదే మొదటిసారి.

సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికి, ఉగ్ర విధ్వంసానికి తావులేని వాతావరణాన్ని ఏర్పర్చాల్సిన ఆవశ్యకతను కూడా మోదీ ప్రస్తావించారు. ఈ మార్గాన్ని అనుసరించేవారితో కలిసి పేదరికం, నిరక్షరాస్యత, వ్యాధులపై భారత్ చిత్తశుద్ధితో పోరాడుతుందన్నారు. సోమవారం అఫ్గానిస్థాన్ 100వ స్వాతంత్ర్య దినోత్సవమని పేర్కొంటూ ఆ దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి, స్వతంత్రతకు కృషి చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. జూన్‌లో ఒసాకాలో జరిగిన జి-20 సదస్సులో ట్రంప్‌తో సాగించిన చర్చలను కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యంపై రెండు దేశాల మధ్య త్వరలోనే అత్యున్నతస్థాయిలో చర్చలు జరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ...మిగతా 2లో

> “ఈ ప్రాంతంలోని కొందరు నేతలు భారత్‌కు వ్యతిరేకంగా దుందుడుకు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలా హింసను ప్రేరేపించడం శాంతికి ఏ మాత్రం దోహదపడదు
>
> - ఇమ్రాన్ పేరు ప్రస్తావించకుండా మోదీ వ్యాఖ్యలు



# నడ్డా.. అబద్ధాల అడ్డా

**ఇది తెలంగాణ బిడ్డల గడ్డ.. మీ కర్నాటకాలు ఇక్కడ చెల్లవు**

- నోటికొచ్చినట్లు మాట్లాడొద్దు.. నీతిఆయోగ్ చెప్పిందేమిటో తెలుసుకోండి
- 50 లక్షల పైచిలుకు సభ్యత్వంతో తెరాస తిరుగులేని రాజకీయశక్తిగా ఆవిర్భవించింది
- ఆయుష్మాన్‌భవ కంటే ఆరోగ్యశ్రీ ఎంతో మెరుగైన పథకం
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ‘నడ్డా...ఇది తెలంగాణ బిడ్డల గడ్డ..అమాయకులెవరూ లేరిక్కడ. అందరం ఆరితేరినవారమే. మీ కర్ణాటక ఎత్తుగడలు ఇక్కడ చెల్లవు’. అని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆయన జేపీ నడ్డా కాదు. అబద్ధాల అడ్డా అని తీవ్రంగా విమర్శించారు. సోమవారం జరిగిన కూకట్‌పల్లి నియోజకవర్గం బూత్‌స్థాయి, డివిజన్, అనుబంధ కమిటీల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల పైచిలుకు సభ్యత్వాన్ని పూర్తిచేసుకొని తెరాస తిరుగులేని శక్తిగా ఆవిర్భవించిందని అన్నారు. ఆదివారం భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా తెరాసపై, కేసీఆర్‌పై చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ సందర్భంగా విరుచుకుపడ్డారు.

“కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారని, కమీషన్ భగీరథ, మిషన్ కాకతీయ అంటూ నోటికొచ్చినట్లు నడ్డా మాట్లాడటం సరికాదు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతగా మాట్లాడాలి. ఎవరో రాసిచ్చింది చదివి వెళ్తే సరిపోతుందా? తెలియకపోతే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నీతి ఆయోగ్‌ను అడిగి తెలుసుకోండి. దేశంలోనే ఎక్కడా ఇటువంటి మంచి పథకాలు లేవని ఆ సంస్థ చెప్పిన విషయాన్ని తెలుసుకోండి. ఈ పథకాలను అధ్యయనం చేసేందుకు దేశంలోని 11 రాష్ట్రాల నుంచి అధికారులు, మంత్రులు తెలంగాణకు క్యూకట్టిన విషయం తెలియదా? జేపీ నడ్డా మాటల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా నిజం లేదు. ...మిగతా 2లో

కేటీఆర్‌కు గదను బహూకరిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్



### తెరాసకు ఇక నిద్రలేని రాత్రులే

- కేటీఆర్‌కు రాజకీయాల్లో కొనసాగే అర్హత ఉందా?
- కేసీఆర్ లేకుంటే నీవెక్కడ?

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఘాటు విమర్శలు

### తెలంగాణలో భాజపా ఎప్పటికీ బలపడదు

- తెరాస ప్రభుత్వం అవినీతిపై కేంద్రం సీబీఐ విచారణ జరిపించాలి
- పార్టీ శ్రేణులతో ఫేస్‌బుక్ లైవ్‌లో

2లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



## కలెక్టర్లే కార్యసాధకులు

- చట్టాల అమలు, సంక్షేమ పథకాలపై వారికి దిశానిర్దేశం
- నేడు, రేపు ముఖ్యమంత్రి సమావేశాలు
- 32 అంశాల భారీ ఎజెండా



ఈనాడు, హైదరాబాద్: జిల్లా కలెక్టర్ల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు వారికి కీలక బాధ్యతలను అప్పగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించారు. ఇప్పటికే పంచాయతీరాజ్, పురపాలక కొత్త చట్టాల్లో వారికి ముఖ్య అధికారాలు కట్టబెట్టారు. కీలక నిర్ణయాలను తీసుకునే వీలు కల్పించారు. త్వరలో రానున్న కొత్త రెవెన్యూ చట్టంలోనూ కలెక్టర్లకు ప్రాధాన్యం కల్పించబోతున్నారు. వీటన్నింటిపైనా దిశానిర్దేశం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళ, బుధవారాల్లో ప్రగతిభవన్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ల కొత్త పాత్రను వివరించడంతో పాటు కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పన, పంచాయతీరాజ్, పురపాలక చట్టాల అమలుతో పాటు పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి నిర్దేశించిన 60 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యాచరణ, సాగునీటి వినియోగ ప్రణాళిక అంశాలపై ఇందులో చర్చించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశాల ఎజెండాలో దాదాపు 32కి పైగా అంశాలున్నాయి.

**తొలిసారి కలెక్టర్లతో సమావేశం**

రాష్ట్రంలో రెండోసారి తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తొలిసారిగా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశమవుతున్నారు. ఎన్నికలకు ముందు 31 జిల్లాలు ఉండగా.. అనంతరం వాటి సంఖ్య 33కి పెరిగింది. వీరి పనితీరుకు సంబంధించి ఆయన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నారు. ప్రభుత్వ ప్రాధాన్య పథకాలు, కార్యక్రమాలపై కొందరు కలెక్టర్లు బాగా పనిచేస్తుండగా.. మరికొందరు ఆశించిన స్థాయిలో రాణించలేదనే అసంతృప్తి ఉంది. రాష్ట్రంలో సుపరిపాలన లక్ష్యంతో సీఎం కొత్త పంచాయతీరాజ్, పురపాలక చట్టాలను రూపొందించారు. ఇందులో కలెక్టర్లకు కొత్త అధికారాలు కల్పించారు. ఇదే తరహాలో కొత్త రెవెన్యూ చట్టం సిద్ధమవుతోంది. దీన్ని సీఎం అత్యంత కీలకంగా భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికే సుదీర్ఘ కసరత్తు జరిగింది. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే కొత్త చట్టం గురించి వెల్లడించిన ముఖ్యమంత్రి దానికి అనుగుణంగా ...మిగతా 2లో

# రివర్స్ ఎందుకు?

**పోలవరం రీ టెండరింగ్‌పై నివేదిక ఇవ్వండి**

- ప్రాజెక్టు అథారిటీని ఆదేశించిన కేంద్రం
- ఈ వారాంతంలో అందించనున్న పీపీఏ

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు రివర్స్ టెండరింగ్‌పై కేంద్ర జలవనరుల శాఖ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ని నివేదిక కోరింది. దీనివల్ల ప్రాజెక్టు జాప్యం కావడంతోపాటు, వ్యయం కూడా పెరుగుతుందని అటు కేంద్ర మంత్రి, ఇటు అథారిటీ చెప్పినా.. ఏపీ ప్రభుత్వం పాత కాంట్రాక్ట్ రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవడానికి దారి తీసిన కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రస్తుతం నివేదిక తయారీలో నిమగ్నమైంది. ఈ వారంలోపు దాన్ని ఆయనకు అందించనుంది. ఇప్పటివరకు పోలవరం నిర్మాణం సాగిన తీరు, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత నుంచి అందులో వచ్చిన మార్పులు, టెండర్ రద్దు ...మిగతా 2లో



### పోలవరం రద్దు ఏకపక్షం

- జలవిద్యుత్తు ప్రాజెక్ట్ కాంట్రాక్టు రద్దు ఉత్తర్వులను కొట్టేయండి
- హైకోర్టును ఆశ్రయించిన ‘నవయుగ’
- ఇతరులకు పనులు అప్పగించకుండా నిలువరించాలని అభ్యర్థన
- నేడు విచారించనున్న న్యాయస్థానం

5లో



కీలక ఘట్టం

## జాబిలమ్మ చేరువకు..!

**నేడు చంద్రుని కక్ష్యలోకి చంద్రయాన్-2**

శ్రీహరికోట, న్యూస్‌టుడే: చంద్రయాన్-2 ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం మంగళవారం జరగనుంది. ఇందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. గతనెల 22న శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ-మార్క్3ఎం1 ద్వారా చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపారు. ...మిగతా 2లో



## దూసుకొచ్చిన వాహనం.. గాల్లోకి జనం

**బెంగళూరులో బెంబేలెత్తించిన కారు**

అది బెంగళూరు హెచ్‌ఎస్ఆర్ లేఔట్ ప్రాంతం.. చల్లటి సాయం సమయం.. రహదారి పక్కన పాదచారుల బాటపై ఉన్న చిన్నపాటి హోటల్ వద్ద కొందరు వేడివేడి తేనీరు రుచి చూస్తున్నారు. మరికొందరు చిరుతిళ్లు తింటూ సరదాగా కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు.. ఇంతలో ఉన్నట్లుండి వారిపైకి దూసుకొచ్చిందో రాకాసి కారు.. ఒక్కసారిగా వారి వెన్నులో వణుకు పుట్టించింది. అనేకమందికి తప్పించుకునే అవకాశమూ లేకపోయింది. ఈ అనూహ్య ఘటనలో ఏడుగురు గాయపడగా, అందులో ముగ్గురి పరిస్థితి సోమవారం రాత్రి వరకు విషమంగానే ఉంది. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలూ ఉన్నారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ రాజేంద్ర(40)ను పోలీసులు అరెస్టు చేశారు. ఆతను ఆదివారం సాయంత్రం పూటుగా తాగి రహదారిపైకి వచ్చాడని, జోరుగా కారు నడుపుతూ దానిపై నియంత్రణ కోల్పోయాడని పోలీసులు తెలిపారు.

– న్యూస్‌టుడే, బెంగళూరు

## ఇదీ సంగతి!




# ఇంటి అనుమతి.. ఇక సులభం

- విధానంలో వేగం.. పారదర్శకం
- భవన నిర్మాణ అనుమతులపై మార్గదర్శకాలు
- పది రోజుల్లో అందుబాటులోకి
- పురపాలకశాఖ ప్రత్యేక కసరత్తు
- స్ఫూర్తిమంతంగా కొత్త పురపాలక చట్టం

**ఇప్పటి వరకు:**

సగటు పట్టణ పౌరుడు కొత్తగా ఇల్లు కట్టుకునేందుకు అనుమతుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొనేది. పాత పురపాలక చట్టం ప్రకారం నిర్మాణదారులు భవన నిర్మాణ అనుమతి తెచ్చుకునేందుకు సదరు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. దీంతో ఇంటి నిర్మాణం అంటేనే వారు భయపడుతున్నారు. అన్ని రకాల పత్రాలు ఉన్నప్పటికీ పురపాలకశాఖలో ఎంతో కొంత విదిలిస్తేనే అనుమతి దిశగా అడుగులు పడుతున్నాయి. నిర్మాణదారుడు పూర్తి నిబంధనలు పాటించినప్పటికీ రూ.20 వేల నుంచి 25 వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. లేకుంటే పలుచోట్ల భవన నిర్మాణ అనుమతి వచ్చే పరిస్థితి లేదు.




**ఇకపై:**

భవన నిర్మాణ అనుమతులను కొత్త పురపాలక చట్టం సులభతరం చేస్తుంది. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో 75 చదరపు గజాలలోపు స్థలంలో నిర్మించుకునే ఇంటికి అనుమతి అవసరం ఉండదు. కేవలం రూపాయి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది. సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆస్తి పన్నుగా రూ.100 చెల్లిస్తే చాలు. 500 చదరపు మీటర్లు, 10 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణాలకు నిర్దేశిత పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లోనే అనుమతి పొందే విధానం త్వరలో అమలులోకి రానుంది. అన్నీ సక్రమంగా ఉంటే 24 గంటల్లోనే అనుమతి ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది.

...వివరాలు 2లో



## ప్రాణం తీసిన పిల్లలాట

- మరుగుదొడ్డికి బయటి నుంచి గడియ
- లోపల ఉన్న బాలునికి ఆందోళనతో జ్వరం
- ఐదు రోజుల తర్వాత కన్నుమూత

2లో

TG

# తెరాసకు నిద్రలేని రాత్రులే

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** భాజపా సభ విజయవంతం కావడంతో ఉలిక్కిపడుతున్న తెరాస నేతలకు.. నిద్రలేని రాత్రులు గడిపే రోజులు ముందున్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఇకపై ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా.. ఇలా నెలకో జాతీయ నేత రాష్ట్రంలో పర్యటిస్తారన్నారు. భాజపా ఎదుగుదలను తెరాస నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, స్థాయినిమరిచి అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ఎవరో తెలియదని కేటీఆర్ మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటైన విమర్శలు చేశారు. కేంద్రంలో అధికార పార్టీ జాతీయ నాయకుడు తెలియదంటే.. కేటీఆర్‌కు రాజకీయాల్లో కొనసాగే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. 'జేపీ నడ్డా.. నీలా అమెరికా నుంచి ఊడిపడలేదు. తండ్రి పేరుతో రాజకీయాలు చేయడం లేదు. కేసీఆర్ లేకుంటే నీవెక్కడో.. నీ చరిత్ర ఏమిటో గుర్తించాలి. దమ్ముంటే అవినీతిని బయట పెట్టాలని హెచ్చులకు పోతున్నావు. ధైర్యముంటే విద్యుత్ టెండర్లు, నీటి ప్రాజెక్టుల ఖర్చులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. 'నడ్డా అబద్ధాల అడ్డా' అన్న కేటీఆర్.. సభలో నడ్డా మాట్లాడిన దాంట్లో అబద్ధాలేంటో నిరూపించాలి. ఆరోగ్యశ్రీని ఆపేసింది నిజం కాదా? ఉద్యోగులకు జీతాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు, పంచాయతీలకు నిధులు ఇవ్వలేని దుస్థితి నిజం కాదా?'' అని లక్ష్మణ్ ప్రశ్నించారు.

# భాజపా ఎప్పటికీ బలపడదు

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** భారతీయ జనతా పార్టీ ఇతర పార్టీల నాయకులను ఎంతమందిని చేర్చుకున్నా తెలంగాణలో బలపడదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెరాసకు కాంగ్రెస్సే ప్రత్యామ్నాయమని, కాంగ్రెస్‌కు భాజపా అసలు పోటీనే కాదన్నారు. బహిరంగ సభలో భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా.. తెరాస ప్రభుత్వ అవినీతిపై చేసిన ఆరోపణలమీద సీబీఐ విచారణ జరిపించాలని, అలాగే ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నమోదైన సీబీఐ కేసులపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్ నుంచి ఫేస్‌బుక్ లైవ్, టెలికాన్ఫరెన్స్ నెట్‌వర్కింగ్ ద్వారా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులతో నేరుగా మాట్లాడారు. తెలంగాణలో స్కీంలన్నీ స్కాములేనని, కాళేశ్వరం సహా అన్ని ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందని గత ఐదేళ్లుగా కాంగ్రెస్ చెప్తూనే ఉందన్నారు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న భాజపాకు కేసీఆర్ సర్కార్ అవినీతి ఇప్పుడే కనిపించిందా? అని నిలదీశారు. భాజపాకు తెలంగాణ మీద ప్రేముంటే ఐదేళ్లుగా రాష్ట్ర విభజన హామీలు ఎందుకు అమలు చేయలేదని ఉత్తమ్ ప్రశ్నించారు. భాజపా, తెరాస కలిసి ఆడుతున్న నాటకాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, పార్లమెంటులో కీలక సమయంలో భాజపాకు తెరాస మద్దతిస్తున్న విషయాన్ని యావత్తు దేశం చూస్తోందన్నారు.

**కేసీఆర్‌ది అసమర్థ ప్రభుత్వం**

కేసీఆర్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రాజకీయ లబ్ధికోసమే కొత్త మున్సిపల్ చట్టంలో అధికారాలన్నీ కలెక్టర్లకు కట్టబెట్టారని, దీన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు.

# పోరుగుబోతు మాటలవి

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు అరగంట పాటు ఈ ఫోన్ సంభాషణ జరిగినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలు అనేకం చర్చకు వచ్చినట్లు వివరించింది. ఇద్దరు నేతల మధ్య ఉన్న సుహృద్భావ సంబంధాలకు ఈ సంభాషణ నిదర్శనమని పేర్కొంది. రెండు రోజుల కిందట ట్రంప్ ఇమ్రాన్‌కు ఫోన్ చేసిన నేపథ్యంలో తాజా సంభాషణకు ప్రాధాన్యం ఏర్పడింది. కశ్మీర్ అంశాన్ని భారత్‌తో కలసి ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలని పాక్ ప్రధానికి ట్రంప్ సూచించారు.

ఈ సందర్భంగా భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం గురించి మోదీతో ట్రంప్ చర్చించినట్లు 'వైట్‌హౌస్' ఒక ప్రకటనలో తెలిపింది. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలని, ఈ ప్రాంతంలో శాంతి వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించినట్లు వివరించింది. వాణిజ్యాన్ని పెంచుకోవడం ద్వారా రెండు దేశాల మధ్య ఆర్థిక బంధాన్ని బలోపేతం చేసుకోవాలని చెప్పినట్లు పేర్కొంది.

# నడ్డా.. అబద్ధాల అడ్డా

(మొదటి పేజీ తరువాయి)

ఆయుష్మాన్ భారత్‌కంటే ఆరోగ్యశ్రీ చాలా మెరుగైన పథకమని మా సీఎం కేంద్రం ముఖం మీదే చెప్పారు. ఇందులో చిన్నచిన్న సమస్యలుంటే పరిష్కరించుకుంటాం తప్ప మీ సహకారం, సాయం మాకు అవసరం లేదు. ఇక్కడి పథకాలను కేంద్రం కాపీ కొట్టి, పేరు మార్చి ప్రవేశపెడుతున్న మాట నిజం కాదా? పింఛను మొత్తం కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తుందని భాజపా నేత ఒకాయన అంటున్నారు. కానీ మేం ఖర్చు చేసే మొత్తం రూ.12 వేల కోట్లలో కేంద్రం నుంచి వచ్చేది కేవలం రూ.200 కోట్లే. భాజపా అధికారంలో ఉన్న అత్యధిక రాష్ట్రాల్లో ఏ ఒక్కచోటైనా వ్యవసాయానికి 24 గంటలు ఉచితంగా కరెంటు ఇస్తున్నారా? తెలంగాణలో మేమిస్తున్నాం. న్యాయపరంగా రావాల్సిన నిధులు తప్ప భాజపా ఇప్పటి వరకు తెలంగాణకు కానీ, హైదరాబాద్‌కి కానీ పైసా కూడా అదనంగా ఇవ్వలేదు. 50 లక్షల మందికి రూ.2 వేలు పింఛను ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరాన్ని మూడేళ్లలో పూర్తిచేసుకుంటే హర్షించాల్సిందిపోయి గగ్గోలు పెడుతున్నారు.'' అని కేటీఆర్ మండిపడ్డారు.

**రాష్ట్రం బాగుపడుతుంటే వారికి నచ్చదు**

''రాష్ట్రం బాగుపడుతున్నా.. పచ్చగా పంటలు పండుతున్నా.. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు నిండుతున్నా భాజపా, కాంగ్రెస్ పార్టీలకు నచ్చదు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉంటే వారికి నిద్రపట్టదు. నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగా. ఇక్కడే చదువుకున్నా. అప్పట్లో తరచూ కర్ఫ్యూ విధించేవారు. వినాయకచవితి లేదా ఇంకో పండుగ సందర్భంగా కర్ఫ్యూతో బిక్కుబిక్కుమనాల్సిన పరిస్థితిలో ప్రజలు ఉండేవారు. మతాలు, కులాల పేరుతో చిచ్చుపెట్టి ఆ మంటలతో చలి కాచుకోవడం వారికి అలవాటు. సీఎం కేసీఆర్ హయాంలో అటువంటి పరిస్థితి లేదు. ఆంధ్రా, తెలంగాణ గొడవలుగానీ, మత ఘర్షణలు గానీ ఒక్కసారి కూడా చోటుచేసుకోలేదు.'' అని కేటీఆర్ పేర్కొన్నారు. అంతకుముందు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి మాట్లాడారు. తెలంగాణ కరడుగట్టిన ఉద్యమకారుల అడ్డా అని, ఇక్కడ ఏ పార్టీని అడుగుపెట్టనివ్వబోమన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు.

**తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరు**

**ఈనాడు, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ నేతలు కొత్త బిచ్చగాళ్ల తరహాలో వ్యవహరిస్తున్నారని, వారి తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని తెరాస ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాది రెండు నాల్కల ధోరణి అని, గతంలో ఆరోగ్యమంత్రిగా ఉండి తెలంగాణ ప్రభుత్వాన్ని మెచ్చుకున్న ఆయన ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, గొంగిడి సునీత, భూపాల్‌రెడ్డిలు సోమవారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో భాజపాపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ, నడ్డా కేంద్ర వైద్య శాఖ మంత్రిగా ఆరోగ్యశ్రీని మెచ్చుకున్నారని, ఆయనతోపాటు కేంద్ర మంత్రులు, అధికారులు తెరాస ప్రభుత్వాన్ని పొగిడారన్నారు. ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చి అబద్ధపు ఆరోపణలు చేశారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే వాటిని ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలకు చేతనైతే తెలంగాణకు విభజన చట్టం హామీలు అమలు పరచాలని అన్నారు.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

**నా ఓటు దానికే!**

నేను నిస్సంశయంగా అహింసావాదినే. కానీ ఎప్పుడైనా మనం పిరికితనంతో వెనుదిరగటమా? లేక హింసకు పాల్పడటమా? అన్న సంశయంలో పడితే.. ఆ రెంటిలో అనివార్యంగా ఏదో ఒక్క దాన్నే ఎంచుకోవాల్సి వస్తే.. నా ఓటు హింసకే వేస్తా!

– మహాత్మా గాంధీ

## గ్రహం అనుగ్రహం

**20-8-2019 మంగళవారం**

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
పంచమి: రా.1-28 తదుపరి షష్ఠి
రేవతి నక్షత్రం: రా.8-01 తదుపరి అశ్విని
అమృత ఘడియలు: సా.5-23 నుంచి 7-08 వరకు
వర్జ్యం: ఉ.6-53 నుంచి 8-38 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-16 నుంచి 9-07 వరకు
తిరిగి రాత్రి 10-54 నుంచి 11-40 వరకు
రాహుకాలం: మ.3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-46; సూర్యాస్తమయం: సా.6.20

# రాష్ట్రాలు సామంతరాజ్యాలు కాదు



రైతు మార్గదర్శి' పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు – హైదరాబాద్, ఖైరతాబాద్ – న్యూస్‌టుడే

కేంద్ర ప్రభుత్వం అంటే చక్రవర్తులు కాదు.. రాష్ట్రాలు దానికి సామంత రాజ్యాలు కాదని వ్యవసాయ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణకు కేంద్రం రూపాయి ఇచ్చింది లేదు కానీ భాజపా నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై రాళ్లు విసిరిపోతున్నారన్నారు. వ్యవసాయ యంత్రాల వివరాలతో రైతులకు అవగాహన కల్పించేందుకు 'రైతు మార్గదర్శి' పేరుతో రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్) రూపొందించిన పుస్తకాన్ని సోమవారం హరిత ప్లాజా హోటల్‌లో ఆయన ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఆదివారం రాష్ట్రానికి వచ్చిన భాజపా నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడి వెళ్లారని, వారిని చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. గతంలో భాజపాకు చెందిన కొందరు కేంద్ర మంత్రులు మిషన్ కాకతీయ, భగీరథ పథకాలను పొగిడారని గుర్తు చేశారు. రూ.24 వేల కోట్లు గ్రాంటుగా ఇవ్వాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సూచించినా 24 రూపాయలైనా ఇవ్వడం చేతకాని వారు రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. రైతుబంధు పథకం కింద 51 లక్షల మందికి డబ్బు ఇచ్చామన్నారు. మిగతావి కూడా త్వరలో రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. ఐదెకరాలకు పైగా భూమి ఉంటే రైతుబంధు సొమ్ము రాదంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దానిని నమ్మవద్దని.. అందరికీ ఇస్తామని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆగ్రోస్ ఛైర్మన్ కిషన్ రావు, ఎండీ సురేందర్‌లు పాల్గొన్నారు.

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| రామగుండం | 34.0 | 24.8 |
| హన్మకొండ | 33.9 | 27.1 |
| మహబూబ్‌నగర్ | 32.9 | 24.5 |
| కరీంనగర్ | 32.5 | 25.0 |
| గుంటూరు | 32.1 | 25.4 |
| ఖమ్మం | 32.0 | 27.0 |
| ఆదిలాబాద్ | 32.0 | 24.8 |
| నిజామాబాద్ | 30.8 | 24.5 |
| మెదక్ | 29.6 | 23.0 |
| హైదరాబాద్ | 29.4 | 23.7 |
| నల్గొండ | 29.4 | 23.6 |

# ఇంటి అనుమతి.. ఇక సులభం

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పురపాలక చట్టం ప్రజలకు అన్ని విధాలా మేలు చేసేదిగా ఉండనుంది. అందరికీ స్ఫూర్తిమంతం కానుంది. దీనిపై పురపాలకశాఖ ప్రత్యేక కసరత్తు చేస్తోంది. చట్టాన్ని పటిష్ఠంగా, పారదర్శకంగా అమలు చేసేలా మార్గదర్శకాలను రూపొందిస్తోంది. పది రోజుల్లో ఇవి అమలులోకి రానున్నాయని విశ్వసనీయ సమాచారం. పట్టణాలు, నగరాల్లో స్థలాల విలువ భారీగా పెరగడం వంటి పరిస్థితుల నేపథ్యంలో చిన్నచిన్న స్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకునేందుకు పలువురు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త చట్టం ప్రకారం తక్కువ స్థలం ఉండి నిర్మించుకునే ఇళ్లకు ఇబ్బందులు ఉండవు. కొత్తగా వచ్చే స్వీయ దరఖాస్తు విధానం అనేది దరఖాస్తుదారుడిదే పూర్తి బాధ్యుడిని చేస్తుంది. ఈ ప్రకారం నిబంధనల మేరకు వ్యవహరించడం తప్పనిసరి. లేదంటే జరిమానా, ఇతర చర్యలకు అవకాశం ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించినట్లు పురపాలకశాఖ గుర్తిస్తే అలాంటి భవనాన్ని నోటీసులు ఇవ్వకుండానే కూల్చేలా చట్టంలో స్పష్టం చేశారు. తప్పుడు వివరాలతో అనుమతి పొందితే వాటిని రద్దు చేసే అధికారం పురపాలకశాఖకు ఉంటుంది.

**24 గంటల్లోనే...**

భవన నిర్మాణ అనుమతికి అవసరమైన పత్రాలను నిర్మాణదారుడు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాలి. ఈ దరఖాస్తుల విధానంలో జాప్యం లేకుండా అనుమతులిచ్చేలా ప్రత్యేక చర్యలు ఉంటాయి. పురపాలక కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో ఏ రోజుకారోజు భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులను సమీక్షిస్తారు. నిర్దేశిత పత్రాలు పక్కాగా ఉంటే 24 గంటల్లోనే అనుమతి మంజూరు చేయడం లక్ష్యంగా ముందుకు వెళ్తామని పురపాలకశాఖ ఉన్నతాధికారి స్పష్టం చేశారు. ఇళ్లను నిర్మించుకునేవారు లంచాలు ఇచ్చే పనిలేకుండా పురపాలక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేస్తామన్నారు. కొత్త చట్టం అమలును కలెక్టర్లు ప్రత్యేకంగా పరిశీలించడంతో పాటు ప్రతినెలా సమీక్షిస్తారని వివరించారు.

**అవినీతికి అడ్డుకట్ట**

భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేసిన నేపథ్యంలో అవినీతికి, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని పురపాలకశాఖ భావిస్తోంది. కొందరు ఆమ్యామ్యాలు ఇచ్చుకోలేక.. మరికొందరు తమకు నిర్మాణ అనుమతులు లభించవనే కారణంతో అక్రమ నిర్మాణాలకు మొగ్గు చూపుతున్నారు. నిబంధనల మేరకు అనుమతులు సులభం కావడంతో పాటు 75 చదరపు గజాల వరకూ అనుమతి అవసరం లేకపోవడంతో ప్రతి నిర్మాణం కూడా పురపాలకశాఖ లెక్కల్లోకి వస్తుంది. ఈ కారణంగా అవినీతికి అడ్డుకట్ట పడొచ్చని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో అక్రమ నిర్మాణాలకు నిర్మాణదారులే పూర్తి జవాబుదారీ అవుతారు.

**పటిష్ఠంగా ఆన్‌లైన్ విధానం**

అన్ని భవన నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్ కావడంతో ఆన్‌లైన్ విధానాన్ని పటిష్ఠం చేయనున్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందించడానికి ఇబ్బందులు లేకుండా సర్వర్ వేగంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలకశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఆన్‌లైన్ పోర్టల్ అందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చేస్తామని స్పష్టం చేశారు.

# కలెక్టర్లే కార్యసాధకులు

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన చేపట్టారు. అధికారులు, నిపుణులతో చర్చలు జరిపారు. చట్టం కూర్పు తుది దశలో ఉండగా.. జిల్లా కలెక్టర్లు దీనిపై ఎలా పనిచేయాలనే దానిపై... వారి నుంచే అభిప్రాయాలను, సూచనలను, సలహాలను స్వీకరించి.. ఇందులో చేర్చాలని నిర్ణయించారు. రెవెన్యూ శాఖలో అవినీతిపై ఇప్పటికే సీఎం ఆగ్రహంగా ఉన్నారు. ఆ శాఖను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు వీలుగా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వనున్నారు.

**కొత్త చట్టాల విధులపై స్పష్టత**

కొత్త పంచాయతీరాజ్ చట్టం ఇప్పటికే అమల్లో ఉంది. గత నెలలో కొత్త పురపాలక చట్టం వచ్చింది. ఈ రెండింటికీ అనుగుణంగా 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సీఎం ప్రకటించారు. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు అధికారాల వికేంద్రీకరణతో నిధుల కేటాయింపు, ప్రజాప్రతినిధులకు బాధ్యతలు, విధులపై స్పష్టత ఇవ్వాలని సీఎం భావిస్తున్నారు. వీటన్నింటిపై కలెక్టర్ల సమావేశాల్లో విస్తృతంగా చర్చించనున్నారు. త్వరలో పురపాలక ఎన్నికలు రానున్నాయి. వీటిని పురస్కరించుకొని పలు కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించే అవకాశముంది. కలెక్టర్ల సమావేశంలో సీఎం ప్రారంభోపన్యాసం కాళేశ్వరం ప్రాజెక్టు విశేషాలతో సాగనుంది. గోదావరి ద్వారా, వర్షాల వల్ల సమకూరిన జలసంపద సద్వినియోగం అయ్యేలా జిల్లా కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేస్తారు. దీంతో పాటు హరితహారం, చేపలు, గొర్రెల పెంపకం వంటివి ఎజెండాలో ఉన్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల నియామకంపై సుప్రీంలో వాదనలు

**ఈనాడు, దిల్లీ:** ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ-2018 ప్రక్రియను సెప్టెంబరు నాలుగో తేదీ నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమి, ఉపాధ్యాయ ఖాళీలపై జె.కె.రాజు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అఫిడవిట్‌లను దాఖలు చేశాయి. ఇప్పటికే 2,214 మంది ఉపాధ్యాయులను నియమించామని, హైకోర్టులో కేసుతో 4,444 నియామకాల ప్రక్రియ నిలిచిపోయిందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌పై సంతృప్తి చెందని ధర్మాసనం విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది రాధాకృష్ణన్ వాదనలు వినిపించారు.

ఉద్యోగ అవకాశాలు

भारत डायनामिक्स लिमिटेड
शांति का आधार अस्त्र-बल
BHARAT DYNAMICS LIMITED
THE FORCE BEHIND PEACE
स्वर्ण जयंती वर्ष
GOLDEN JUBILEE YEAR
150 YEARS OF CELEBRATING THE MAHATMA

Applications are invited from eligible Candidates for the following posts in Bharat Dynamics Limited, a Miniratna Category-I Public Sector Enterprise under Ministry of Defence, Government of India:

| Post | Vacancies | GR/WG. | Scale of Pay |
|---|---|---|---|
| Junior Manager (OL) | 01 (UR) | I | ₹30,000 – ₹1,20,000/- |
| Assistant – I (Hindi Translator) | 03 (UR) | 04 | ₹21,800/- (open ended) |

For detailed advertisement, please visit our website: www.bdl-india.in >careers>Recruitment. Candidates are advised to visit our website for updates.
TA&OD/Advt.2019-1
THE FORCE BEHIND PEACE

# రివర్స్ ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

వల్ల ఎదురయ్యే సమస్యలన్నింటినీ నివేదికలో పొందుపరచనున్నట్లు తెలిసింది. ఇందులో తామేమీ అభిప్రాయాలు జోడించబోమని, ఇప్పటి వరకూ చోటుచేసుకున్న వాటిని మాత్రమే పొందుపరుస్తామని పీపీఏ అధికారులు వెల్లడించారు. ఈ నెల 2న లోక్‌సభలో ఆనకట్టల రక్షణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ పోలవరం రివర్స్ టెండర్లు ప్రాజెక్టు నిర్మాణానికి అవరోధంగా మారతాయని వ్యాఖ్యానించారు. దానివల్ల ప్రాజెక్టు వ్యయం పెరుగుతుందని, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమన్నారు. 14వ తేదీన గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ గురించి వెల్లడిస్తున్న సందర్భంగా విలేకర్లు రివర్స్ టెండరింగ్‌పై గజేంద్రసింగ్‌ను ప్రశ్నించారు. ''అన్నీ గమనిస్తున్నాం. ఏం జరుగుతుందో చూద్దాం'' అని ఆయన బదులిచ్చారు. ఈ నేపథ్యంలో రీటెండర్ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఈ నెల 16న పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఏపీ ప్రభుత్వానికి లేఖ రాసింది. దాన్ని బేఖాతరు చేస్తూ ప్రభుత్వం మరుసటిరోజే కొత్త టెండర్లను పిలుస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కేంద్ర జలవనరుల శాఖ మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక కోరినట్లు సమాచారం.

## తెదేపాకు బలం, బలగం కార్యకర్తలే

- రావుల చంద్రశేఖర్‌రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్:** తెలుగు దేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని, ఇతర పార్టీల్లోకి వలస వెళ్లిన నాయకులు కాదని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ స్ఫూర్తితో, చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పార్టీలో కొత్త నాయకత్వం వస్తుందన్నారు. ఎన్టీఆర్ భవన్ అనేది నాయకులను తయారుచేసే విశ్వవిద్యాలయం వంటిదన్నారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల్లో జాప్యంపై ఈ నెల 26న ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తామన్నారు.

# జాబిలమ్మ చేరువకు..!

(మొదటి పేజీ తరువాయి)

అది 29 రోజుల తర్వాత మంగళవారం ఉదయం 9.30 గంటలకు చంద్రుని కక్ష్యలోకి చేరుకోనుంది. ఈ కక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టడం అత్యంత కీలక ఘట్టం. ఈ ప్రక్రియలో ఉపగ్రహంలోని ద్రవ ఇంజిన్‌ను మండిస్తారు.

100×100 కిలోమీటర్ల చంద్రుని కక్ష్యలో అంతరిక్ష నౌకను పెట్టేందుకు మొత్తం ఐదు విన్యాసాలు చేపట్టనున్నారు. చంద్రుడి ఆకర్షణ శక్తి ప్రభావం 65 వేల కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఆ లోపల ఉండే వస్తువును చంద్రుడు తన వద్దకు చేర్చుకునే వీలుంది. ఆగస్టు 20వ తేదీ (మంగళవారం) చంద్రయాన్-2 చంద్రుని కక్ష్యకు 150 కిలోమీటర్ల దూరానికి చేరనుంది. ఈ సమయంలో శాస్త్రవేత్తలు రీఓరియంటేషన్ ప్రక్రియను చేపట్టనున్నారు. చంద్రయాన్-2 వేగాన్ని తగ్గించి దశ, దిశ మార్చడంతో చంద్రుని కక్ష్యలోకి చేరుకోనుంది. ఆ తర్వాత సెప్టెంబరు రెండో తేదీన ల్యాండర్‌పై రెండు విన్యాసాలు చేపట్టనున్నారు. ఫలితంగా ల్యాండర్ మృదువుగా ల్యాండింగ్ కానుంది. సెప్టెంబరు 7వ తేదీ వేకువజామున 1.30 నుంచి 2.30 గంటల మధ్యలో సాఫీగా ల్యాండింగ్ చేయనుంది. ఆర్బిటర్, ల్యాండర్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలు ల్యాండింగ్ ప్రాంతాన్ని రియల్ టైమ్‌లో చిత్రాలను తీసి పంపనున్నాయి. ల్యాండర్ కింద ఉండే కెమెరాలు ల్యాండింగ్ స్థలాన్ని అధ్యయనం చేసి అక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉంటే ల్యాండ్ చేస్తాయి. ల్యాండర్ దిగిన తర్వాత అందులోని ఆరుచక్రాల రోవర్ దాదాపు నాలుగు గంటల తర్వాత బయటకు వస్తుంది. ఇది సెకనుకు సెంటీమీటరు వేగంతో పయనిస్తుంది. 14 రోజుల్లో 500 మీటర్ల దూరం చంద్రునిపై పయనించనుంది. అది అక్కడ తీసిన డేటా మొత్తాన్ని ల్యాండర్ ద్వారా 15 నిమిషాల్లో భూమిపై చేరవేయనుంది.

S.I & కానిస్టేబుల్స్
త్వరలో 15000 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
Long Term New Batches - 20-08-2019
State 1st & 2nd Ranks in TSLPRB 2016 Results
153 Genuine Selections from TSLPRB 2018 Results
Seperate Batches for TM/EM
iRise Adding Fuel To Your Inner Fire
9985999335
9985510325
Dilsukhnagar

S.I./ కానిస్టేబుల్స్ AP/TS EM TM
Intensive 1 Year Coaching
రాష్ట్రస్థాయి నెం.1 ఫ్యాకల్టీలచే అత్యుత్తమ శిక్షణ
S.P. SANTHOSH
Daily Test + Explanation
DSC TET AP/TS. EM/TM (Online Exams)
హాస్టల్ వసతి కలదు. లాంగ్‌టర్మ్ కోచింగ్
2nd Batch Starting from 21st August @5pm
A1 ACADEMY
RTC'X' ROAD, HYDERABAD
8074629993 / 8125401912

# ప్రాణం తీసిన పిల్లలాట

**పుంగనూరు గ్రామీణ(చిత్తూరు), న్యూస్‌టుడే:** అప్పటిదాకా ఆ చిన్నారులిద్దరూ హాయిగా ఆడుకున్నారు. వారిలో ఒకరు సరదాకు చేసిన పని... మరొకరి ప్రాణాల మీదకు తెచ్చింది. చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన ఈ హృదయ విదారక సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానిక ఈస్టుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హర్షవర్ధన్(6) ఒకటో తరగతి చదువుతున్నాడు. గత బుధవారం పాఠశాలలో సహ విద్యార్థితో కలిసి ఆడుకున్నాడు. కొద్దిసేపయ్యాక మరుగుదొడ్డికి వెళ్లాడు. అంతలో తోటి బాలుడు బయటి నుంచి గొళ్లెం పెట్టాడు. తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయాడు. ఎంతకూ తలుపు తీయకపోవడంతో లోపల ఉన్న హర్షవర్ధన్ భయకంపితుడయ్యాడు. సుమారు 20 నిమిషాల పాటు ఏడుస్తూ... గట్టిగా అరుస్తూ లోపలే ఉండిపోయాడు. అటుగా వెళుతున్న ఓ మహిళకు ఆ అరుపులు వినిపించి, బాలుడిని బయటకు తీసుకువచ్చింది. ఉపాధ్యాయులకు విషయం చెప్పి, తల్లిదండ్రులకు చెంతకు తీసుకువెళ్లింది. భయాందోళనలకు గురైన హర్షవర్ధన్‌కు జ్వరం వచ్చింది. తల్లిదండ్రులు రోజంతా చిన్నారికి ధైర్యవచనాలు చెబుతూ సాంత్వన చేకూర్చారు. తోటి పిల్లల మధ్య తిరిగితే భయాన్ని మరచిపోతాడనే ఉద్దేశంతో మరుసటి రోజు స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు పాఠశాలకు పంపారు. అయినా బాలునికి జ్వరం తగ్గకపోగా మరింత పెరిగింది. తల్లిదండ్రులు శనివారం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి, చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. అదేరోజు అంత్యక్రియలు పూర్తి చేశారు. బాలుని తల్లిదండ్రులు రెడ్డెప్ప, నందిని, బంధువులు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై అరుణకుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి పాఠశాలకు చేరుకుని వారిని శాంతింపజేశారు. పురపాలక కమిషనర్ లోకేశ్వరవర్మ ఉపాధ్యాయులు, బాలుడి కుటుంబసభ్యులతో మాట్లాడారు. పిల్లలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యావాలంటీరును విధుల నుంచి తొలగించారు.



చిన్నారిని లోపల ఉంచి గడియపెట్టిన మరుగుదొడ్డి

TATA MEMORIAL CENTRE
(A GRANT-IN-AID INSTITUTE UNDER DEPARTMENT OF ATOMIC ENERGY, GOVT. OF INDIA)
Advt. No. 118/2019 19.08.2019
POSITIONS AVAILABLE
Fellowship in Medical Oncology / Peadiatric Oncology
To develop career in the field of Medical Oncology, TMC invites applications from eligible candidates of Indian nationality, who are keen to pursue a career in TMC units at Different locations. Applications are invited from the Post Graduate of Internal Medicine and Paediatrics having aptitude in Medical Oncology for 2 years TMC Fellowship (1Year at TMH + 1 Year at Varanasi / Vishakhapatnam / Mullanpur / Sangrur-Punjab / BBCI Guwahati.)

| Sr. No. | Category | Qualification |
|---|---|---|
| 1 | MEDICAL ONCOLOGY | MD / D.N.B. (Internal Medicine) recognized by MCI with one year post MD/DNB experience in teaching hospital. |
| 2 | PAEDIATRIC ONCOLOGY | MD/ D.N.B. (Pediatrics) or equivalent PG degree recognized by MCI with one year post MD/DNB experience in teaching hospital. |

Last Date for online application is 06.09.2019 upto 05.30 p.m. (Indian Standard Time) and receiving hard copy of online applications is 13.09.2019. For details of the essential qualification and experience for various positions, service conditions and emoluments, how to apply etc., visit our website https://tmc.gov.in
It is mandatory to submit online applications
(BENNY GEORGE)
H.R.D.OFFICER



A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
అలుగునూర్, కరీంనగర్
Cell: 90001 80623

# ఈనాడు

## అఫ్గాన్ శాంతి భ్రాంతియేనా?

ఆంగ్లో-అఫ్గాన్ ఒప్పందం దరిమిలా 1919లో విదేశీ వ్యవహారాలనూ స్వయంగా నిభాయించుకోవడం మొదలుపెట్టిన అఫ్గానిస్థాన్ నిన్న (ఆగస్టు 19) స్వాతంత్ర్య శతవార్షికోత్సవ సంబరాల్లో మునిగి తేలాల్సింది. ఉగ్రమూకల నర్తనశాలగా దశాబ్దాలుగా దుష్కీర్తి మూటగట్టుకొని నిరంతరం నెత్తురోడుతున్న కాబూల్ నేలపై మొన్న ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) జరిపిన మానవబాంబు దాడి- ఓ కల్యాణ మండపాన్నే పీనుగుల కుప్పగా మార్చేసింది. పశ్చిమ కాబూల్‌లో జరుగుతున్న పెళ్ళి వేడుక లక్ష్యంగా జరిగిన అమానుష దాడి 63 మంది అభాగ్యుల ప్రాణాలు తోడేసి, మరో 182మందిని తీవ్ర క్షతగాత్రుల్ని చేసింది. నిన్నటికి నిన్న జలాలాబాద్‌లో పన్నెండు బాంబు పేలుళ్లు భయవిహ్వల వాతావరణాన్ని కళ్లకు కట్టాయి. మహిళలు పిల్లల్ని లక్షించిన దాడితో తమకే మాత్రం సంబంధం లేదని తాలిబాన్ చెబుతున్నా, ఉగ్రమూకలకు అండదండలందిస్తున్న తాలిబన్లే ఈ కిరాతకానికీ బాధ్యత వహించాలని అఫ్గాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ స్పష్టీకరిస్తున్నారు. ఇస్లామిక్ స్టేట్‌కు స్వర్గధామాలుగా ఉన్న ప్రాంతాలన్నింటినీ తుడిచి పెట్టేస్తామని అష్రాఫ్ ఘనీ ప్రతినబూనుతున్నా- అది అంత సులభసాధ్యం కాదన్న సంగతి ఆయనకీ తెలుసు! తాలిబన్లతో శాంతి చర్చలను సత్వరం ముగించి 14 వేల అమెరికన్ బలగాల్ని సాధ్యమైనంత తొందరగా అఫ్గానిస్థాన్ నుంచి ఉపసంహరించాలని అధ్యక్షుడు ట్రంప్ ఆరాటపడుతున్న తరుణమిది. శాంతి ప్రక్రియలో పురోగతి సంతృప్తికరంగా ఉందని ట్రంప్ ఒకవంక కితాబులిస్తుంటే, మరోవంక ఐఎస్ రక్తదాహంతో విరుచుకుపడుతోంది. తాలిబన్లను నమ్మడం అంటే గొర్రెపిల్లలకు తోడేళ్లను కాపలా పెట్టడమేనని, అఫ్గాన్ నుంచి సైనిక బలగాల ఉపసంహరణ తీవ్ర అనర్థదాయకమని మొత్తుకొన్న జేమ్స్ మ్యాటిస్ నిరుడు డిసెంబరులో అమెరికా రక్షణమంత్రి పదవికి రాజీనామా చెయాల్సివచ్చింది. అఫ్గాన్‌లో తామే రాజేసిన కుంపట్లను ఆర్పకుండా అమెరికా మూటాముల్లే సర్దుకోనుండటం- అఫ్గాన్‌తోపాటు ఉపఖండాన్నీ పెనుప్రమాదంలోకి నెట్టేస్తోంది!

స్వాతంత్ర్యానంతరం నూరేళ్ల కాలంలో కడపటి నాలుగు దశాబ్దాలూ అఫ్గానిస్థాన్ సంక్షోభాగ్నిగుండమై సెగలు కక్కుతూనే ఉంది. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో అమెరికా రష్యాల రాజకీయ చదరంగానికి వేదికగా, తరవాత ఛాందస తాలిబన్ల చెరలో చిక్కి ఉగ్ర భుజంగాల రంగస్థలిగా భ్రష్టుపట్టిపోయింది. సెప్టెంబరు 11నాటి దాడుల దరిమిలా అల్‌ఖైదా తలకొట్టి మొలేయడమే లక్ష్యంగా అమెరికా ప్రారంభించిన ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరు- అఫ్గాన్‌ను ఛిన్నాభిన్నం చేసేసింది. నాటి సమర వ్యూహంలో భాగంగా- అల్‌ఖైదాను నెత్తికెక్కించుకొన్న తాలిబన్ల తాట తీసిన అగ్రరాజ్యం, నేడు అఫ్గాన్ ప్రభుత్వ ప్రమేయం లేకుండా తాలిబన్లతోనే శాంతి చర్చలకు సిద్ధపడటమే విడ్డూరం. అఫ్గాన్ జనాభాలో 52 శాతం నివసిస్తున్న 65 శాతం జిల్లాలు తాలిబన్ల గుప్పిట్లోనో, వారి ప్రాబల్య ప్రాంతాలుగానో ఉన్నవే. ఈ నెల తొలివారంలో పోలీసు ప్రధాన కార్యాలయం వెలుపల తాలిబన్ మూకల ఆత్మాహుతి కారు బాంబుదాడి 14మందిని బలిగొని దాదాపు 150 మందిని గాయపరచిన దుర్ఘటన- జగమెరిగిన ఉగ్రశక్తిగా దాని రక్తపిపాస నైజాన్ని రుజువు చేసేదే! గత నెలలో ఉగ్రప్రకోపం ఏకంగా 1,500మంది పౌరుల ప్రాణాలతో మృత్యుక్రీడలాడింది. దశాబ్ద కాలంలో ఏకంగా 32 వేలమంది పౌరుల ప్రాణాల్ని హరించిన ఉగ్రవాదం సమసిపోయి సుభద్ర, సుస్థిర అఫ్గానిస్థాన్ కోసం సరికొత్త ప్రాంతీయ సహకార వ్యూహం 'ఇస్తాంబుల్ ఒప్పందం' పేరిట 2011 డిసెంబరులోనే సిద్ధమైనా బుసలుకొడుతున్న టెర్రరిజమే దాని సక్రమ అమలుకూ ప్రధాన అవరోధంగా మారుతోంది. ఉగ్రపడగ దించని తాలిబన్లతో అమెరికా శాంతిచర్చలు, తమ దేశ భవిష్యత్తును మరింతగా దిగలాగుతాయని అఫ్గాన్ సమాజమే ఆందోళన చెందుతోంది. ఏదో విధంగా అఫ్గాన్ నుంచి బయటపడి, అదే ఘనకార్యమంటూ వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గుకురావాలన్న ట్రంప్ వ్యూహం కాబూల్‌ను కష్టాల కాష్ఠంలోకి నెట్టేయనుంది!

దాదాపు లక్ష కోట్ల డాలర్ల వ్యయంచేసి, 2,400 మందికి పైగా సైనికుల్ని బలిపెట్టానని స్వీయ త్యాగాల చిట్టా విప్పే అగ్రరాజ్యం- అఫ్గాన్ పరిస్థితిని పెనం మీద నుంచి పొయ్యిలోకి నెట్టేసిందన్నది నిజం. వచ్చే నెలాఖరులో జరగనున్న అఫ్గాన్ అధ్యక్ష ఎన్నికల్ని బహిష్కరించాలని, ప్రచార ర్యాలీలపై ఉగ్రదాడులు జరిపే అవకాశం ఉన్నందున ప్రజలు వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించిన తాలిబన్‌తో అమెరికా 'శాంతి చర్చలు' జరపడం ఏమిటో ఎవరికీ కొరుకుడు పడని అంశం! ఉగ్రమూకలతో అన్ని సంబంధాలూ తెంచుకొని, వారికి అఫ్గాన్ గడ్డమీద ఎలాంటి ఆశ్రయమూ కల్పించబోమన్న తాలిబన్ల హామీ మేరకు తుది ఒడంబడిక కుదరనుందంటున్నారు. ఉగ్రసంస్థగా తాలిబాన్ అఫ్గాన్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటమేచేస్తుంటే, దాన్ని పట్టించుకోకుండా అది వల్లించే ధర్మపన్నాలకు అమెరికా తలూపడం ఏమిటి? ఇరాక్ సిరియాల్లో పట్టుకోల్పోయిన ఐఎస్ 2014లోనే అఫ్గాన్‌లో కాలూని, దాదాపు నాలుగు వేల ఉగ్రబలగంతో రాజ్యాధికారాన్నే కైవసం చేసుకొనే ప్రణాళికలు అల్లుతోంది. తాలిబన్లతో అమెరికా కుదుర్చుకొనే ఒప్పందంతో ఐఎస్ ముప్పు ఎలా తప్పుతుంది? ఐఎస్‌కు సంఘీభావం చాటిన తాలిబన్- అఫ్గాన్‌ను తమకు వదిలేయాలంటూ ఇరాన్ తోడ్పాటు కోసమూ పావులు కదిపినట్లు లోగడే వార్తాకథనాలు వెలుగుచూశాయి. అఫ్గాన్ కేంద్రస్థలిగా ఇస్లామిక్ రాజ్య విస్తరణకు ఐఎస్, కాబూల్‌ను చేజిక్కించుకోవాలని తాలిబన్లు మోహరించిన వేళ- అమెరికా బాధ్యత దులపరించేసుకొని జారుకొంటే, ఆ దేశం పరిస్థితేమిటి? నూరేళ్ల స్వాతంత్ర్యాన్ని ఉగ్రవ్యాఘ్రాలు నోట కరచుకుపోతే, అఫ్గాన్ భవిష్యత్తంతా చీకటి!

# తవ్వకాలతో తీరని నష్టాలు


నల్లమల అడవులు

నల్లమల అడవుల్లో మళ్ళీ 'యురేనియం' అలజడి మొదలైంది. ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు చేపట్టనున్నట్లు వస్తున్న వార్తలు స్థానికుల్లో కలవరం కలిగిస్తున్నాయి. దీనివల్ల ఎదురయ్యే దుష్ఫలితాల గురించి వారు ఆందోళన చెందుతున్నారు. ఇవేమీ కేంద్ర ప్రభుత్వానికి పట్టినట్లు లేదు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. తన నిర్ణయం అమలు దిశగానే కేంద్రం అడుగులు వేస్తోంది. గతంలోనూ ఈ విషయమై కొంత హడావుడి జరిగింది. 2005లో నల్గొండ జిల్లాలోని పెద్దగట్టు, లంబాపూర్‌లలో తవ్వకాలు చేపట్టాలని ప్రతిపాదించారు. తొలుత మల్లాపురం, తరవాత సేరిపల్లిలలో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ముందుకు వెళ్లలేదు. తాజాగా నాగర్ కర్నూలు, నల్గొండ జిల్లాల్లో విస్తరించిన నల్లమల అడవుల్లో యురేనియం అన్వేషణ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న అటవీ సలహా కమిటీ, నల్లమలలో యురేనియం కోసం దాదాపు నాలుగువేల బోర్ల తవ్వకాలకు సూత్రప్రాయ అనుమతికి నిర్ణయం తీసుకుంది. అణు విభాగం, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన దరఖాస్తులో మూడు అంగుళాల బోర్లు వెయ్యి, ఏడు అంగుళాల బోర్లు మూడువేలు తవ్వుతామని పేర్కొంది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ గత నెలలో తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శికి తెలియజేసింది.

## నల్లమలలో యురేనియం అన్వేషణ

### అడవుల విధ్వంసం

యురేనియం తవ్వకాలపై పర్యావరణవేత్తలు ఆది నుంచీ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్రమైన హాని వాటిల్లుతుంది. అడవుల్లో నివసించే స్థానిక గిరిజనుల ఉపాధి దెబ్బతింటుంది. వారు ఉన్న ఊరు వదిలి పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. అడవిలో నివసించే వన్యప్రాణుల మనుగడకు ముప్పు తలెత్తి, అవి వేరే ప్రాంతానికి వలస వెళ్లాల్సివస్తుంది. ఒకవేళ అవి అక్కడే ఉంటే యురేనియం తవ్వకాల వల్ల రేడియేషన్ ప్రభావానికి గురవుతాయి. సమీపంలో ప్రవహించే కృష్ణా నదీ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ నదీజలాలు హైదరాబాద్ తాగునీటి సరఫరాలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ జలాల ఆధారంగా లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. నీరు కలుషితమైతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒకపక్క పర్యావరణ పరిరక్షణకు చట్టాలు చేస్తూ మరోపక్క దాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించడంలో అర్థం లేదు. యురేనియం తవ్వకాల వల్ల కలిగే ప్రయోజనాల కన్నా ఎదురయ్యే అనర్థాలే ఎక్కువన్న పర్యావరణవేత్తల ఆందోళనను తోసిపుచ్చలేం! ఈ పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ దిశగా వివిధ దేశాలను సన్నద్ధం చేస్తోంది. ఐరాస ఏర్పాటు చేసిన ఐపీసీసీ (ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్) కమిటీ ఇటీవల జెనీవాలో ఒక నివేదిక విడుదల చేసింది. గాలిలో బొగ్గుపులుసు వాయువును తొలగించడంలో అడవుల పాత్ర, ప్రాధాన్యాలను నివేదిక వివరించింది. అడవుల విధ్వంసాన్ని ఆపి, వాటిని పునరుద్ధరించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. 1990 తరవాత ప్రపంచవ్యాప్తంగా 'అభివృద్ధి' పనుల పేరిట మూడు శాతం అడవులు హరించుకుపోయాయి. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం సహజ సంపదను ధ్వంసం చేయడం మొదలైంది. పెట్టుబడిదారుల ప్రయోజనాలు ప్రకృతికి విఘాతంగా పరిణమిస్తున్నాయి.

అడవులను కాపాడుకోవలసిన, విస్తరించాల్సిన ఆవశ్యకతపై ఐపీసీసీకి సమర్పించిన నివేదికలో శాస్త్రవేత్తలు ముఖ్యాంశాలను ప్రస్తావించారు. అడవుల సంరక్షణకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వడం ఇందులో కీలకమైనది. అడవుల మూలాలు దెబ్బతినకుండా అక్కడి సహజ వనరులను వినియోగించుకుని అభివృద్ధికి బాటలు వేయాలి. పారిస్ ఒప్పందం ప్రకారం ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీలకు మించకుండా ఉంచడానికి అన్ని చర్యలు చేపట్టాలి. అడవుల ధ్వంసానికి అడ్డుకట్ట వేయాలి. అదుపు తప్పుతున్న భూతాపం నుంచి అడవులను సంరక్షించడం అవసరం. పారిస్ ఒప్పందం మేరకు అడవుల పునరుద్ధరణ తప్పనిసరి. అడవులను విస్తరించి వాటికి పునర్ వైభవం కల్పిస్తే అవి అదనంగా 18 శాతం వరకు కర్బనాన్ని తొలగించి ప్రమాదస్థాయిని తగ్గించగలవు. కట్టెలను ఇంధనంగా వాడి, విడుదలైన బొగ్గుపులుసు వాయువును సాంకేతికతతో తొలగించి, భూమిలో నిక్షిప్తం చేద్దామనే ఆలోచన ఇంకా ఆచరణ యోగ్య దశకు చేరలేదు. గాలిలోని కర్బనాన్ని తొలగించే ఉష్ణమండల అడవులను సంరక్షించుకోవడం ప్రయోజనకరం. ఉష్ణమండల అడవులు (నల్లమల లాంటివి) సహజమైన ఎయిర్ కండిషన్ (ఏసీ) యంత్రంలా పనిచేసి పరిసరాల ఉష్ణోగ్రతలను తగ్గిస్తాయి. అడవుల ధ్వంసం వల్ల పరిసర ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల వరకు పెరగవచ్చు. నల్లమల అడవులు తెలుగు రాష్ట్రాల సహజ వారసత్వ సంపద. ఇవి జీవ వైవిధ్యానికి నెలవుగా ఉన్నాయి. అనేక రకాల వన్యప్రాణులు ఇక్కడ జీవనం సాగిస్తున్నాయి. యురేనియం తవ్వకాల వల్ల ఈ అడవులు తమ సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. హరితహారం వంటి కార్యక్రమాలు అడవులకు ప్రత్యామ్నాయం కావు. గత 30 సంవత్సరాల్లో తెలంగాణలో దాదాపు 56 వేల హెక్టార్ల అటవీ భూమిని గనుల తవ్వకాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపన, నీటి పారుదల పథకాలు, రక్షణ అవసరాలకు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 68వేల హెక్టార్ల అటవీ భూములను అభివృద్ధి పథకాల కోసమంటూ మళ్లించారు.

### చేదు అనుభవాలు

అణు విద్యుదుత్పాదన పెంచేందుకు యురేనియం తవ్వకాలు చేపడుతున్నట్లు అణుశక్తి శాఖ చెబుతోంది. ప్రస్తుతం దేశంలో అణుశక్తి స్థాపిత సామర్థ్యం 1.9 శాతమే. ప్రపంచవ్యాప్తంగా అణువిద్యుత్ వాటా తగ్గుతున్నట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (2018) నివేదిక వెల్లడించింది. ప్రపంచంలో ప్రస్తుత అణు విద్యుత్ వాటా 11శాతం లోపే. 2050 నాటికది 5.6 శాతానికి పడిపోనుందని అంచనా. అణు విద్యుత్ ధర కూడా ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడలో ప్రతిపాదించిన అణువిద్యుత్ కర్మాగారంలో ఉత్పత్తి చేసే యూనిట్ ధర రూ.20 నుంచి రూ.32 వరకు ఉంటుందని ఒక అంచనా. విద్యుదుత్పత్తికి ప్రమాద రహిత ప్రత్యామ్నాయాలు ఎన్నో ఉన్నాయి. థర్మల్, జల, సౌర విద్యుత్ వంటివి ఉన్నాయి. వాటిని విస్మరించి అడవులను ధ్వంసం చేసి, ఆదిమ తెగ చెంచులను నిర్వాసితులను చేసి, నదులను విషమయం చేసి, పరిసర ప్రాంత ప్రజల బతుకులను పణంగా పెట్టే అణువిద్యుత్తుపై దృష్టి సారించడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలకు సరైన సమాధానం లభించదు. ప్రపంచవ్యాప్తంగా యురేనియం తవ్వకాలు చేపట్టిన ప్రతిచోటా ఆ ప్రాంత ప్రజలకు విషాదమే మిగిలింది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా తుమ్మలపల్లి ప్రాంతంలో జరిగిన విధ్వంసం తెలిసిందే. ఆ ప్రాంత రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలో ఎడారీకరణలో ముందున్న తొమ్మిది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. రాష్ట్రంలో 31.34 శాతం నేల ఎడారీకరణకు సంబంధించి వివిధ దశల్లో ఉంది. ఈ పరిస్థితుల్లో ఉన్న కొద్ది అడవులను, అందునా కీలకమైన నల్లమల వంటివాటిని కాపాడుకోవడం అవసరం. ఇక్కడ యురేనియం తవ్వకాలు చేపట్టడం వల్ల కలిగే లాభాల కన్నా నష్టాలే అధికం! ఈ నిర్ణయం అటవీప్రాంత ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తుంది!

**- డాక్టర్ కె.బాబూరావు**
(రచయిత- పర్యావరణ రంగ నిపుణులు)

### పర్యావరణానికి పెను శాపం

దట్టమైన అడవులు మేఘాలను ఆకర్షించి వానలు కురిసేలా చేస్తాయి. ఒక చెట్టు ఇచ్చే నీడ, చల్లదనం- ఆధునిక ఎయిర్ కండిషన్ (ఏసీ) యంత్రం కూడా ఇవ్వలేదు. అడవుల నిర్మూలన వాతావరణంపై చూపే ప్రభావానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా పలు అధ్యయనాలు జరిగాయి. అడవుల ధ్వంసం వల్ల వర్షపాతం తగ్గే ప్రమాదం ఉంది. అమెజాన్ అడవుల నరికివేతతో కరీబియన్ దీవుల్లో వర్షపాతం తగ్గినట్లు గుర్తించారు. ఇండొనేసియాలోని బోర్నియో దీవిలో అటవీ నిర్మూలన వల్ల ఆ దీవిలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. వర్షపాతం సైతం తగ్గిందని పరిశోధనలు నిర్ధారిస్తున్నాయి. పులులు, ఇతర వన్యప్రాణులు నశిస్తే నల్లమల అడవులు సహజత్వాన్ని కోల్పోతాయి. ఇప్పుడు జరుగుతున్న వినాశనం పూర్తిగా మానవ ప్రేరితం. అడవుల ధ్వంసం వల్ల కలిగే అనర్థాలపై ఐరాస సదస్సులు, నివేదికలు ఇప్పటికే పలు హెచ్చరికలు చేశాయి. ప్రమాద ఘంటికలు మోగించాయి. వాతావరణ మార్పుల మూలాన దాదాపు పది లక్షల జీవులు అంతరించే దశకు చేరువవుతున్నాయి. కీటకాలు పదేళ్లలో 25 శాతం నశిస్తాయని, 2050 నాటికి 50 శాతం నశిస్తాయని, శతాబ్దాంతానికి పూర్తిగా కనుమరుగవుతాయని పరిశోధనలు పేర్కొంటున్నాయి. దీనివల్ల ప్రకృతి సమతూకం దెబ్బతిని మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. ప్రకృతి అందించే సేవల ముందు ఆర్థిక వ్యవస్థ కల్పించే ప్రయోజనాలు పరిమితమే.

# ఆచితూచి వేయాలి అడుగు!

స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు రెండువైపులా పదునున్న కత్తిలాంటివి. దేశ ఆర్థిక వ్యవస్థలను నిలబెట్టేవి కొన్ని... నిలువునా కూల్చేసేవి మరికొన్ని! పది దేశాల 'ఆసియాన్' కూటమితోపాటు- దానితో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలున్న ఇండియా, చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియాలతో కూడిన 16 దేశాల ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య(ఆర్‌సీఈపీ)న్ని పట్టాలకెక్కించేందుకు గడచిన ఆరేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పదహారు భాగస్వామ్య దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్యపరమైన అడ్డంకులు తొలగించి స్వేచ్ఛావాణిజ్య వాతావరణం నెలకొల్పే క్రమంలో కొన్ని సంవత్సరాలుగా అనేక అడ్డంకులు తలెత్తుతున్నాయి.

### సమాన లబ్ధిపై సందేహాలు

పదహారు దేశాల మధ్య బృహత్తర, స్వేచ్ఛా, ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్యంవల్ల ఏ దేశానికి ఎంత మేలు ఒనగూడుతుందన్న విషయంలో వివిధ అనుమానాలున్నాయి. భాగస్వామ్య పక్షాలన్నింటికీ దీనివల్ల సమానంగా లబ్ధి చేకూరుతుందా అన్న విషయంలో ఇప్పటికీ భారత్‌కు కొన్ని అనుమానాలున్నాయి. 'ఆర్‌సీఈపీ' ఏర్పాటుపై కొన్ని రోజుల క్రితం భాగస్వామ్య పక్షాల మధ్య చర్చలు జరిగాయి. దేశాల మధ్య అనుమానాలు పూర్తిగా నివృత్తి అయ్యి, ముఖ్యంగా అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న భారత్ ఆమోదం లభిస్తే 'ఆర్‌సీఈపీ' అతిత్వరలోనే సాకారం కావచ్చు. మార్కెట్లతో అనుసంధానం, న్యాయమైన వాణిజ్య విధానాలకు సంబంధించి చైనా తరచూ అనుసరిస్తున్న మొండివైఖరి భారత్‌కు చికాకు కలిగిస్తోంది. ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ ధరలకే వస్తువులను తయారు చేసి వాటిని గుండుగుత్తగా ప్రపంచ విపణిలో గుమ్మరించే విద్యలో చైనా మొదటినుంచి ఆరితేరిపోయింది. చైనా దూకుడు, ఆధిపత్య వైఖరి వివిధ దేశాలకు వాణిజ్యపరంగా ఇబ్బందికరమైన వాతావరణం సృష్టిస్తోంది. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న, కనిష్ఠ సుంకాలు వసూలు చేస్తున్న దేశాలను ఉపయోగించుకుని చైనా తన ఉత్పత్తులను వాటంగా ప్రపంచ మార్కెట్లోకి విడుదల చేస్తోంది. ఈ సమస్యను భారత్ గుర్తించింది. అందుకే 'ఉత్పత్తుల మూలస్థానం' అన్న నిబంధనను తీసుకురావాలని లేదా అంతర్జాతీయ వాణిజ్య ఎక్స్ఛేంజీలలో ఉత్పత్తులను నిర్దిష్ట విభాగాలుగా వర్గీకరించాలని భారత్ డిమాండ్ చేస్తోంది. ఇలా చేయడం ద్వారా తక్కువ సుంకాలు ఉన్న దేశాల గుండా ఆయా ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లో ప్రవేశించినప్పటికీ వాటి మూలస్థానంపై స్పష్టత ఉంటుంది. కాబట్టి సహేతుక ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు అవకాశాలు ఉంటాయి. భారీయెత్తున వస్తువులు తయారుచేసి ఆయా దేశాల విపణుల్లోకి అకస్మాత్తుగా జొరబడటమన్నది చైనా ఉత్పత్తి రంగానికి మేలు చేయవచ్చు. కానీ, అలాంటి దేశంతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం భారత పారిశ్రామిక రంగానికి గొడ్డలిపెట్టుగా మారుతుంది. స్వేచ్ఛావాణిజ్యానికి అంగీకరిస్తే దిగుమతులపై సుంకాలు విధించే అవకాశాలు మూసుకుపోతాయి. భారతీయ విపణులను అడ్డూ ఆపూ లేకుండా చైనా ఉత్పత్తులు ఆక్రమిస్తాయి. దానివల్ల భారత పారిశ్రామిక రంగంపై కోలుకోలేని దెబ్బ పడుతుంది. సృజనాత్మక బాటలో, సాంకేతిక విజ్ఞానాన్ని కొత్తపుంతలు తొక్కించి ఉత్పత్తి రంగానికి ఊపునిచ్చే క్రమంలో భారత్ ఇప్పటికే బాగా వెనకబడి ఉంది. అందువల్లే చైనా సహా అనేక దేశాలు మన బలహీనతను అవకాశంగా మలచుకుంటున్నాయి. 'భారత్‌లో తయారీ' వంటివి పూర్తిగా ఆచరణలోకి రాకుండా కేవలం నినాదాల స్థాయిలోనే మిగిలిపోతున్నాయి.




### 'ఆర్‌సీఈపీ'లో భారత్ భాగస్వామ్యం

చైనా విషయాన్ని పక్కనపెడితే ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య కూటమిలోని ఇతర దేశాలతో ప్రస్థానమైనా భారత్‌కు మేలు చేస్తుందా అంటే అదీ అనుమానమే! ఎందుకంటే ఆర్‌సీఈపీలోని అన్ని దేశాలూ భారత మార్కెట్‌పైనే ఆశలు పెట్టుకున్నాయి. తమ ఉత్పత్తులను విస్తారమైన భారత మార్కెట్లలో విక్రయించి సొమ్ము చేసుకోవడమేగాని- భారతీయ ఉత్పత్తులను తమ మార్కెట్లలోకి ఆహ్వానించే ఉద్దేశం ఏ దేశానికీ లేదు. ఈ నేపథ్యంలో భారతీయ విధాన కర్తలు ఆచరణాత్మక దృక్పథంతో ముందడుగు వేయాలి. లాభనష్టాల పక్కా లెక్కలపైనే అంతర్జాతీయ వాణిజ్యం జరుగుతుంది గాని- ఔదార్యం, సేవాదృక్పథం అన్న పదాలకు అక్కడ స్థానం లేదు. నాణ్యమైన, సృజనాత్మకమైన ఉత్పత్తులకే ప్రపంచ విపణి గౌరవమిస్తుంది. దేశాల మధ్య సుహృద్భావాలు, సత్సంబంధాలు వంటివాటికి వాణిజ్య బంధంలో చోటు లేదు. 2018లోనూ అంతకుముందు సంవత్సరాల్లోనూ భారత వాణిజ్యం ఆరు 'ఆసియాన్' దేశాలతో 2,300 కోట్ల డాలర్ల లోటు బాటలో సాగింది. మొత్తంగా ఆర్‌సీఈపీ దేశాలతో భారత్‌కు 8,700 కోట్ల డాలర్ల లోటు ఉంది. 'ఆసియాన్' దేశాల్లో భారత్‌కు ఇండొనేసియాతో అతిపెద్ద వాణిజ్య లోటు (1,120 కోట్ల డాలర్లు) ఉండగా, మలేసియా (390 కోట్ల డాలర్లు), సింగపూర్ (380 కోట్ల డాలర్లు), థాయ్‌లాండ్ (320 కోట్ల డాలర్లు), వియత్నామ్‌ల(60 కోట్ల డాలర్లు)తోనూ భారత వాణిజ్యం ప్రతికూల మార్గంలోనే కొనసాగుతోంది. చైనాతో ఇండియాకు అతిపెద్ద వాణిజ్య లోటు (5,700 కోట్ల డాలర్లు) ఉంది. ఇది మొత్తంగా ప్రపంచ దేశాలతో భారత్ వాణిజ్య లోటు (18,500 కోట్ల డాలర్లు)లో 31 శాతానికి సమానం. భారత్‌నుంచి చైనాకు ఎగుమతుల విలువ 1,650 కోట్ల డాలర్లు. మొత్తంగా భారత్ ఎగుమతుల్లో (32,400 కోట్ల డాలర్లు) ఇది అయిదు శాతానికి సమానం. చైనానుంచి భారత్ చేసుకుంటున్న దిగుమతుల విలువ 7,380 కోట్ల డాలర్లు. ఆర్‌సీఈపీ దేశాలకు భారత్ చేస్తున్న ఎగుమతుల విలువ 6,613 కోట్ల డాలర్లు. ఇది మొత్తంగా భారత్ చేస్తున్న ప్రపంచ ఎగుమతుల్లో 20.4శాతానికి సమానం. ఈ దేశాలనుంచి భారత్ చేసుకుంటున్న దిగుమతుల విలువ మాత్రం 17,461 కోట్ల డాలర్లు కావడం గమనార్హం. భారత మొత్తం దిగుమతుల్లో ఇది 34.4శాతానికి సమానం. ఆర్‌సీఈపీ దేశాలతో భారత్‌కు 10,900 కోట్ల డాలర్ల వాణిజ్య లోటు ఉంది. ఈ పరిస్థితుల్లో ఆర్‌సీఈపీ బృహత్ కూటమిలో భాగస్వామి కావడంవల్ల భారత్‌కు ఏమైనా ఉపయోగముందా అన్నది తర్కించుకోక తప్పని ప్రశ్న.

### ఆదాయానికి గండి

ఆర్‌సీఈపీ దేశాలు కూటమికి ఆవల ఉన్న దేశాల నుంచి దిగుమతులను తగ్గించుకుని భారత ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తే ఈ సమస్య కొంతవరకు పరిష్కారమవుతుంది. మరోవంక సృజనాత్మకంగా, నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి భారత్ ప్రాధాన్యం పెంచాలి. తద్వారా భారత ఎగుమతుల పరిమాణం ఇనుమడిస్తుంది. ఆర్‌సీఈపీలో చేరడంవల్ల ఆయా దేశాల ఉత్పత్తుల మధ్య స్వేచ్ఛా ప్రసారం పెరిగి భారత కస్టమ్స్ ఆదాయానికి గండిపడవచ్చు. దీనివల్ల ఇప్పటికే ఉన్న వాణిజ్య లోటు మరింత పెచ్చరిల్లే ప్రమాదమూ కొట్టిపారేయలేనిది. దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యంవల్ల పెట్టుబడులు విస్తరించడంతోపాటు భారత్‌లోని నైపుణ్య మానవ వనరులకు ఆయా దేశాల్లో ప్రాధాన్యం లభించే అవకాశాలూ ఉన్నాయి. కాబట్టి, ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యంపై లాభనష్టాలను సహేతుకంగా అంచనా వేసుకున్న తరవాతే భారత్ ఒక నిర్ణయానికి రావాలి!

**- సత్యపాల్ మేనన్**

## అంతర్యామి

### ఇచ్ఛ

ఇచ్ఛ మనిషికి ప్రకృతి ప్రసాదించిన దివ్యశక్తి. కోరిక, వాంఛ, ఆశ, తపన, వ్యామోహం... ఇవన్నీ ఈ శక్తి నుంచే పుడతాయి. బంధమోక్షాలు రెండింటికీ ఇదే కారణం. దుఃఖానికి, ఆనందానికి ఇదే మూలం. ఇదే స్థితప్రజ్ఞతను అందిస్తుంది, పతనాన్నీ శాసిస్తుంది. అందుకే శాస్త్రాలన్నీ దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని చెబుతాయి. మనిషి జీవన ప్రయాణానికి ఇచ్ఛ తెరచాప వంటిది. దీన్ని ఎక్కడ ఎలా దించాలో, ఎప్పుడు ఎలా పైకెత్తాలో తెలిస్తే జీవన ప్రయాణం ఆనందంగా సాగుతుంది.

సృష్టిలో ఏ ఇచ్ఛా లేని మనిషి ఉండడు. ఉన్నా జీవించలేడు. జీవించాలన్నదీ ఒక ఇచ్ఛే. అలాగే ఇచ్ఛ లేని దేవతా లేదు. పరమాత్మ ప్రతి అవతారం వెనక ఒక ఇచ్ఛ దాగి ఉంది. దుష్ట సంహరణేచ్ఛతో దుర్గ అవతరించింది. ధర్మాన్ని ఆచరించి చూపేందుకు శ్రీరాముడు అవతరించాడు. సృజించాలని బ్రహ్మ, పాలించాలని విష్ణువు, లయించాలని రుద్రుడు ఇచ్ఛ కలిగి ఉన్నారు.

ఇచ్ఛే లేకపోతే సృష్టి ఉనికే లేదు. సృష్టి చేయాలనే ఈశ్వరేచ్ఛ నుంచే సకల జగత్తు ఉద్భవించింది. ఆయన ఇచ్ఛానుసారమే నడుస్తోంది. ఆయన ఇచ్ఛాశక్తి నుంచి పుట్టిన మనిషీ ఆ శక్తిని పూర్ణంగా పొందాడు. స్వేచ్ఛా (స్వ+ఇచ్ఛ) జీవి అయ్యాడు. తన ఇచ్ఛానుసారం జీవించగలుగుతున్నాడు. తన జీవనమార్గాన్ని తానే ఎంచుకోగలుగుతున్నాడు. ప్రకృతి మనిషికి శ్రేయస్సు, ప్రేయస్సు అనే రెండు మార్గాలను చూపింది. ఏ మార్గంలో నడవాలో ఎంచుకునే స్వేచ్ఛనూ ఇచ్చింది. ఏ మార్గంలో నడిస్తే, ఏ ఫలితాలుంటాయో తెలుసుకునే బుద్ధి కుశలతనూ ఇచ్చింది. తనకు ఏది ఉచితమో గ్రహించి ఆ మార్గంలో అడుగిడితే, తన ఇచ్ఛాశక్తి మనిషికి ఆ మార్గంలో తోడవుతుంది.

ప్రేయోమార్గంలో నడిస్తే ఇంద్రియ సుఖాలే పరమావధి అవుతాయి. అంతులేని కోరికలతో, అంతంలేని ఆశలతో ఇది నిండి ఉంటుంది. జీవించి ఉన్నంత కాలం, మరణంలోనూ కోరికలు మనిషిని వెంటాడతాయి.



ఇంద్రియ సుఖాల పరిధిని గ్రహించిన వ్యక్తి మాత్రమే ఆదర్శ జీవితాన్ని కోరతాడు. శ్రేయోమార్గంలో నడుస్తాడు. మనిషికి, జంతువుకు తేడాను పరిశీలిస్తాడు. మనిషి జన్మ ఎత్తింది ఇష్టానుసారం జీవించడానికి కాదు. ఉన్నతమైన ఆదర్శాలకోసం అని గ్రహిస్తాడు. దీనికి అనువైన ఇచ్ఛాప్రవృత్తిని అలవరచుకుంటాడు.

కోరికలను జయించడం మనిషికి అంత సులభం కాదు. దీనికి అభ్యాసం కావాలి. ఏ ఘనకార్యమైనా, ప్రతిఘటన లేకుండా సాగదు. దైవాన్ని, సంఘాన్ని, ఆదర్శాలను అంటిపెట్టుకున్న మనసు అన్ని అవరోధాలను అధిగమిస్తుంది. సన్మార్గాన్ని బోధించే మిత్ర బృందాన్ని ఏర్పరచుకొని సత్సాంగత్యం చేయాలి. ధర్మం, దైవం అనే దివ్యాయుధాలతో దుర్భేద్యమైన ఇంద్రియ వ్యామోహాలను మనిషి జయించగలడనే వేద వాక్కును ఆచరణలో పెట్టాలి. ధర్మాన్ని ఆదర్శంగా తీసుకుని ఆచరించాలి. దైవాన్ని దైవంగానే భావించాలి తప్ప కోరికలు తీర్చే ఇంద్రజాలంగా భావించరాదు. దైవానికి భక్తుడికి మధ్య కోరిక అనే తెరను తొలగించాలి. ఏ పని దైవానికి దగ్గర చేస్తుందో దానిపైన కోరిక ఉంచాలి. ఈ కోరిక నన్ను పరమాత్మ ముందు దోషిగా నిలబెడుతుందని భావిస్తే వెంటనే ఆ కోరికను వదిలిపెట్టేయాలి.

ఈ భక్తితత్వం మనిషిలో సత్వగుణాధిక్యత పెంచుతుంది. సత్వగుణం పెరిగేకొద్దీ ఆశావ్యామోహాలతో నిండిన రజోగుణం, ఇంద్రియ వాంఛలతో నిండిన తమోగుణం క్రమంగా క్షీణిస్తాయి. సత్వగుణమంతా దివ్యత్వంతో నిండి ఉంది. దీనినుంచి పుట్టిన ప్రతీ ఇచ్ఛ, దైవేచ్ఛ అవుతుంది. ఇచ్ఛను జయించాలి. ముక్తి పొందాలి అనే కోరిక కోరిక కాదు. నిస్వార్థపు కోరికా కోరిక కాదు. ఇవి మనిషిని బంధించవు, బాధించవు. ఉన్నతిని మాత్రం ప్రసాదిస్తాయి.

**- పిల్లలమర్రి సి.వి.సత్యనారాయణ**

# మూడోసారి.. విజయ భేరి

- సివిల్స్‌లో తుది ఎంపికలు తృతీయ ప్రయత్నంలోనే అధికం
- మెయిన్‌లో ఐచ్ఛిక సబ్జెక్టుగా భౌగోళికశాస్త్రానిది అగ్రస్థానం
- మాతృభాషలు ఎంపిక చేసుకునే వారి సంఖ్య ఏటేటా తగ్గుముఖం
- సివిల్స్‌పై 2017-18 యూపీఎస్సీ నివేదిక వెల్లడి




దేశంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే సివిల్ సర్వీసెస్‌లో అత్యధికులు మూడో ప్రయత్నంలోనే విజేతలుగా నిలుస్తున్నారు. ప్రిలిమినరీ నుంచి మెయిన్‌కు, మెయిన్ నుంచి ముఖాముఖికి వెళ్లి విజయం సాధిస్తున్న వారిలో దాదాపు నాలుగో వంతు మంది వారే ఉంటున్నారు. మొదటి సారి విఫలమైనవారు... రెండోసారి తమ లోపాలను గుర్తించి కొంత వరకు విజేతలుగా నిలుస్తున్నా మూడో ప్రయత్నంలో మాత్రం మెలకువలను పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకొని ఎక్కువ మంది తమ లక్ష్యాన్ని సాధిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మరో వైపు భౌగోళిక శాస్త్రం ఐచ్ఛిక సబ్జెక్టుగా ఎంపిక చేసుకొని...విజేతలుగా నిలుస్తున్న వారు ఎక్కువ మంది ఉంటున్నారు. 2016 సివిల్స్‌పై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసిన 2017-18 నివేదికలో పొందుపరిచిన సమాచారం ఈ విషయాలను స్పష్టం చేస్తోంది. అంతకుముందు సంవత్సరం నివేదికను పరిశీలించినా 'తృతీయ' విజేతలదే పైచేయిగా ఉండటం గమనార్హం.




## నివేదికలోని ముఖ్యాంశాలివీ..

- దాదాపు 70 శాతం ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్హత కలిగిన వారే సివిల్స్‌కు ఎంపికవుతున్నారు.
- భారతీయ భాషలను ఐచ్ఛిక సబ్జెక్టులుగా ఎంపిక చేసుకుంటున్న వారి సంఖ్య తగ్గిపోతున్నారు. 2016 మెయిన్‌లో తెలుగును 112 మంది ఎంపిక చేసుకోగా...2017లో ఆ సంఖ్య 72కు తగ్గిపోయింది.
- ప్రిలిమినరీ పరీక్ష రాసే వారిలో 21-24 వయసు వారే ఎక్కువ మంది(25.9 శాతం) ఉంటున్నారు. 24-26 వయసు వారు మెయిన్‌లో 25.30 శాతం... చివరకు ఎంపికయ్యే వారు 27.5 శాతం మంది ఉన్నారు.



మెయిన్‌కు ఎంపికైన వారిలో ఏ ప్రయత్నంలో ఎంతమందంటే...



తుది విజేతలుగా నిలిచిన వారిలో

**ఏ ఐచ్ఛిక సబ్జెక్టుతో ఎక్కువ మంది ఎంపికయ్యారంటే..**

| సబ్జెక్టు | ముఖాముఖి | ఎంపిక |
|---|---|---|
| భౌగోళికశాస్త్రం | 3,427 | 203 |
| సోషియాలజీ | 1,635 | 132 |
| పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ | 1,506 | 160 |
| చరిత్ర | 1,427 | 60 |
| పొలిటికల్ సైన్స్ | 1,218 | 107 |
| ఆంత్రోపాలజీ | 922 | 102 |
| ఫిలాసఫీ | 847 | 44 |
| గణితం | 406 | 29 |
| మెడికల్ సైన్స్ | 368 | 61 |
| న్యాయశాస్త్రం | 313 | 12 |

### విఫలమైనా ప్రయత్నం ఆపరాదు – గోపాలకృష్ణ, సివిల్స్ శిక్షణ నిపుణుడు

రెండు నుంచి నాలుగో ప్రయత్నం వరకు ఎక్కువ మంది విజేతలు ఉంటున్నారు. ఒక ప్రయత్నంలో చేసిన తప్పులను సరిదిద్దుకొని ముందుకు వెళ్తున్నారని దీన్ని బట్టి అర్థమవుతోంది. అభ్యర్థులు సైతం బహుళ ప్రయత్నాలకు సిద్ధమై ఉండాలి. ఒకసారి విఫలమైనా ప్రయత్నాన్ని విరమించుకోకుంటే విజేతలుగా నిలవవచ్చు.

- ఈనాడు, హైదరాబాద్


గుత్తా సుఖేందర్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు. పక్కన మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే సునీత

## ఎమ్మెల్సీగా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ స్థానానికి ఆయన ఒక్కరే బరిలో ఉండటంతో ఆయన ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు ఆయనకు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. మంత్రులు జగదీష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, శాసనసభ్యులు, మండలి సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ, 'మూడుసార్లు ఎంపీగా గెలిచిన నేను కేసీఆర్ ఇచ్చిన అవకాశంతో ఎమ్మెల్సీని అయ్యాను. దీన్ని గురుతర బాధ్యతగా భావిస్తా. ప్రజాసేవకే నా పదవిని వినియోగిస్తాను' అని తెలిపారు.

### శాసనమండలిలో పెరిగిన తెరాస బలం

గుత్తా ఎంపికతో శాసనమండలిలో తెరాస బలం మరింత పెరిగింది. మొత్తం 40 స్థానాలకు గాను 38 భర్తీ అయ్యాయి. గవర్నర్ కోటా, నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం ఖాళీగా ఉన్నాయి. మొత్తం 38 స్థానాలకు గాను 31 తెరాస, మజ్లిస్, పీఆర్‌టీయూ నుంచి ఇద్దరు చొప్పున, భాజపా, కాంగ్రెస్, యూటీఎఫ్‌ల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. ఇందులో పీఆర్‌టీయూ తెరాసకు అనుకూలం కాగా, మజ్లిస్ మిత్రపక్షంగా ఉంది.


క్రస్ట్‌గేట్లు మూసిన అనంతరం నాగార్జునసాగర్ బ్యారేజీ

## సాగర్‌గేట్ల మూసివేత

ఈనాడు, హైదరాబాద్, నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గిపోయింది. ఆదివారం సాయంత్రం శ్రీశైలం వైపు నుంచి 4.23 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. సోమవారం సాయంత్రానికి అది 70 వేలకు పడిపోయింది. దీంతో సాగర్ 26 క్రస్ట్‌గేట్లు మూసివేశారు. 7 రోజుల పాటు ఈ జలాశయం గేట్ల ద్వారా సుమారు 320 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్‌కు దిగువన అడవిదేవులపల్లి మండల శివారులో ఉన్న టెయిల్‌పాండ్ గేట్లు సైతం మూతపడ్డాయి. తుంగభద్రకు కూడా ప్రవాహం తగ్గిపోయింది.

ఎగువనుంచి ప్రవాహం తగ్గడంతో శ్రీశైలం 10 గేట్ల నుంచి విడుదల చేస్తున్న నీటిని సోమవారం సాయంత్రానికి రెండు గేట్లకు తగ్గించి కిందికి వదులుతున్నారు. వరద తగ్గడంతో పులిచింతల ప్రాజెక్టు గేట్లను కూడా సోమవారం సాయంత్రం మూసివేసినట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు తెలిపారు.

### లక్ష్మీ బ్యారేజీ వద్ద తగ్గుతున్న ప్రవాహం

మహదేవ్‌పూర్, కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ బ్యారేజీ(మేడిగడ్డ) వద్ద నీటి ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో గేట్లను ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారు. సోమవారం 22 గేట్లను మాత్రమే తెరిచి ఉంచారు. 1.11 లక్షల క్యూసెక్కుల ప్రవాహం పైనుంచి వస్తుండగా అంతే స్థాయిలో దిగువకు పంపుతున్నారు. సరస్వతి(అన్నారం) బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో ఏడు వేల క్యూసెక్కులు ఉండగా రెండు గేట్లను ఎత్తి 4,531 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**కృష్ణా గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టుల్లో సోమవారం నాటి నీటి నిల్వలు, ప్రవాహాల వివరాలు..**

| ప్రాజెక్టు పేరు | పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీల్లో) | ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో) | వస్తున్న ప్రవాహం (క్యూసెక్కుల్లో) | దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|
| **కృష్ణా పరీవాహకం** | | | | |
| ఆలమట్టి | 129.72 | 120.35 | 1,75,000 | 2,00,000 |
| నారాయణపూర్ | 37.64 | 33.38 | 2,00,000 | 1,87,992 |
| జూరాల | 9.66 | 9.21 | 2,08,000 | 2,02,651 |
| తుంగభద్ర | 100.86 | 100.74 | 28,595 | 29,169 |
| శ్రీశైలం | 215.81 | 207.41 | 1,65,120 | 1,65,120 |
| నాగార్జునసాగర్ | 312.05 | 304.99 | 70,280 | 53,724 |
| ప్రకాశం బ్యారేజీ | 3.07 | 3.40 | 6,00,103 | 5,82,482 |
| **గోదావరి పరీవాహకం** | | | | |
| సింగూరు | 29.91 | 0.45 | 00 | 20 |
| నిజాంసాగర్ | 17.80 | 0.14 | -- | 10 |
| శ్రీరామసాగర్ | 90.31 | 17.18 | 00 | 389 |
| కడెం | 7.60 | 6.87 | 780 | 818 |
| శ్రీపాద ఎల్లంపల్లి | 20.18 | 18.15 | 00 | 00 |
| ధవళేశ్వరం | 2.93 | 2.36 | 4,81,859 | 4,75,120 |


భాజపా ఇంటింటా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో ముస్లిం మహిళకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## 140 ఏళ్ల రిజిస్ట్రేషన్ దస్త్రాల డిజిటలైజేషన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పాత రిజిస్ట్రేషన్ దస్త్రాలన్నింటినీ డిజిటలైజేషన్ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించింది. 1860 నుంచి 1999 వరకు 140 సంవత్సరాలకు సంబంధించిన అన్ని రికార్డులను స్కానింగ్ చేసి భద్రపరిచేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ప్రైవేటు ఏజెన్సీకి ఈ బాధ్యత అప్పగించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇందుకోసం ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం టీఎస్‌టీఎస్‌ఎల్ ద్వారా టెండర్లు పిలిచింది. టెండర్లు ఖరారు కాగానే, డిజిటలైజేషన్‌ను మొదలుపెట్టి 18 నెలల్లో ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

### ఏడు కోట్ల దస్త్రాలు..

రాష్ట్రవ్యాప్తంగా 141 సబ్‌రిజిస్ట్రార్, 12 జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని 4 కోట్ల రిజిస్ట్రార్ పత్రాలతో పాటు, మరో 3 కోట్ల ఈసీ, సీసీ ధ్రువపత్రాలు తదితరాలన్నింటినీ కంప్యూటరీకరించనున్నారు. 140 ఏళ్లకు సంబంధించి మ్యాన్‌వల్‌గా రాసుకున్న రికార్డులన్నింటినీ ఇప్పుడు కంప్యూటర్‌లోకి ఎక్కించనున్నారు. స్థిరాస్తుల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన సమాచారాన్ని భద్రపరచడంతోపాటు, అడిగిన వారికి సులభంగా డాక్యుమెంట్లు ఇవ్వడానికి డిజిటలైజేషన్ ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు.

## ఎవరికీ అన్యాయం జరగలేదు

- వైద్యవిద్య ప్రవేశాలు సక్రమమే
- తేల్చిచెప్పిన హైకోర్టు
- కాళోజీ వర్సిటీ కాస్త తికమక పడిందని వ్యాఖ్య



ఈనాడు, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈ విద్యా సంవత్సరంలో చేపట్టిన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలను హైకోర్టు సమర్థించింది. నిబంధనల ప్రకారమే వర్సిటీ.. వైద్యవిద్య ప్రవేశాలను చేపట్టిందని స్పష్టం చేసింది. 2017లో తీసుకొచ్చిన జీవో 114 ఆధారంగానే అడ్మిషన్లు జరిగాయంది. వర్సిటీ సమర్పించిన 27 ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల ప్రవేశాల వివరాలను పరిశీలిస్తే.. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఏఒక్క రిజర్వుడ్‌అభ్యర్థికీ అన్యాయం జరగలేదని హైకోర్టు స్పష్టంచేసింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లాగే రెండో విడత నిర్వహించాలన్న పిటిషనర్ల వాదనను సమర్థించడానికి ఎలాంటి సహేతుక కారణమూ లేదంది. జీవో 114 నిబంధనల అమలులో వర్సిటీ విఫలమైందనడానికి ఆధారాలు లేవని, ఇందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడంలేదని స్పష్టంచేస్తూ పిటిషన్లను కొట్టివేసింది.

### జీవోల అమల్లో అయోమయంలో వర్సిటీ

కౌన్సెలింగ్‌లో భాగంగా చట్టం అనుమతించిన విధానం అమలులో వర్సిటీకి కొంత తడబాటు ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2001లో జారీ చేసిన జీవో 550లో పేరా 5 ప్రకారం ఓపెన్ కేటగిరీలో సీటు పొందిన రిజర్వు అభ్యర్థి పక్కకు జరిగితే తరువాత మెరిట్ రిజర్వుడ్ అభ్యర్థితో భర్తీ చేయాలన్న నిబంధనను హైకోర్టు కొట్టివేయగా సుప్రీంకోర్టు సమర్థిస్తూ తరువాత మెరిట్ రిజర్వుడ్ అభ్యర్థితోనే భర్తీ చేయాలంది. ఇవే నిబంధనలతో కూడిన జీవో 114 గురించి రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టుల దృష్టికి తీసుకెళ్లని విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఏ జీవో 550 ఇంకా అమలులో ఉందన్న భావనతోనే వర్సిటీ ఉందని తప్పుబట్టింది.

### మెరిట్ రిజర్వుడ్ సీట్ల భర్తీలో పొరపాటు లేదు

420 మంది మెరిట్ రిజర్వుడ్ సీట్ల భర్తీలో కాళోజీ వర్సిటీ పొరపాటు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. మొదటి విడతలో మాత్రమే జీవో అమలు చేయాల్సి ఉందని, తరువాత అవసరం లేదంది. ఆగస్టు 31లోగా సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తికావాల్సి ఉందన్న ఎంసీఐ నిబంధనల ప్రకారం ప్రవేశాలు చేపట్టడానికి అనుమతించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తొలగిస్తూ పిటిషన్లను కొట్టివేసింది.

### నేటి నుంచి మూడో విడత వెబ్‌ఆప్షన్లు

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కన్వీనర్ కోటాలో సీట్ల భర్తీ ప్రక్రియపై కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. ఇప్పటికీ మిగిలిన, ఇప్పటి వరకూ భర్తీ చేయని సీట్లను తక్షణమే నింపేందుకు వర్సిటీ ప్రవేశ ప్రకటనను విడుదల చేశారు. రెండోవిడత ప్రవేశాల్లో సీటు పొందిన అనంతరం కళాశాలల్లో చేరకపోవడం వల్ల మిగిలిన ఎంబీబీఎస్ సీట్లు 165, ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు 190, అఖిల భారత వైద్య విద్య కోటాలో మిగిలిన సీట్లలో రాష్ట్రానికి కేటాయించిన 61, ఎన్‌సీసీ కోటాలో 27, సీఏపీ కోటాలో 27 సీట్ల చొప్పున మొత్తం 470 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేయనున్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 22వ తేదీ ఉదయం 11 గంటల వరకూ అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 22వ తేదీ రాత్రి సీట్ల కేటాయింపు ఫలితాలను వెల్లడిస్తారు. మూడోవిడత అనంతరం మిగిలిన సీట్లకు చివర్లో మాప్‌అప్ రౌండ్‌ను నిర్వహిస్తారు.

### ఏపీలో నిబంధనతో..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు 15 శాతం అన్‌రిజర్వుడ్ కేటగిరీలో సీట్లకు దరఖాస్తు చేసుకునే ముందు ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలని కాళోజీ ఆరోగ్య వర్సిటీ ఉపకులపతి కరుణాకరరెడ్డి తెలిపారు. ఇప్పటికే తమ రాష్ట్రంలోని వైద్యకళాశాలల్లో చేరిన విద్యార్థులు.. ఈ నెల 17 తర్వాత ఇతర కళాశాలల్లో చేరాలనుకుంటే.. అందుకు అనుమతించబోమని ఏపీలోని ఎన్‌టీఆర్ ఆరోగ్య వర్సిటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ గడువు ఇప్పటికే తీరిపోయి ఉండడంతో. . ఏపీలో సీట్లు పొందిన అభ్యర్థులు తిరిగి తెలంగాణలో అన్‌రిజర్వుడ్ కోటాలో దరఖాస్తు చేసుకోవడం వల్ల ఉపయోగం లేదని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

## నడ్డాపై కేసులు పెడతారా?

### ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు చేసే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపుతామని గతంలో హెచ్చరించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ రూ.40 వేల కోట్లు జేబులో వేసుకున్నారని బహిరంగంగా ఆరోపించిన భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాపై కేసులు పెడతారా? అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. నడ్డా చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. ఐదేళ్లుగా కాంగ్రెస్ ఇవే ఆరోపణలు చేస్తుంటే.. భాజపా కళ్లు మూసుకుందా? అని నిలదీశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ తెలంగాణ ప్రభుత్వం అవినీతిపై ఎందుకు విచారణ జరిపించడం లేదన్నారు. ఐదేళ్లుగా భాజపా, తెరాసలు ఒకదానికొకటి సహకరించుకుంటున్నాయని సంపత్ విమర్శించారు.

# 'పోలవరం' రద్దు ఏకపక్షం

- హైకోర్టును ఆశ్రయించిన 'నవయుగ'

ఈనాడు, అమరావతి: పోలవరం జలవిద్యుత్ ప్రాజెక్టు (పీహెచ్‌ఈపీ) పనుల ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేశారంటూ నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. కాంట్రాక్టును రద్దు చేస్తూ ఆగస్టు 14న ఏపీ జెన్‌కో (హైడల్ ప్రాజెక్ట్స్) చీఫ్ ఇంజినీర్ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేయాలని అభ్యర్థించింది. ఈ మేరకు నవయుగ డైరెక్టర్ వై.రమేష్ హైకోర్టులో సోమవారం వ్యాజ్యం దాఖలు చేశారు. '80 మెగావాట్ల సామర్థ్యంతో 12 హైడ్రో పవర్ స్టేషన్ల ఏర్పాటు కోసం ఏపీ జెన్‌కోతో 2017 డిసెంబర్ 20న ఒప్పందం చేసుకున్నాం. ఒప్పందంలో భాగంగా పలు పనులు నిర్వహించాల్సి ఉంది. కాంట్రాక్ట్ విలువ రూ.3220.28 కోట్లు. ఒప్పందం ప్రకారం స్థలం అప్పగించినప్పటి నుంచి 40 నెలల్లో మొదటి మూడు యూనిట్లను పూర్తి చేయాలి. మిగిలిన 9 యూనిట్లను రెండు నెలలకొకటి చొప్పున 18 నెలల్లో పూర్తి చేయాలి. ఒప్పంద తేదీ నుంచి ఎలాంటి లోపం జరగకుండా మా బాధ్యతలు నెరవేరుస్తున్నాం. ఫ్రాన్స్‌లో టర్బైన్ నమూనా పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాం. ఇందుకు చీఫ్ ఇంజినీర్ 2018 జూన్‌లో అంగీకారం (అప్రూవల్) కూడా తెలిపారు. తర్వాత పవర్ హౌస్ నిర్మాణాన్ని 30 మీటర్ల దిగువకు తరలించాలని అధికారులు ప్రతిపాదిస్తే మేం 2019 ఫిబ్రవరిలో ఆమోదించాం. ఆ డిజైన్‌ను ఏప్రిల్‌లో అధికారులు ఆమోదించినా పని నిర్వహించాల్సిన ప్రాంతాన్ని మాకు అప్పగించలేదు'అని నవయుగయాజమాన్యం వ్యాజ్యంలో పేర్కొంది.

### కాంట్రాక్టు రద్దుకు కారణాలేవి?

ఏపీలో ప్రభుత్వం మారాక సీఎం జులై 1న అకస్మాత్తుగా పునఃసమీక్ష సమావేశం నిర్వహించారని వ్యాజ్యంలో పేర్కొన్నారు. కాంట్రాక్టును రద్దు చేయాలని ఏకపక్షంగా నిర్ణయించి, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారని వెల్లడించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ జులై 19న లేఖ పంపుతూ తదుపరి ఉత్తర్వులు వెలువరించేంత వరకు.. పోలవరం ప్రాజెక్ట్ పనుల్ని తక్షణం నిలిపేయాలని కోరారన్నారు. ఒప్పందంలో తాము ఏం ఉల్లంఘించామో చెప్పలేదని, రద్దుకు కారణాలేమిటో వివరించలేదని నవయుగ డైరెక్టర్ వ్యాజ్యంలో ఆక్షేపించారు. ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిబద్ధతతో ఉన్నామని, ఇప్పటి వరకు రూ. 398 కోట్లు ఖర్చు చేశామంటూ చీఫ్ ఇంజినీర్ లేఖకు సమాధానం కూడా పంపామన్నారు. ఒప్పందాన్ని రద్దు చేస్తే భారీ నష్టం వాటిల్లుతుందని చెప్పినా తమ వాదనను పట్టించుకోలేదని చెప్పారు.

### ప్రభుత్వ ఆదేశాలకు జెన్‌కో కట్టుబడక్కర్లేదు

'ఏపీ జెన్‌కోకు మాకు మధ్య ఒప్పందం జరిగింది. కాంట్రాక్టు విషయంలో రాష్ట్ర సర్కారు మూడో పార్టీ మాత్రమే. ఒప్పందాన్ని రద్దు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఏపీ జెన్‌కో కట్టుబడాల్సిన అవసరం లేదు. మేం పనులు చేయాల్సిన చోట స్థలాన్ని అప్పగించాల్సిన బాధ్యత జెన్‌కోపై ఉన్నా వారు పట్టించుకోలేదు. ఒప్పంద రద్దు ఉత్తర్వుల జారీ వెనుక దురుద్దేశం ఉంది. ఆ ఉత్తర్వులు చట్టవిరుద్ధం. యంత్రాలు సమకూర్చుకొనేందుకు, సబ్ వెండర్లకు, ఇతరులకు ఇప్పటికే భారీగా చెల్లించాం. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఒప్పందం రద్దు చేస్తూ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ ఆగస్టు 14న జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేయండి. ఆ కాంట్రాక్టు పనులు కొనసాగించేందుకు అనుమతించండి' అని వ్యాజ్యంలో నవయుగ డైరెక్టర్ కోరారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరపనున్నారు.

## ఇంధన పొదుపుపై వినియోగదారులకు అవగాహన

### దక్షిణ డిస్కం సీఎండీ రఘుమారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ వినియోగం, నిర్వహణలో మెరుగైన ఫలితాల కోసం అనేక చర్యలు చేపడుతున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) సీఎండీ రఘుమారెడ్డి తెలిపారు. ఇంధన పొదుపుపై డిస్కం ఉద్యోగులకు అయిదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లో ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సంస్థల భాగస్వామ్యంలో డిస్కం దీనిని ఏర్పాటుచేసింది. రఘుమారెడ్డి మాట్లాడుతూ పెద్దయెత్తున సౌరవిద్యుత్ కేంద్రాల ఏర్పాటు, ఎల్ఈడీ దీపాల పంపిణీ వంటి చర్యల ద్వారా ఇంధన పొదుపుపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఎండీ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

### పెరిగిన విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో వర్షాలు తగ్గడంతో వ్యవసాయ బోర్లకు విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సోమవారం అత్యధికంగా 10,260 మెగావాట్లు నమోదైంది. గతేడాది ఇదేరోజున 7,639 మెగావాట్లు ఉండగా ఇప్పుడు పెరిగింది.

## మధ్యమానేరుకు రాజ రాజేశ్వరి అమ్మవారి పేరు

ఈనాడు, హైదరాబాద్: కరీంనగర్ జిల్లాలోని మధ్య మానేరు జలాశయానికి రాజ రాజేశ్వరి పేరును నిర్ణయిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి లక్ష్మీ, అన్నారానికి సరస్వతి, సుందిళ్లకు పార్వతి, లక్ష్మీపూర్ పంపుహౌస్‌కు గాయత్రి పంపుహౌజ్ పేరును, నంది మేడారం జలాశయం, పంపు హౌస్‌లకు నంది పేరును నిర్ణయించిన విషయం తెలిసిందే. అనంతగిరి జలాశయానికి అన్నపూర్ణ జలాశయమని, పంపుహౌస్‌కు అన్నపూర్ణ పంపుహౌస్ అని, రంగనాయక సాగర్ జలాశయం, పంపుహౌస్‌కు అవే పేర్లు, మల్లన్నసాగర్ జలాశయం, పంపుహౌస్‌లకు... అదేవిధంగా కొండపోచమ్మ సాగర్, పంపుహౌస్‌లకు అవే పేర్లను నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఉత్తర్వులు విడుదల చేశారు.

## పాలమూరు ప్రాజెక్టులపై ప్రజాప్రతినిధుల సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లాకు చెందిన ఆబ్కారీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి. రాజేందర్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, పి.నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్‌లతో పాటు నీటిపారుదలశాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మిగులు ఆయకట్టు ప్రాంతాలకు నీరందించటానికి ప్రతిపాదనలపై చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పనులను వేగవంతం చేయడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# మత్తడి దుంకినవి ముత్తెమన్నే!

**రాష్ట్రంలో అలుగుపారినవి 3,187 చెరువులే**



నీరులేక వెలవెలబోతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లోని పెద్దచెరువు

**ఉమ్మడి జిల్లాల్లో చెరువుల పరిస్థితి..**

| జిల్లా | మొత్తం చెరువులు | 0-25% నిండినవి | 25-50% నిండినవి | 50-75% నిండినవి | 75-100% నిండినవి | మత్తడి పోస్తున్నవి |
|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 2,702 | 0 | 53 | 241 | 1,303 | 1,105 |
| కరీంనగర్ | 4,344 | 2251 | 995 | 459 | 392 | 247 |
| వరంగల్ | 6,057 | 1,651 | 853 | 514 | 1,767 | 1,272 |
| ఖమ్మం | 3,883 | 387 | 426 | 784 | 1,995 | 291 |
| నిజామాబాద్ | 3,170 | 759 | 847 | 745 | 635 | 184 |
| మెదక్ | 8,748 | 7,451 | 834 | 342 | 114 | 7 |
| రంగారెడ్డి | 3,791 | 3,611 | 107 | 34 | 18 | 21 |
| నల్గొండ | 4,652 | 3,998 | 431 | 123 | 64 | 36 |
| మహబూబ్‌నగర్ | 6,417 | 6,088 | 271 | 19 | 15 | 24 |

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో చెరువులు బావురుమంటున్నాయి. వర్షాలు కురిసినా.. ఆశించినంత నీరు తటాకాల్లో చేరలేదు. తెలంగాణవ్యాప్తంగా 43 వేలకుపైగా చెరువులు ఉండగా. కేవలం పదిశాతంలోపు(3,187) చెరువులే మత్తడి దూకాయి. 9,564 చెరువుల్లో యాభై శాతానికిపైగా నీరు చేరింది. రాష్ట్రంలో చెరువుల కింద 21.38 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ప్రాజెక్టుల నీళ్లు అందనిచోట రైతులు వీటి కిందే సాగు చేపడుతున్నారు. ఆయకట్టుకు నేరుగా నీళ్లు చేరకపోయినా భూగర్భ జల మట్టం పెరిగి బోర్ల కింద సాగు చేసుకునే వీలుంటుందని చెబుతున్నారు. మరోవైపు కృష్ణాతో పోల్చితే గోదావరి పరీవాహకంలో చెరువుల స్థితి కొంత మెరుగ్గా ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగం చెరువులు అలుగుపారగా మిగిలిన సగం నిండటానికి చేరువయ్యాయి. వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొంత మేరకు నీళ్లు చేరాయి. ఇక మిగిలిన జిల్లాల్లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

### ప్రాజెక్టులకు జలకళతో.. తూములపై రైతుల ఆశ

ఎగువన కురిసిన వర్షాలకు కృష్ణా నదికి భారీ వరద వచ్చింది. గోదావరి మాత్రం ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన ఉప్పొంగింది. రాష్ట్రంలో ప్రాజెక్టుల్లోకి నీరు చేరినచోట కాలువల తూముల నిర్మాణాలపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. ఏటా కాలువలు తెంపి గొలుసు కట్టు చెరువుల్లోకి నీటిని మళ్లించుకుంటున్న ఘటనలకు స్వస్తి పలకాలని ప్రభుత్వం ఈ ఏడాది శాశ్వత తూముల నిర్మాణాన్ని చేపట్టింది. ప్రస్తుతం జూరాల, నాగార్జున సాగర్‌తోపాటు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రధాన కాలువల్లో ప్రవాహాలు కొనసాగుతున్నాయి. వాటి పరిధిలోని తూములను వెంటనే పూర్తిచేస్తే సులువుగా చెరువులు నింపుకోవచ్చని ఆయా ప్రాంతాల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 2,911 తూముల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. జులైనాటికే వీటిని పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించినా మూడు వందలు కూడా పూర్తికాలేదు. ఇప్పటికైనా వేగం పెంచాలని అన్నదాతలు కోరుతున్నారు.




## ఆయుధ కర్మాగారాల ప్రైవేటీకరణ సరికాదు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

కంది, న్యూస్‌టుడే: దేశంలోని ఆయుధ కర్మాగారాలను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం సరికాదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఆయుధ కర్మాగారంలో కార్మిక సంఘాల ఉద్యోగులు ఐకాసగా ఏర్పడి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. ఆయుధ కర్మాగారాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం ద్వారా దేశానికి నష్టమని అన్నారు. సీఎం కేసీఆర్ సూచన, సలహాల మేరకు రాష్ట్ర ఎంపీలమంతా పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని ఆయన చెప్పారు. ఐకాస నాయకులతో ప్రధాని మోదీని కలిసి సమస్యలు వివరిస్తామన్నారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశంలోని ఆయుధ కర్మాగారాలు, పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలనే డిమాండ్‌తో సెప్టెంబరు 19 వరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి మైనారిటీ సంక్షేమ కమిటీ సభ్యులుగా బండి సంజయ్, రంజిత్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రస్థాయి మైనారిటీ సంక్షేమ కమిటీ సభ్యులుగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్(భాజపా), చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి(తెరాస) నియమితులయ్యారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ఆదేశాల మేరకు ఈ నియామకాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన మంత్రి జనవికాస్ పథకం కింద మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 15 ప్రధాన కార్యక్రమాల్లో భాగంగా మైనారిటీల సంక్షేమానికి వివిధ ప్రాజెక్టులను ప్రతిపాదించడం, అమలు చేయడం ఈ కమిటీ బాధ్యత. మైనారిటీలకు సంబంధించిన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, పకడ్బందీగా అమలు పరిచేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా బండి సంజయ్, రంజిత్‌రెడ్డిలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.



భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో మహిళా రైతుకు 1బీ ధ్రువపత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

## రెండో విడత భూ పరిష్కార వేదిక ప్రారంభం

భూపాలపల్లి జిల్లాలో తొలి రోజే 250 సమస్యల పరిష్కారం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి గ్రామాలకే రెవెన్యూ సిబ్బందిని తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు చేపట్టిన 'భూ పరిష్కార వేదిక.. రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమం రెండో విడత సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. గత నెల 22 నుంచి 27 వరకు ఆరు రోజుల పాటు నిర్వహించిన తొలి విడతలో దాదాపు 2,700 సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యాయి. ఈ స్ఫూర్తితో రెండో విడత కార్యక్రమాన్ని జిల్లాలోని 11 మండలాల్లో ప్రారంభించారు. రెండో దశలో తొలి రోజు సోమవారం 250 సమస్యలను పరిష్కరించినట్లు కలెక్టర్ చెప్పారు. రైతుల భూ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు విడతల వారీగా సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏలు, సాంకేతిక సిబ్బంది గ్రామసభలో అందుబాటులో ఉండటంతో సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం కలుగుతోందని తెలిపారు. తొలిరోజు కాటారం, భూపాలపల్లి, గణపురం మండలాల్లో జరిగిన గ్రామసభలకు కలెక్టర్ హాజరయ్యారు.

## కె.ఎ.పాల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

మహబూబ్‌నగర్(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ మహబూబ్‌నగర్ ప్రత్యేక సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి అజితసింహారావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. సోదరుడి హత్య కేసులో ముద్దాయిగా ఉన్న కె.ఎ.పాల్ న్యాయస్థానానికి హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి పై ఉత్తర్వులిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కొమిరెడ్డిపల్లి పరిధిలో 30.01.2010న కారులో కె.ఎ.పాల్ సోదరుడు డేవిడ్ మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. ఈ కేసును పోలీసులు విస్తృతంగా పరిశోధించి చివరకు కె.ఎ.పాల్‌ను తొమ్మిదో ముద్దాయిగా చేర్చుతూ అభియోగపత్రం దాఖలు చేశారు. మహబూబ్‌నగర్ ప్రత్యేక సెషన్స్ న్యాయస్థానంలో కేసు విచారణకు పాల్ హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉత్తర్వులు వెలువరించారు. కేసును సెప్టెంబరు 20కి వాయిదా వేసినట్లు అదనపు పీపీ రఘుపతి తెలిపారు.



పురుగు ఆకులను తినేయగా ఎండినట్లుగా ఉన్న టేకు వృక్షాలు. (అంతర చిత్రంలో) ఆకులను తింటున్న పురుగు

## టేకు వనాలకు చీడ

సారంగాపూర్, న్యూస్‌టుడే: పంటలనే కాదు.. పచ్చదనంతో నిండుగా ఉన్న టేకు వనాలనూ చీడపీడలు వదలడం లేదు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ ఘాట్‌కు ఇరువైపులా 500 హెక్టార్లలో దట్టంగా టేకు వనం ఉంది. గత కొన్ని రోజులుగా టేకు చెట్లకు పురుగు సోకి పూర్తిగా ఆకులను తినేస్తోంది. పచ్చటి వనం పూర్తిగా ఎండిపోయినట్లుగా కనిపిస్తోంది. జిల్లాలో 56వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉండగా అత్యధికంగా బీర్‌పూర్, సారంగాపూర్ మండలంలోనే 12,789 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం బీర్‌పూర్ మండలంలో పురుగు ఉద్ధృతి అత్యధికంగా ఉంది. ఈ విషయమై వ్యవసాయాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ.. టేకులో ఆకు తినే పురుగు (హైబేలియా పురే) ఉద్ధృతి 15 నుంచి 25 రోజుల వరకు ఉంటుందన్నారు. టేకు ఆకులను పూర్తిగా తింటుందని పురుగు నివారణకు లీటర్ నీటికి 2ఎంఎల్ క్లోరీ ఫైరిపాస్ పిచికారి చేయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
**ఇ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ కం ఆక్షన్ (రివర్స్ టెండరింగ్)**
నోటీసు నెం. 02/2019-20, ది. 17-08-2019
**పని పేరు:** పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్ ప్యాకేజి నెం. 65కు సంబంధించి ఇరిగేషన్ టన్నెల్ (919మీ), హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ లాక్ నిర్మాణం మరియు అప్రోచ్ ఛానల్ 1 మరియు 2, ఎగ్జిట్ ఛానల్ మరియు నావిగేషన్ ఛానల్ త్రవ్వకం పనులు. (మిగులు పని). (ఎల్.ఎస్.కాంట్రాక్టు పద్ధతి).
**సుమారు పని విలువ:** రూ. 275.00 కోట్లు. **పని పూర్తిచేయు కాలము:** 18 నెలలు. బిడ్ డాక్యుమెంట్ లభించు ప్రారంభ తేదీ మరియు సమయము: 19-08-2019 ఉదయం 11.00 గం.ల నుండి. బిడ్ డాక్యుమెంట్ లభించు చివరి తేదీ మరియు సమయము: 02-09-2019 ఉదయం 11.00 గం.ల వరకు. బిడ్ సమర్పించుటకు చివరితేదీ మరియు సమయం: 02-09-2019 సాయంత్రం 4.00 గం.ల వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేదీ మరియు సమయము: 03-09-2019 సాయంత్రం 5.00 గం.లకు. ప్రైస్ బిడ్ తెరచు తేదీ మరియు సమయము: 09-09-2019 ఉదయం. 11.00 గం.లకు. ఇ-ఆక్షన్ బిడ్డింగ్ తేదీ: 09-09-2019. మధ్యాహ్నం 1.00 గం.ల తదుపరి. తదుపరి వివరములు వెబ్‌సైట్: https://tender.apeprocurement.gov.in కాంటాక్ట్ నెం. 0883-2417558.
సం/- కె.పి. శంకరరావు, 17.8.19
పర్యవేక్షక ఇంజినీర్ (ఎఫ్.ఎ.సి), పి ఐ పి హెచ్ డబ్ల్యూ సర్కిల్, ధవళేశ్వరం- 533125
DIPR No. 93PP/CL/Advt/1/1/2019-20

## యూరియా వెంటనే ఇవ్వండి

కేంద్ర మంత్రికి నిరంజన్‌రెడ్డి లేఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రానికి ఈ నెల కోటా కింద కేటాయించిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి సోమవారం లేఖ రాశారు. ఈ నెల కోటా రాష్ట్రానికి కేటాయించిన దానిలో 1.40 లక్షల టన్నులు విదేశాల నుంచి రావాలని చెప్పారని, అది ఈ నెల 25లోగా వచ్చే అవకాశాలు లేనందున ఇతర రాష్ట్రాల అత్యవసర నిల్వల నుంచి తెలంగాణకు పంపాలని సూచించారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న యాకూబ్‌బీ..

## అన్నీ తానై... మానవత్వానికి తావై..!

అనాథకు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేసిన ముస్లిం మహిళ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: మానవత్వం మతం గీతను చెరిపేసింది. ఓ ముస్లిం మహిళ ఓ అనాథ మృతదేహానికి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి ఆదర్శానికి ప్రతీకగా నిలిచారు. యాదాద్రి జిల్లా భువనగిరి శివారు రాయగిరి గ్రామంలో రెండు నెలలుగా యాకూబ్‌బీ సహృదయ అనాథ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో 15 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. మతిస్థిమితం లేకుండా కూనూరు బస్సు ప్రాంగణంలో ఉన్న దావునూరి రామయ్య (70)ను జూన్ 26న తీసుకొచ్చి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అనారోగ్య కారణాలతో రామయ్య గత శనివారం మృతి చెందారు. మృతుడి సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో యాకూబ్‌బీ అన్నీ తానై సోమవారం రామయ్య అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం రామయ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా యాకూబ్‌బీ మాట్లాడుతూ రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలన్న లక్ష్యంతో.. తాను ముస్లిం అయినప్పటికీ ఓ కూతురిగా అంత్యక్రియలు నిర్వహించానని తెలిపారు. తన ప్రయత్నానికి ఎంపీటీసీ సభ్యుడు శివానంద, సీపీఎం నాయకుడు చింతల కృష్ణయ్య, పలువురు గ్రామస్థులు సహకరించారన్నారు.

## నీ మరణం.. తోడుగా నే పయనం

- భార్య మరణించిన కొన్ని గంటల్లోనే కన్నుమూసిన భర్త



సాయిలు



లచ్చమ్మ

కేసముద్రం, న్యూస్‌టుడే: దశాబ్దాల దాంపత్యం వారిది. ఒకరిని విడిచి ఒకరు ఉండలేని అన్యోన్యం ఆ దంపతులది. ఒకరు దూరమైనా తట్టుకోలేని సున్నితత్వం వారిది. భార్య తనువు చాలించిన గంటల వ్యవధిలోనే భర్త తీరని వేదనతో కన్నుమూసిన ఉదంతమిది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోమటిపల్లి గ్రామంలో జనగామ లచ్చమ్మ (83) అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఆదివారం రాత్రి అసువులు బాసింది. ఆమె మృతి భర్త సాయిలును తీవ్రంగా కుంగదీసింది. రాత్రంతా తీవ్రంగా దుఃఖించాడు. సోమవారం ఉదయం లచ్చమ్మ అంతిమయాత్రకు ఏర్పాట్లు చేస్తుండగా హఠాత్తుగా మృతి చెందాడు. దీంతో లచ్చమ్మ అంతిమయాత్ర నిలిపివేసి సాయిలు అంత్యక్రియలకు కూడా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఇద్దరి అంతిమయాత్రను ఒకేసారి నిర్వహించారు. గంటల వ్యవధిలోనే భార్యాభర్తల మరణం గ్రామస్థులను కలచివేసింది.

## తాగుబోతు భర్తను కడతేర్చిన భార్య

- సహకరించిన ఆమె కుటుంబసభ్యులు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: నిత్యం తాగొచ్చి వేధింపులకు గురిచేస్తున్న భర్తను తల్లిదండ్రులు, సోదరుల సహాయంతో భార్య హతమార్చిన ఘటన పెద్దపల్లి జిల్లా చందపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎన్టీపీసీలోని ఎలుకపల్లిగేటు వద్ద నివాసం ఉండే సయ్యద్‌ఖలీంకు పెద్దపల్లి మండలం చందపల్లికి చెందిన ఆస్రాబేగంతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లు రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఒప్పంద కార్మికుడిగా పనిచేసిన ఖలీం ఉద్యోగం మానేసి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై నిత్యం తాగొచ్చి భార్యను కొడుతుండడంతో ఏడాదిన్నర క్రితం ఆమె పుట్టింటికి వచ్చింది. ఇద్దరుపిల్లలతో ఆమె పెద్దపల్లిలోనే ఉంటుండగా ఖలీం అప్పుడప్పుడు తాగొచ్చి గొడవ చేస్తున్నాడు. భార్యతోపాటు అత్తపై దాడులకు పాల్పడుతుండడంతో ఆమె కుటుంబసభ్యులు పూర్తిగా విసిగిపోయారు. ఆదివారం కూడా తాగి వచ్చిన ఖలీం రాత్రి ఇక్కడే పడుకున్నాడు. నిద్రిస్తున్న ఆయనను భార్యతోపాటు ఆమె తల్లిదండ్రులు, సోదరులు కర్రలు, బండరాళ్లతో బాదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హత్య చేసిన అనంతరం కుటుంబసభ్యులు పారిపోవడం, వీరి నివాసం గ్రామానికి చివర ఉండడంతో హత్య ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. హతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఆస్రాబేగంతోపాటు ఆమె కుటుంబసభ్యులు గౌస్‌ఖాన్, సుల్తానా, ఎండీ గౌస్, ఎండీ జాఫర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## గురుకుల పాఠశాలలో పేలిన సిలిండర్

**బాలికలకు తప్పిన ప్రాణాపాయం**

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌లో సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల కొనసాగుతున్న అద్దె భవనంలో సోమవారం సాయంత్రం వంటగ్యాస్ సిలిండర్ పేలింది. వంటగదిలో ఒక్కసారిగా భారీ శబ్దంతో సిలిండర్ పేలడంతో గోడ కూలడంతోపాటు రేకుల షెడ్డుపై కప్పు పూర్తిగా దెబ్బతింది. గురుకుల పాఠశాలలో 300 మంది బాలికలుండగా ప్రమాద సమయంలో వారంతా మైదానంలో ఉండటంతో ముప్పు తప్పింది. సమాచారం అందిన వెంటనే పోలీసు, అగ్నిమాపక అధికారులు గురుకుల పాఠశాలకు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ గురుకుల పాఠశాలకు వచ్చి పరిశీలించారు. నిర్లక్ష్యానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. రాష్ట్ర సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ రాత్రి గురుకుల పాఠశాలకు వచ్చి సిలిండర్ పేలిన వంటగదిని పరిశీలించారు. బాలికలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు.



సిలిండర్ పేలుడుకు కూలిన వంటగది గోడ

## ప్రాణాలకు తెగించి..ప్రాణేశ్వరిని దాటించి..

- భార్యను ఎత్తుకుని వాగు దాటిన యువకుడు
- వంతెన పూర్తి చేస్తే తీరనున్న కష్టాలు

వేమనపల్లి న్యూస్‌టుడే: ప్రాణాపాయస్థితిలో ఉన్న తన భార్యను కాపాడుకోవడానికి ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులో ఆమెను ఎత్తుకొని నడిచాడో వ్యక్తి. ఇది మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం గొర్లపల్లి వాగు వద్ద సోమవారం జరిగింది. వేమనపల్లి పునరావాస కాలనీకి చెందిన సరోజనకు ఆకస్మాత్తుగా కాళ్లు చేతులు వంకర్లు పోయాయి. ఫిట్స్ వచ్చాయి. వేమనపల్లిలో వైద్యులు లేకపోవడంతో గొర్లపల్లి వాగు దాటి చెన్నూరుకు తీసుకెళ్లాలి. ముందు ఎడ్లబండి మీద వెళ్లాలని ప్రయత్నించినా వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కుదరలేదు. దీంతో తన భార్యను రక్షించుకునేందుకు పోచం ఆమెను ఎత్తుకుని వాగు దాటాడు. అప్పటికే 108కి సమాచారం అందించడంతో వాగు అవతలికి వచ్చి ఆగింది. అందులో ఆమెను చెన్నూరులోని ఆసుపత్రికి తరలించారు. వేమనపల్లిలో వైద్య సిబ్బంది కొరత.. స్థానికంగా వైద్యులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గొర్లపల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తయితే 15 గ్రామాల ప్రజల వెతలు తీరే అవకాశముంది.



భార్య సరోజన ప్రాణాలను కాపాడుకునేందుకు ఎత్తుకుని వాగును దాటుతున్న భర్త పోచం. పక్కన కుటుంబసభ్యులు

# యాగంలోపు యాదాద్రిలో వసతులు!

- పెద్దగుట్టపై కాటేజీలు.. మరో కొండపై వీవీఐపీ సూట్లు
- సీఎం దిశానిర్దేశంతో వేగంగా పూర్తికి 'యాడా' యత్నాలు

యాదగిరిగుట్ట – న్యూస్‌టుడే

యాదాద్రిలోని రెండు గుట్టలు సకల వసతుల ప్రాంగణాలుగా ముస్తాబవుతున్నాయి. ఇటీవల క్షేత్ర అభివృద్ధి పనులు పరిశీలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు పనుల్లో వేగం పెరిగింది. భక్తజనులకు 900 ఎకరాల పెద్దగుట్ట.. అతిముఖ్యుల విడిదికి మరో కొండ బస సముదాయాలుగా స్వాగతించనున్నాయి. రూ.504 కోట్ల విరాళాలతో 250 కాటేజీలు, మరో 14 విల్లాలతో సహా ఒక ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించనున్నారు. ఈ వసతులన్నీ రెండు కొండలపైనే ఆవిష్కృతమవుతాయి. మహాసుదర్శన యాగంలోపు వసతి ఏర్పాట్లు సిద్ధంకావాలని స్వయంగా ముఖ్యమంత్రి స్పష్టం చేయడంతో నిర్మాణ పనులు అతి త్వరలో మొదలుకానున్నాయని ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) చెబుతోంది. పనుల వేగవంతానికి సీఈ స్థాయి అధికారి త్వరలోనే యాదాద్రికి రానున్నారు.

★ పెద్దగుట్టపై సేకరించిన భూముల్లో ప్రస్తుతం 250 ఎకరాల్లో లేఅవుట్ పనులు జరిగాయి. సీఎం సూచనలతో ఆలయ నగరిలో రూ.400 కోట్లతో 250 కాటేజీల నిర్మాణాన్ని వేగంగా చేపట్టేందుకు 'యాడా' సన్నద్ధమవుతోంది.

★ ఇప్పటికే చేపట్టిన లేఅవుట్ పనుల్లో రోడ్ల నిర్మాణం, పూలమొక్కలు, పార్కులను ఏర్పాటు చేశారు. కాటేజీల నిర్మాణానికి ప్లాట్లను సిద్ధం చేశారు. 250 కాటేజీల నిర్మాణానికయ్యే రూ.400 కోట్లను విరాళంగా ఇచ్చేందుకు కార్పొరేట్ సంస్థలు, దాతలు సిద్ధంగా ఉన్నారు.

★ ఆలయానికి ఉత్తరాన 13.26 ఎకరాల కొండపై వీవీఐపీల విడిది కోసం ప్రెసిడెన్షియల్ సూట్, విల్లాల నిర్మాణాన్ని చేపట్టారు. గుప్తదాతల ద్వారా రూ.104 కోట్ల వ్యయంతో వేర్వేరుగా 15 అధునాతన భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నారు.



ఆలయ నగరిగా రూపొందుతున్న పెద్దగుట్ట

## శ్రీచక్ర వసతి గదుల సముదాయం ఖాళీ



శ్రీచక్ర వసతి గదుల సముదాయం

యాదాద్రిలో కొండపైనున్న పాత భవనాల తొలగింపునకు రంగం సిద్ధమైంది. సీఎం ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన పనుల నిర్వహణకు 'యాడా' యంత్రాంగం కసరత్తు చేపట్టింది. ఆ క్రమంలోనే కొండపైనున్న పాత భవనాలన్నింటినీ తొలగించే పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు శ్రీచక్ర వసతి గదుల సముదాయాన్ని ఖాళీ చేసే పనుల్లో ఆలయ ఉద్యోగులు నిమగ్నమయ్యారు.

**సత్యనారాయణ వ్రతాలు పాతగుట్టలో..**

పనులు త్వరితగతిన చేపట్టేందుకు వీలుగా యాదాద్రిలోని ప్రసాదాల తయారీ కేంద్రాన్ని పాత గుట్టకు తరలించనున్నారు. మంగళవారం నుంచి సత్యనారాయణవ్రతాలూ పాతగుట్టలోనే నిర్వహించనున్నారు. మరోవైపు అన్నదానం కార్యక్రమాన్ని సైతం అక్కడే చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు.

## యాంటీబయోటిక్ నిరోధకత

**వజ్రాయుధం చేతిలో ఉంటేనేం? ప్రయోగించే నేర్పు లేకపోతే. శత్రు నిర్మూలన కాదు కదా.. కొత్త అస్త్రశస్త్రాలతో శత్రువు మరింతగానూ విజృంభించేస్తాడు. యాంటీబయోటిక్ మందుల విషయంలో మనం ఇప్పుడిలాంటి స్థితినే ఎదుర్కొంటున్నాం. మహా మహా ఇన్‌ఫెక్షన్లను మట్టి కరిపించే అద్భుతమైన ఔషధాలను తెలివి తక్కువతనంతో నిర్వీర్యం చేసుకుంటున్నాం. బ్యాక్టీరియాకు కొత్త జవసత్వాలు అందిస్తూ.. మొండి ఘటాలుగా మారటానికి ఆస్కారమిస్తున్నాం. ఒకప్పటిలా కొత్త యాంటీబయోటిక్స్ పుట్టుకురావటం లేదు. ఇప్పుడున్నవీ సరిగా పనిచేయటం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మానవాళి పెను ప్రమాదంలో పడే సమయం ఇంకెంతో దూరంలో లేదు. అందుకే యాంటీబయోటిక్ నిరోధకత (రెసిస్టెన్స్) ముప్పును ప్రపంచ ఆరోగ్యసంస్థ 'అదృశ్య మహమ్మారి'గా అభివర్ణిస్తోంది. ప్రాణరక్షణ ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టాలంటూ.. ఇటీవల వీటిని మూడు వర్గాలుగా విభజించింది. ఎప్పుడెలా వాడుకోవాలో నిర్దేశించింది. ఈ నేపథ్యంలో యాంటీబయోటిక్ నిరోధకతపై సమగ్ర కథనం అందిస్తోంది ఈ వారం సుఖీభవ.**

యాంటీబయోటిక్ మందుల ఆవిష్కరణ ఓ అద్భుతం. దీంతో వైద్యరంగం విప్లవాత్మకంగా మారిపోయింది. అప్పటివరకు గొంతునొప్పి వంటి చిన్న చిన్న ఇన్‌ఫెక్షన్లకే ఎంతోమంది ప్రాణాలు పోయేవి. శస్త్రచికిత్స చేయటమంటే ప్రాణాలతో చెలగాటమాడటమే అన్నట్టుగా ఉండేది. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 1928లో మొట్టమొదటి యాంటీబయోటిక్ మందు పెన్సిలిన్‌ను కనుగొనటంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇన్‌ఫెక్షన్ల చికిత్స తేలికైపోవటమే కాదు.. జీవనకాలమూ గణనీయంగా పెరిగింది. అయితే మితిమీరిన వాడకం, దుర్వినియోగం వల్ల పెన్సిలిన్ సామర్థ్యం అనతికాలంలోనే తగ్గుముఖం పట్టింది. అనంతరం టెట్రాసైక్లిన్లు, సెఫలోస్పోరిన్లు, క్వినలోన్లు, మైక్రోలైడ్లు, అమైనోగ్లైకోసైడ్ల వంటి కొత్తరకం యాంటీబయోటిక్స్ ఎన్ని వచ్చినా.. వస్తున్నా ఆ సంతోషం ఎంతో కాలం నిలవటం లేదు. ఎప్పటికప్పుడు బ్యాక్టీరియా వీటిని తట్టుకొనే సామర్థ్యాన్ని సంతరించుకుంటూనే వస్తోంది. దీనికి ప్రధాన కారణం దుర్వినియోగమే. ప్రస్తుతం ఒకప్పటిలా కొత్త యాంటీబయోటిక్స్ అంతగా రావటం లేదు. కొన్నాళ్లు పోతే ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కొనే సమర్థమైన మందులు అందుబాటులో ఉంటాయా? అన్నది ఇప్పుడు అందరి మనసులను తొలుస్తోంది. ఎన్నో పరిశోధనలు, ఎన్నో అధ్యయనాలు, ఎన్నో ప్రయోగ పరీక్షల అనంతరం కష్టపడి తయారుచేసుకున్న 'రామబాణాలను' చేజేతులా నిర్వీర్యం చేసుకోవటం ఎంతవరకు సమంజసం? చిన్న చిన్న ఇన్‌ఫెక్షన్లకే మరణించే దుస్థితి నుంచి పోయే ప్రాణాలను వెనక్కి తీసుకొచ్చే దశకు చేరుకున్న మనం తక్షణం వేసుకోవాల్సిన ప్రశ్న ఇది. **యాంటీబయోటిక్ నిరోధకత మూలంగా 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటి మరణాలు సంభవించొచ్చని అంచనా. ఇది మనదేశానికి మరింత పెద్ద ముప్పుగానూ పరిణమించే అవకాశముంది. ఎందుకంటే యాంటీబయోటిక్ మందుల అమ్మకం మనదేశంలో గణనీయంగా పెరుగుతోంది.** ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే పరిస్థితి ● చేయి దాటటం ఖాయం.



**డా॥ వి.లక్ష్మి**
**ప్రొఫెసర్ మైక్రోబయాలజీ**
**కామినేని వైద్య విజ్ఞానసంస్థ హైదరాబాద్**

### ఏంటీ నిరోధకత?

బ్యాక్టీరియా చాలా తెలివిగల క్రిములు. బలమైనవీనూ. మనిషి పుట్టకముందు నుంచే ఇక్కడ మనుగడ సాగిస్తున్నాయి. ప్రతికూల పరిస్థితులను తట్టుకొని జీవించడమెలాగో వీటికి బాగా తెలుసు. యాంటీబయోటిక్ మందులను తట్టుకొనే సామర్థ్యాన్నీ ఇలాగే సంతరించుకున్నాయని చెప్పుకోవచ్చు. సాధారణంగా యాంటీబయోటిక్ మందులు బ్యాక్టీరియాను చంపేయటమో, బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా అడ్డుకోవటం ద్వారానో ఇన్‌ఫెక్షన్లు తగ్గటానికి తోడ్పడుతుంటాయి. వీటిని ఎదుర్కోవటానికి బ్యాక్టీరియా నిరంతరం సన్నద్ధమై ఉంటుంది. మందులు తమకు హాని తలపెట్టకముందే వాటిని నిర్వీర్యం చేయటానికి.. ఒకవేళ మందులు తమలోకి ప్రవేశించినా అతివేగంగా బయటకు పంపించటానికి ప్రయత్నిస్తుంటాయి. కొన్నయితే మందులు తమ మీద దాడి చేయటానికి అవకాశమున్న భాగాలనూ మార్చేసుకుంటాయి. ఈ క్రమంలో కొన్ని సూక్ష్మక్రిములు మందుల ప్రభావం నుంచి తప్పించుకోవచ్చు. మొండి బ్యాక్టీరియా(సూపర్ బగ్స్)కు ఇదే మూలం. ఇలాంటిది ఒక్కటి మిగిలినా చాలు. శరవేగంగా వృద్ధి చెందుతుంది. ఇవి మందులకు లొంగని విధంగా జన్యు స్వభావాన్నీ మార్చేసుకోవచ్చు. ఈ గుణాన్ని తర్వాతి తరానికీ సంక్రమింపజేస్తాయి.

# అదృశ్య మహమ్మారి!



### ఎందుకీ దుస్థితి?

ఒకరకంగా మందులను తట్టుకోవటమనేది బ్యాక్టీరియాలో జరిగే సహజ ప్రక్రియే. అరకొరగా మందులు వాడటం, సరైనవి వాడకపోవటం, సొంతంగా కొనుక్కొని వేసుకోవటం వంటివన్నీ దీనికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. మనదగ్గర ఆసుపత్రులకే పరిమితమైన మందులను కొందరు డాక్టర్లు తెలిసో తెలియకో బయట కూడా సిఫారసు చేస్తుండటం గమనార్హం. దీంతో మామూలు ఇన్‌ఫెక్షన్లు సైతం మొండిగా తయారవుతున్నాయి. మరోవైపు వ్యవసాయం, చేపల పెంపకం, జంతువుల పెంపకం వంటి వాటిల్లోనూ విచ్చలవిడిగా యాంటీబయోటిక్ మందులు వాడుతున్నారు. ఇదీ మందుల నిరోధకతకు దారితీస్తోంది.

### మూడు వర్గాలుగా..

'ఏ మందయితేనేం వేసుకుంటే పోలా' అని కొందరు.. 'ఆ డాక్టర్ దగ్గరికి వెళ్తే మాత్రం రాసేది ఇవే కదా' అని మరికొందరు సొంతంగా కొనుక్కొని యాంటీబయోటిక్స్ వాడేస్తుంటారు. కొందరు డాక్టర్లు సైతం బ్యాక్టీరియా రకాలేంటన్నది తెలుసుకోకుండానే గుడ్డిగా ఏదో ఒక యాంటీబయోటిక్ ఇచ్చేస్తున్నారు. ఇవన్నీ మనల్ని మొండి బ్యాక్టీరియా యుగంలోకి నెట్టేస్తున్నాయి. మనల్ని మళ్లీ యాంటీబయోటిక్స్ లేని రోజుల్లోకి తీసుకెళ్తున్నాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇటీవల యాంటీబయోటిక్ మందులను అందుబాటులో ఉండాల్సినవి (యాక్సెస్), జాగ్రత్తగా వాడుకోవాల్సినవి (వాచ్), పరిమితం చేయాల్సినవి (రిజర్వ్).. అంటూ 'అవేర్' పేరుతో మూడు వర్గాలుగా విభజించింది.

- **యాక్సెస్:** తక్కువ నిరోధకతకు అవకాశమున్న మందులను ఈ కోవలో చేర్చారు. తరచుగా కనబడే 25 రకాల ఇన్‌ఫెక్షన్లకు వాడాల్సిన మందులు ఇందులోకి వస్తాయి. వీటిని ఎల్లవేళలా, తక్కువధరకు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.
- **వాచ్:** నిరోధకతకు ఎక్కువ అవకాశమున్న మందుల వర్గమిది. మనుషులకైనా, జంతువులకైనా ప్రత్యేకమైన సందర్భాల్లోనే వాడాల్సిన వాటిని ఇందులో చేర్చారు.
- **రిజర్వ్:** ఇతరత్రా యాంటీబయోటిక్ మందులేవీ పనిచేయని పరిస్థితుల్లోనే వాడుకోవాల్సినవి ఈ కోవలోకి వస్తాయి.

**(ఉదాహరణకు: చెవి ఇన్‌ఫెక్షన్‌కు మొదట్లో ఎలాంటి యాంటీబయోటిక్స్ అవసరం లేదు. మందులు అవసరమైతే ముందుగా ఎమాగ్జిసిలిన్ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటికీ తగ్గకపోతే ఎమాగ్జిసిలిన్‌కు క్లావలానిక్ యాసిడ్ కలిపి ఇవ్వాలి. గొంతునొప్పి విషయంలోనూ మొదట్లో ఎలాంటి మందులూ ఇవ్వకూడదు. మందులు అవసరమైతే ముందుగా ఎమాగ్జిసిలిన్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే క్లారిత్రోమైసిన్ ఇవ్వాలి.)**

### మనమేం చేయాలి?

యాంటీబయోటిక్ మందులను కాపాడుకోవటం, వాటి సామర్థ్యం తగ్గకుండా చూసుకోవటం మన చేతుల్లోని పనే. ఇందుకు కొన్ని జాగ్రత్తలు పాటించటం మనందరి విధి.

- **శుభ్రత ముఖ్యం:** బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లకు మూలం అపరిశుభ్రత. ఇంటా బయటా సరైన శుభ్రత పాటిస్తే వీటి బారినపడకుండా చూసుకోవచ్చు. మందులు వాడాల్సిన అవసరమే ఉండదు. నిరోధకత వచ్చే అవకాశమే లేదు. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవటం ద్వారా చాలావరకు ఇన్‌ఫెక్షన్లను దూరంగా ఉంచుకోవచ్చు.
- **సొంతంగా వాడకూడదు:** మనదగ్గర చాలామంది డాక్టర్ దగ్గరికి వెళ్లకుండా, సొంతంగానే యాంటీబయోటిక్ మందులు కొనుక్కొని వేసుకుంటుంటారు. ఇది ఎంతమాత్రమూ తగదు.
- **బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లకే:** బ్యాక్టీరియా ఏక కణజీవులు. ఇవి శరీరం లోపల, బయట.. అంతటా ఉంటాయి. నిజానికి చాలారకాల బ్యాక్టీరియాలు మనకేమీ హాని చేయవు. పైగా ఎంతో మేలు చేస్తాయి. కొన్ని మాత్రం గొంతునొప్పి, చెవి ఇన్‌ఫెక్షన్ల వంటి జబ్బులను తెచ్చిపెడతాయి. వైరస్‌లు బ్యాక్టీరియా కన్నా చిన్నవి. ఇవి శరీరంలో తప్ప బయట వృద్ధి చెందవు. కణాల్లోకి చొచ్చుకెళ్లి, వేగంగా వృద్ధి చెందుతూ జబ్బులను తెచ్చిపెడతాయి. సాధారణ జలుబు, దగ్గు, ఫ్లూ వంటివి ఇలాంటివే. వీటికి యాంటీబయోటిక్స్ పనిచేయవు. గొంతునొప్పి, టాన్సిల్ వాపు, చీము వంటివి ఉంటేనే ఇవి అవసరమవుతాయని గుర్తించాలి.
- **అరకొరగా వద్దు:** యాంటీబయోటిక్ మందులను పూర్తి మోతాదులో, పూర్తి కాలం వాడుకోవాలి. మధ్యలో మానెయ్యొద్దు. చాలామంది రెండు మూడు రోజులు మందులు వాడి, లక్షణాలు తగ్గగానే జబ్బు నయమైందనుకొని ఆపేస్తుంటారు. ఇలా చేస్తే ఇన్‌ఫెక్షన్ తిరగబెడుతుంది. ఈసారి మరింత తీవ్రంగానూ దాడిచేస్తుంది.
- **డాక్టర్ చెప్పినట్టుగానే:** సరైన మోతాదులో, సరైన సమయంలో తీసుకోవటం ముఖ్యం. యాంటీబయోటిక్స్‌లో కొన్ని కొంత సమయం వరకే (టైమ్ డిపెండెంట్) పనిచేస్తాయి. మందు ఒంట్లోకి ప్రవేశించాక కొంత సమయానికి దాని ప్రభావం తగ్గుముఖం పడుతుంది. అప్పుడు మరో మోతాదు ఇవ్వగానే తిరిగి సమర్థంగా పనిచేయటం ఆరంభిస్తుంది. అందుకే డాక్టర్లు కొన్నింటిని పొద్దున, మధ్యాహ్నం, రాత్రి ఇలా ఒకో మాత్ర వేసుకోమని చెబుతుంటారు. దీన్ని కచ్చితంగా పాటించాలి. మరికొన్ని మందులను మోతాదుల వారీగా (డోస్ డిపెండెంట్) ఇస్తుంటారు. వీటిని రోజుకు ఒకసారే పెద్ద మోతాదులో ఇస్తారు (ఉదా: అమికసిన్, అజిత్రోమైసిన్). ఇవి చాలాసేపు అదే స్థాయిలో పనిచేస్తాయి. కానీ మనలో చాలామంది ఒక మాత్రతో ఏమవుతుంది? కావాలని డాక్టర్ తక్కువగా రాశాడేమోనని మూడు నాలుగు వేసుకుంటుంటారు. ఇలాంటి ప్రయోగాలు చేయొద్దు.
- **మిగిలిపోయినవి వాడొద్దు:** ఇంట్లో ఎవరికైనా జ్వరం వచ్చినపుడు డాక్టర్ ఏవైనా యాంటీబయోటిక్స్ మందులు రాసిచ్చారనుకోండి. ఇంకెవరికైనా జ్వరం వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్లటం ఎందుకు దండగ అనుకుంటూ అవే మందులు వేసేస్తుంటారు. ఇది తప్పు. డాక్టర్లు మన వయసు, బరువును బట్టి మందుల మోతాదును నిర్ణయిస్తారు. ఆయా సమస్యలను బట్టి యాంటీబయోటిక్స్ ఎంచుకుంటారు. అందువల్ల అవే మందులు అందరికీ పనిచేస్తాయని, ఒకే మోతాదు అందరికీ సరిపోతుందని అనుకోవటం తగదు. మిగిలిపోయిన మందులను పారెయ్యటం ఉత్తమం.
- **సమతులాహారం, వ్యాయామం:** ఇవి రోగనిరోధకశక్తిని బలోపేతం చేసి ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడతాయి. ఫలితంగా యాంటీబయోటిక్స్ అవసరమే ఉండదు.
- **టీకాలు:** అవసరమైన టీకాలన్నీ తీసుకోవటం ద్వారా యాంటీబయోటిక్స్ వేసుకోవాల్సిన పరిస్థితిని నివారించుకోవచ్చు.
- **కల్చర్ పరీక్ష తర్వాతే:** బ్యాక్టీరియా ఉన్నదీ లేనిదీ.. ఏ రకానికి చెందినది అనేవి కల్చర్ పరీక్ష చేస్తేనే తెలుస్తాయి. ఆ తర్వాతే తగు యాంటీబయోటిక్స్ వాడుకోవాలి. సాధారణంగా పరీక్ష ఫలితాలు రావటానికి రెండు మూడు రోజులు పడుతుంది. ఆలోపు పరిస్థితిని బట్టి, అనుభవాన్ని ఉపయోగించి డాక్టర్లు యాంటీబయోటిక్ మందులను సూచిస్తారు. ఫలితాలు వచ్చాక అదే మందును కొనసాగించొచ్చు. అవసరమైతే మందును, మోతాదులను మార్చొచ్చు. ఒకవేళ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ లేకపోతే లక్షణాలు తగ్గటానికి ఇతరత్రా పద్ధతులేంటో డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి. అంతేతప్ప యాంటీబయోటిక్ మందులు రాయాలని పట్టుబట్టొద్దు.

# కాలేయానికి 'పొట్టు' భద్రత!

పొట్టుతీయని ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నది కొత్త సంగతేమీ కాదు. మరి ఇవి కాలేయ క్యాన్సర్ నివారణకూ తోడ్పడతాయన్న సంగతి తెలుసా? రోజుకు 7 గ్రాములు, అంతకన్నా తక్కువగా పొట్టుతీయని ధాన్యాలు తీసుకునేవారితో పోలిస్తే.. రోజుకు 33 గ్రాములు లేదా రెండు సార్లు పొట్టుతీయని ధాన్యాలు తినేవారికి కాలేయ క్యాన్సర్ ముప్పు గణనీయంగా తగ్గుతున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. సుమారు 24 సంవత్సరాల పాటు 1.25 లక్షల మందిని పరిశీలించి మరీ పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. అదనంగా తీసుకునే ప్రతి 12 గ్రాముల ధాన్యాలకు కాలేయ క్యాన్సర్ ముప్పు 16% వరకు తగ్గుముఖం పడుతుండటం విశేషం. పొట్టుతీయని ధాన్యాల్లోని పీచు ఇన్సులిన్ నిరోధకత, రక్తంలో ఇన్సులిన్ స్థాయులు, ఒంట్లో వాపు ప్రక్రియ తగ్గటానికి తోడ్పడుతుంది. ఫలితంగా కాలేయ క్యాన్సర్ ముప్పూ తగ్గుతుందన్నమాట. ఊబకాయం, మధుమేహం, దీర్ఘకాల హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, అతిగా మద్యం తాగటం, పొగ అలవాటు వంటివన్నీ కాలేయ క్యాన్సర్‌కు దారితీస్తాయి. పీచు పదార్థం తగ్గటమూ కాలేయ క్యాన్సర్ ముప్పును తెచ్చిపెట్టొచ్చని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. అందువల్ల దంపుడు బియ్యం, పొట్టుతీయని గోధుమలు, చిరుధాన్యాలు, ఓట్స్ వంటివి ఆహారంలో చేర్చుకోవటం మంచిది.








# ఏడో నెల.. ఛాతీలో మంట తగ్గేదెలా?

**సమస్య - సలహా**

**సమస్య:** నేను ఏడు నెలల గర్భిణిని. మొదట్నుంచీ ఛాతీలో మంటగా ఉంటోంది. మందులు వేసుకుంటున్నా పూర్తిగా తగ్గటం లేదు. దీనికి కారణమేంటి? ఆహారపరంగా ఏవైనా జాగ్రత్తలు తీసుకోవాలా?

– రాగిణి, హైదరాబాద్

**సలహా:** మీలాగే గర్భిణుల్లో చాలామంది ఛాతీలో మంటతో సతమతమవుతుంటారు. ముఖ్యంగా రెండో, మూడో త్రైమాసికంలో ఇది మరింత ఎక్కువగానూ ఉంటుంది. దీనికి మూలం గర్భిణుల్లో ప్రొజెస్టిరాన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి కావటం. దీని వల్ల పేగుల కదలికలు తగ్గుతాయి. అన్నవాహిక, జీర్ణాశయం కలిసే చోట ఉండే కండర వలయం (స్ఫింక్టర్) బిగువు తగ్గుతుంది. దీంతో జీర్ణాశయంలోని పదార్థాలు పైకి ఎగదన్నుకొని వస్తుంటాయి (రిఫ్లక్స్). మరోవైపు గర్భసంచి బరువు పెరగటం వల్ల జీర్ణాశయం మీద ఒత్తిడి ఎక్కువవుతుంది. ఫలితంగా ఆహారం జీర్ణమయ్యే క్రమంలో విడుదలయ్యే ఆమ్లాలు, వెలువడే వాయువులు పైకి వచ్చేస్తుంటాయి. అజీర్ణం, పులితేన్పులు, ఛాతీలో మంట వంటివి ఇబ్బంది పెడుతుంటాయి. గర్భిణుల్లో తరచుగా చూసే సమస్యే ఇది. దీని గురించి పెద్దగా భయపడాల్సిన పనిలేదు. మరీ అవసరమైతేనే మందులు వాడుకోవాలి. ఎందుకంటే ఛాతీలో మంటను తగ్గించే యాంటాసిడ్ మందులను అదేపనిగా ఎక్కువకాలం తీసుకుంటే శరీరం క్యాల్షియం, ఐరన్‌ను గ్రహించుకునే సామర్థ్యం తగ్గుతుంది. గర్భిణులకు క్యాల్షియం, ఐరన్ అత్యవసరమనే విషయాన్ని మరవరాదు. మందుల కన్నా కూడా ఆహార పరంగా తగు జాగ్రత్తలు తీసుకోవటం మేలు. ముఖ్యంగా తక్కువ పరిమాణంలో ఎక్కువసార్లు ఆహారం తీసుకోవటం అలవాటు చేసుకోవాలి. ఒకేసారి ఎక్కువగా తింటే కడుపు బాగా నిండినట్టయ్యి.. పదార్థాలు పైకి ఎగదన్నుకొచ్చి ఛాతీలో మంట తలెత్తొచ్చు. తక్కువ తక్కువగా, రోజుకు ఆరేడుసార్లు తింటే ఆహారం జీర్ణాశయంలోనే జీర్ణమవుతుంది. కడుపు తేలికగా ఉంటుంది. ఉదయం తీసుకునే అల్పాహారం నుంచే జాగ్రత్తలు పాటించాలి. కాస్త చప్పగా ఉండే చపాతీ, అటుకులు, చిరుధాన్యాలతో చేసిన రొట్టెలు, మరమరాల ఉప్మా వంటివి వెంటనే ఆమ్లం ఉత్పత్తి కాకుండా చూస్తూ.. వికారం, ఛాతీలో మంట రాకుండా చేస్తాయి. తేలికగా జీర్ణమవుతూ కడుపులో హాయి భావన కలగజేస్తాయి. పుల్లగా ఉండే నిమ్మ, నిమ్మజాతి పండ్లు, కాయగూరలను నేరుగా కాకుండా ఇతర పదార్థాలతో కలిపి తినటం మంచిది. ఉదాహరణకు పండ్ల రసాల్లో నీళ్లు, చక్కెర కలుపుకోవచ్చు. పుల్లటి పెరుగు కన్నా తాజా పెరుగు తీసుకోవాలి. బాగా పులిసిన పిండికి బదులు తాజా పిండితో చేసే దోసెలు తినటం మంచిది. వేపుళ్లు, కొవ్వు పదార్థాలు, ఘాటు వాసనలతో కూడిన మసాలా వంటకాలు సైతం ఛాతీలో మంటకు దారితీయొచ్చు. వీటి విషయంలో పరిమితి పాటించాలి.

పీచు పదార్థం తగినంతగా తీసుకుంటే పేగుల కదలికలు మెరుగవుతాయి. దీంతో మలబద్ధకం, ఛాతీ మంటను నివారించుకోవచ్చు. నమిలి తినగలిగే పదార్థాలు తీసుకోవటమూ బాగా ఉపయోగపడుతుంది. భోజనం చేసేటప్పుడు, చేసిన తర్వాత నిటారుగా కూర్చోవాలి. భోజనం చేసే సమయంలో నీళ్లు ఎక్కువగా తాగకూడదు. భోజనానికీ భోజనానికీ మధ్యలో తరచుగా నీళ్లు తాగితే ఆమ్ల ప్రభావం తగ్గుముఖం పడుతుంది. ఆకలి వేస్తున్నట్టు అనిపించగానే భోజనం చేయటం ఉత్తమం. ఆకలి వేస్తున్నా తినకుండా ఎక్కువసేపు అలాగే ఉండిపోతే ఆమ్లం ఉత్పత్తి పెరుగుతుంది. ఇది ఛాతీ మంటకు దారితీస్తుంది. తిన్న వెంటనే కాకుండా ఒకట్రెండు గంటల తర్వాతే నిద్రకు ఉపక్రమించాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మందులతో పనిలేకుండానే ఛాతీలో మంటను తగ్గించుకోవచ్చు.





– డా॥ కె. ఉమాదేవి
ప్రొఫెసర్, న్యూట్రిషన్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
'సమస్య – సలహా' సుఖీభవ
ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in




ఈనాడు సినిమా

# పోరాటంలో సరిలేరు నీకెవ్వరూ

గ్లామర్‌లోనూ, నటనలోనూ, స్టార్‌డమ్‌లోనూ.... మహేష్‌బాబుకి సరిలేరెవ్వరూ. తను చిన్నగా నవ్వితే చాలు.. ఫిదా అయిపోతారందరూ. తెరపై మహేష్ బాబు చేసే పోరాట ఘట్టాలు కూడా పసందుగానే ఉంటాయి. అంతెందుకు.. పోరాటాల్లో మహేష్ పరిగెట్టే తీరుకి కూడా అభిమానులున్నారు. తాజాగా అలాంటి పోరాట ఘట్టమే ఒకటి తయారవుతోంది. మహేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. రష్మిక కథా నాయిక. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. మహేష్‌బాబు, కొంతమంది ఫైటర్లపై ఓ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికోసం ఓ సెట్ రూపొందించారు. విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు. త్వరలోనే రామోజీ ఫిలింసిటీలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు.



మహేష్‌బాబు

# ఫుట్‌బాల్ మైదానంలో అజయ్.. కీర్తి



అజయ్ దేవగణ్



కీర్తి సురేష్

ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, కీర్తి సురేష్ జోడీ కట్టారు. వీరిద్దరూ కలిసి ఓ నిజ జీవిత కథా చిత్రంలో నటిస్తున్నారు. దీనికి 'మైదాన్' అనే పేరును ఖరారు చేశారు. ఫుట్‌బాల్ క్రీడ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. భారత ఫుట్‌బాల్ జట్టు కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ పాత్రలో అజయ్ నటిస్తున్నారు. 1951, 1962 ఆసియన్ గేమ్స్ సాకర్ పోటీల్లో భారత జట్టును విజేతగా నిలపడానికి సయ్యద్ పడిన తపన, అమలు చేసిన వ్యూహాలను ఈ చిత్రం ఆవిష్కరించనుంది. 'బదాయి హో' దర్శకుడు అమిత్ శర్మ తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సోమవారం మొదలైంది. ఈ సందర్భంగా గ్లోబ్ ఆకారంలో ఉన్న ఫుట్‌బాల్ పోస్టర్‌ను అజయ్ ట్విటర్‌లో పంచుకున్నారు.



'సాహో'లో ప్రభాస్, జాక్వెలైన్ ఫెర్నాండెజ్

# ముగ్గుల పండక్కి వస్తున్న మంచోడు



కల్యాణ్‌రామ్, మెహరీన్

2020 సంక్రాంతికి సినిమాల హంగామా ఎక్కువగానే ఉన్నట్టు కనిపిస్తోంది. మహేష్ బాబు 'సరిలేరు నీకెవ్వరు', అల్లు అర్జున్ 'అల వైకుంఠపురములో' సంక్రాంతి పండక్కే రానున్నాయి. ఇప్పుడు కల్యాణ్‌రామ్ కూడా బరిలోకి దిగిపోయారు. తన కొత్త చిత్రం 'ఎంత మంచివాడవురా'ని ముగ్గుల పండక్కే విడుదల చేస్తున్నారు. మెహరీన్ కథానాయిక. సతీష్ వేగేశ్న దర్శకుడు. ఉమేష్ గుప్త, సుభాష్ గుప్త నిర్మాతలు. శివలెంక కృష్ణ ప్రసాద్ సమర్పకుడు. నిర్మాతలు మాట్లాడుతూ "జులై 31న చిత్రీకరణ ప్రారంభించాం. తొలి షెడ్యూలు పూర్తయింది. ఈనెల 26 నుంచి సెప్టెంబరు 22 వరకూ రెండో షెడ్యూలు, అక్టోబరులో మూడో షెడ్యూల్ పూర్తవుతాయి. సంక్రాంతికి విడుదల చేయాలని నిర్ణయించాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఓ మంచి కథకు మంచి కథానాయకుడు, మంచి సాంకేతిక బృందం దొరికింది. అన్ని వర్గాల వారినీ అలరించే చిత్రంగా తీర్చిదిద్దుతున్నాం. గోపీ సుందర్ స్వరాలు ఆకట్టుకుంటాయ"న్నారు. నరేష్, సుహాసిని, తనికెళ్ల భరణి, పవిత్రా లోకేష్, రాజీవ్ కనకాల, వెన్నెల కిషోర్, ప్రవీణ్, ప్రభాస్ శీను తదితరులు నటిస్తున్నారు.



కార్తీక్ ఆర్యన్

# 13 ఏళ్ల తర్వాత మరోసారి దెయ్యాల వేట

పదమూడేళ్ల క్రితం అక్షయ్ కుమార్ నటించిన చిత్రం 'భూల్ భులైయా'. 'చంద్రముఖి' ఆధారంగా తెరకెక్కిన ఆ చిత్రం మంచి విజయాన్నందుకుంది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కబోతోంది. 'భూల్ భులైయా 2' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యువ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఆయన దెయ్యాల వేటగాడి పాత్రలో నవ్వించనున్నారు. అనీస్ బజ్మీ దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. నుదుట విబూది, మెడలో రుద్రాక్షలు, కళ్లకు కూలింగ్ గ్లాసెస్, పసుపు రంగు దుస్తులు ధరించి చేతిలో ఎముకతో పుర్రెల మధ్య నిల్చొని ఉన్న కార్తిక్ గెటప్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలో సెట్స్ మీదకు వెళ్లనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జులై 31న విడుదల చేయనున్నారు.

# మళ్లీ థ్రిల్ చేయడానికి!



ధనుంజయన్, శివప్రసాద్, రాజశేఖర్, జీవిత

'గరుడవేగ', 'కల్కి' చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించారు రాజశేఖర్. ఇవి రెండూ థ్రిల్లర్ కథాంశాలే. మరోసారి ఓ థ్రిల్లర్ చిత్రంలో నటించడానికి పచ్చజెండా ఊపారు రాజశేఖర్. ఈ చిత్రానికి ప్రదీప్ కృష్ణమూర్తి దర్శకత్వం వహిస్తారు. ధనుంజయన్ నిర్మాత. సైమన్ కె.కింగ్ సంగీతం అందిస్తారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్మాత మాట్లాడుతూ "బేతాళుడు' చిత్రాన్ని తెరకెక్కించిన ప్రదీప్ ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. కథ చక్కగా కుదిరింది. ఒక్కసారి వినగానే రాజశేఖర్ ఈ కథకు ఓకే చెప్పారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని ఎంపిక చేస్తున్నాం. 2020 మార్చిలో విడుదల చేస్తామ"న్నారు. కార్యక్రమంలో జీవిత, ఎగ్జిక్యూటివ్ నిర్మాత శివ ప్రసాద్ పాల్గొన్నారు.

# 9 గంటల్లో ఏం జరిగింది?



దివి ప్రసన్న, చైతన్య, మంచు లక్ష్మి

పూర్తిగా ఆస్ట్రేలియాలో చిత్రీకరణ జరుపుకున్న తొలి తెలుగు సినిమా మాదే అన్నారు మహేష్‌రెడ్డి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హవా'. చైతన్య మాదాడి, దివి ప్రసన్న జంటగా నటించారు. ఫిల్మ్ అండ్ రీల్ సంస్థ నిర్మించింది. ఈ నెల 23న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా థీమ్ సాంగ్‌ని నటి, నిర్మాత మంచు లక్ష్మి విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ "విభిన్నమైన కథతో తెరకెక్కినట్టు ప్రచార చిత్రాల్ని బట్టి అర్థమవుతోంది. ఇలాంటి కథలే ప్రేక్షకులకు నచ్చుతున్నాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "9 గంటలు.. 9 మెదళ్లు... 9 నేరాలతో కూడిన చిత్రమిది. 9గంటల్లో ఏం జరిగిందన్నది ఆసక్తికరమ"న్నారు.

పంచ్ డైలాగ్

**న్యాయంగా బ్రతకడానికి ఇవి రామాయణం, భారతం రోజులు కావు.**

చిత్రం: రంగు

– పంపినవారు: సన్యాసి నాయుడు, ఎరుకువాని పాలెం

గీతోపదేశం

**అసాధ్యం అనుకుంటే పనులేవీ జరగవురా**
**తెగించే గుణమే నీ బలమంటూ తలపడరా**
**బతుకంటే భయమంటే వెనుకడుగై ఉంటావంతే**
**ఎదురీతే తెలిసుంటే ప్రతి గెలుపూ ఇక నీ వెంటే**

గీతం: మీసమున్న మన్మథుడా...., చిత్రం: రగడ

రచన: రామజోగయ్యశాస్త్రి, – పంపినవారు: వి.శ్రావణ్, అనంతపురం

# చరిత్రకి ఫొటోగ్రఫీ ముఖ్య ఆధారం

"ఒకప్పుడు ఫొటోలతోనే నా సినిమాల ప్రచారం సాగింది. మూడు తరాల ఫొటోగ్రాఫర్లతో నాకు అనుబంధం ఉంది" అన్నారు ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్. తెలుగు సినీ స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరిగింది. ఈ వేడుకకి రాజేంద్రప్రసాద్‌తోపాటు వి.వి.వినాయక్, అల్లరి నరేష్, రసూల్ ఎల్లోర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు శ్యామల్‌రావు, శ్యామ్‌ని సత్కరించారు. అనంతరం ప్రముఖ ఛాయాగ్రాహకుడు, దర్శకుడు రసూల్ ఎల్లోర్ మాట్లాడుతూ "చరిత్ర రాయడానికి ముఖ్య ఆధారం ఫొటోగ్రఫీనే. సినిమా రూపకల్పనలో వాళ్ల పాత్ర విలువైనది" అన్నారు. దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ "తారలు ఎవరైనా ఫొటోగ్రాఫర్లు తీసిన అందమైన ఫొటోల ద్వారా వెలుగులోకి వచ్చిన వాళ్లే. స్టిల్ ఫొటోగ్రాఫర్లంటే నాకు అభిమానం. దర్శకుడి ఊహకు అనుగుణంగా కళా దర్శకులకి కూడా వాళ్లు సహకారం అందిస్తుంటారు. ఏ చిత్రం చేసినా, సొంత సినిమాగా భావించి చేస్తార"న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినిమా స్టిల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీను, ప్రధాన కార్యదర్శి కె.శ్రీను, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్బారావు, కోశాధికారి వీరభద్రమ్, చంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చంద్ర, వైవీఎస్ చౌదరి, రాజేంద్రప్రసాద్, అల్లరి నరేష్, రసూల్, నారాయణ



ఉత్తేజ్, హేమ, రాజా రవీంద్ర, అలీ, అశోక్‌కుమార్, వి.కె.నరేష్, సి.కల్యాణ్

# తెలుగు నటుల్ని ప్రోత్సహించండి

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)లో సభ్యులుగా కొనసాగుతున్న చాలామంది అవకాశాలు లేక బాధపడుతున్నారని 'మా' అధ్యక్షుడు వి.కె.నరేష్ అన్నారు. తెలుగు సినిమాల్లో తెలుగువారికి అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ విషయంపై సోమవారం 'మా' తరఫున తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం, నిర్మాతల మండలి, రచయితల సంఘం అధ్యక్షులకి వినతిపత్రాలు అందజేశారు. ఆయా సంఘాల తరఫున ఎన్.శంకర్, సి.కల్యాణ్, వై.సుప్రియ, పరుచూరి గోపాలకృష్ణ వినతి పత్రాల్ని స్వీకరించారు. అనంతరం 'మా' ప్రధాన కార్యదర్శి జీవిత రాజశేఖర్ మాట్లాడుతూ "చాలా మంది 'మా' సభ్యులు అవకాశాలు లేక ఖాళీగా ఉంటున్నారు. మేం ఒక వెబ్‌సైట్‌ని ఏర్పాటు చేసి, అందులో నటుల వివరాలు, ఫోన్ నెంబర్లు, వాళ్లు నటించిన ఒక వీడియోని ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అన్నారు. కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమకి చెందిన నాలుగు సంఘాల వారు సహకారం అందిస్తామని హామీ ఇచ్చార"న్నారు. కార్యక్రమంలో హేమ, అలీ, రాజా రవీంద్ర, ఉత్తేజ్, సురేష్ కొండేటి, అనితా చౌదరి, జయలక్ష్మి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కంగన చీర రూ.ఆరు వందలే



కంగనా రనౌత్

అసలే ఆమె ఓ అగ్ర కథానాయిక. దానికి తోడు కథానాయకులకు దీటుగా రూ.కోట్లల్లో పారితోషికం తీసుకుంటుంది. ఆమె అడుగు బయటికి పెడితే చాలు.. వేల కళ్లు ఆమెను తదేకంగా చూస్తాయి. ఎలాంటి దుస్తులు వేసుకుంది? అవి ఎంత ఖరీదు చేస్తాయని ఆరాలు మొదలవుతాయి. అందుకే కథానాయికలు బయటికొచ్చినప్పుడు కళ్లు చెదిరే ఖరీదైన దుస్తుల్లోనే కనిపిస్తుంటారు. కానీ కంగనా రనౌత్ అలాంటివన్నీ పట్టించుకునే రకం కాదు. తన మనసుకు నచ్చింది వేసుకుని వెళ్తుంటుంది. ధర గురించి అసలు ఆలోచించదు. అందుకే కేవలం రూ.600 విలువ చేసే ఓ చేనేత చీరను ముచ్చటపడి కొనుక్కుంది. దాన్ని ధరించి, పైన బ్లాక్ బ్లేజర్ వేసుకుని కూలింగ్ గ్లాసెస్, హ్యాండ్ బ్యాగ్‌తో కంగన నడిచి వస్తుంటే హుందాతనానికి నిలువెత్తు రూపంలా కనిపించింది. ఈ ఫొటోను కంగన సోదరి రంగోలి ట్విటర్ పంచుకుంటూ "ఈ చీరను కంగన కోల్‌కతాలో రూ.600కు కొనుక్కుంది. అంత తక్కువకే ఇంత మంచి చీరలు దొరుకుతాయని తెలిసి ఆశ్చర్యపోయింది. అయితే ఈ చీరలను నేసేవారు అంత తక్కువ సంపాదన కోసం ఎంత శ్రమిస్తారో అర్థమై బాధపడింద"ని ట్వీట్ చేసింది. కంగన ఇటీవలే 'జడ్జిమెంటల్ హై క్యా'తో ప్రేక్షకులను పలకరించింది.

# వసుంధర

**ఒకప్పుడు వాలుజడే అందం. ఇప్పుడు అంత పొడుగాటి జుట్టు ఉండటం లేదు. ఉన్న జుట్టుతో జడ వేసుకోలేం... అన్ని సందర్భాలకు వదిలేయలేం. ఇలాంటి వారికి పరిష్కారం హెయిర్‌స్టైలింగ్‌లో చిన్నచిన్న కిటుకులు పాటించడమే. అప్పుడే ఎక్కడైనా ప్రత్యేకంగా కనిపించొచ్చు.**

### బ్రెయిడెడ్ హెయిర్‌స్టైల్

పెళ్లిళ్లు ఇతర వేడుకలకు ఇది బాగుంటుంది. లెహెంగాలు, పరికిణీ ఓణీల్లో ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంది. ముందుగా జుట్టుని చక్కగా దువ్వుకుని మధ్యపాపిట తీయాలి. పైనుంచి రెండువైపులా వెనక్కి అల్లుకుంటూ రావాలి. మెలితిప్పినా బాగుంటుంది. అల్లుకున్న పాయకు మరోపాయనీ కలుపుతూ రావొచ్చు. అలా అల్లిన పాయలు కదలకుండా పిన్నులు పెట్టి జుట్టు వదిలేయొచ్చు. వీటికి వెనుకవైపు ఫ్లోరల్ పిన్నుల్ని పెట్టుకుంటే ప్రత్యేకంగా కనిపిస్తారు.



# అల్లేసి వదిలేస్తే... అదుర్స్



### ఫిష్ టెయిల్

జుట్టుని రెండు పాయలుగా విడదీయాలి. బయటివైపు నుంచి సన్నని పాయను తీసుకుని రెండో భాగంలో కలపాలి. ఇలానే మరోవైపూ చేయాలి. ఇలా చేసుకుంటూ చివర్లో రబ్బరు బ్యాండ్ పెట్టుకుంటే చాలు. ట్రెండీలుక్‌తో ఆకట్టుకోవచ్చు. ఆధునిక దుస్తులమీదకు అదిరిపోతుందీ హెయిర్ స్టైల్.



### సింగిల్ బ్రెయిడ్ లూజ్ హెయిర్

జుట్టుని చిక్కుల్లేకుండా దువ్వుకుని పాపిట తీయాలి. జుట్టు ముందు భాగంలో ఒకవైపు మాత్రమే ఫ్రెంచ్‌స్టైల్‌లో అల్లుకోవాలి. అలా వెనుక వరకూ అల్లుకుని జుట్టు ముందుకు వేసుకుంటే పార్టీలుక్‌తో మెరిసిపోవచ్చు.



### డచ్ బ్రెయిడ్

ఇది చూడ్డానికి కష్టంగా అనిపించినా వేసుకోవడం తేలికే. సాధారణంగా మనం అల్లేటప్పుడు ఒకపాయ మీదనుంచి మరో పాయను వేసుకుంటాం కదా! ఇక్కడ వెనుకవైపు అల్లాలి. అంటే... ఒకదాని కిందనుంచి మరొకదాన్ని తీయాలి. పై నుంచి కిందకు అల్లుకుంటూ వెళ్లాలి. క్రీడాకారిణులకు ఇది మంచి లుక్‌ని తెచ్చిపెడుతుంది.



### హాఫ్‌బన్

సాధారణంగా జుట్టుని రెండు భాగాలుగా చేసి క్లిప్ పెట్టుకోవడం తెలిసిందే. దీనిలో పైన పఫ్‌లా కొంత జుట్టు తీసుకుని ముందు నుంచి మధ్యవరకూ అల్లుకోవాలి. ఆపై జుట్టుని వదిలేసుకోవచ్చు. పొట్టి జుట్టు ఉన్నవారికే కాదు... పొడవు జుట్టు ఉన్నవారికీ బాగుంటుంది. వెస్టర్న్ లుక్‌తో కనిపించాలనుకునేవారికి ఇది సరైన ఎంపిక.

## బంగారం వెండి

19న ముగింపు–క్రితం



| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 38,800 | 39,000 | 38,720 | 38,970 |
| ఆర్నమెంట్ | 36,250 | 36,500 | 35,860 | 36,090 |
| వెండి (కిలో) | 44,758 | 45,250 | 44,900 | 45,400 |
| | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | |
| బంగారం(24క్యా) | 37,450 | 37,450 | 38,740 | 39,000 |
| ఆర్నమెంట్ | 34,550 | 34,710 | 35,390 | 35,720 |
| వెండి (కిలో) | 43,500 | 44,000 | 44,700 | 45,200 |
| | విశాఖపట్నం | | తమిళనాడు | |
| బంగారం(24క్యా) | 38,560 | 38,680 | ------- | ------- |
| ఆర్నమెంట్ | 35,870 | 35,980 | 3,584 | 3,607 గ్రా |
| వెండి (కిలో) | 45,500 | 45,500 | 47.60 | 47.90 గ్రా |

స్వశక్తి



**అదో రెస్టారెంట్... అక్కడ వంట చేయడం నుంచి.. వడ్డించడం వరకూ అంతా మహిళలే. అందరూ సామాన్యులే. రకరకాల సమస్యలు ఎదుర్కొన్నవారే. అలాంటి వారందరినీ ఒక్కచోటకు చేర్చింది హిమబిందు. ఒకప్పుడు క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేసిన ఆమె... దీన్ని ఎందుకు ప్రారంభించాల్సి వచ్చిందో చెప్పుకొచ్చిందిలా...**

# ఆనంద్‌భవన్ అందరూ మహిళలే

ఇప్పుడు రెస్టారెంట్ ఓనర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న హిమబిందు ఒకప్పుడు అందరిలాంటి సామాన్య మహిళే. ఎన్నో సమస్యలు ఎదుర్కొని ఈ స్థాయికి చేరింది. తనలాంటి మహిళలకు ఓ ఆధారం కల్పించాలనే ఉద్దేశంతోనే ఏడాదిన్నర క్రితం దీన్ని ప్రారంభించింది. ఇంక్లూడ్ అనే సంస్థను ఏర్పాటుచేసి... మానసిక వైకల్యం ఉన్నవారికి అండగా నిలిచేందుకు సిద్ధమైంది. ఆ తరువాత మహిళలకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో రెస్టారెంట్ పెట్టాలనుకుంది. గృహహింస బాధితులు, ఎలాంటి ఆధారం లేని ఓ పదిమంది మహిళల్ని ఎంచుకుంది. వాళ్లకు వంటచేయడం నుంచీ, వినియోగదారులతో ఎలా వ్యవహరించాలో వివరిస్తూ... రకరకాల అంశాల్లో శిక్షణ ఇచ్చింది. కాస్త నమ్మకం వచ్చాక సికింద్రాబాద్ నేరేడ్‌మెట్‌లో ఆనంద్‌భవన్ పేరుతో రెస్టారెంట్ ఏర్పాటు చేసింది.

### ఆ అసంతృప్తితోనే...

హిమబిందు స్వస్థలం కర్నూలు. బీటెక్ పూర్తి చేసి, సైకాలజీలో పట్టా సంపాదించింది. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. కొన్ని రోజుల పాటు ఓ స్పెషల్ ఎడ్యుకేషన్ పాఠశాలకు ఎండీగానూ పనిచేసింది. ఓ సారి తన చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలన్నింటినీ పోగొట్టుకోవడంతో ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. అప్పటికే కారు నడపడం నేర్చుకున్న ఆమె ఓలాలో క్యాబ్ డ్రైవర్‌గా చేరింది. అక్కడ మొదటి మహిళా క్యాబ్ డ్రైవర్‌గా గుర్తింపు పొందింది. రోజూ ఉదయం నాలుగు నుంచి రాత్రి పది గంటల వరకు పనిచేసినా సరైన ఆదాయం లేకపోవడంతో మానేసింది. కిందటేడాది ఇంక్లూడ్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. ఇది మానసిక వైకల్యం ఉన్నవారి కోసం పనిచేస్తుంది. వాళ్లకు రకరకాల అంశాల్లో శిక్షణ ఇస్తూనే కొందరు మహిళలకూ ఆధారం కల్పించే ఉద్దేశంతో రెస్టారెంట్ ఆలోచన చేసింది. ఇక్కడ వంటచేయడం నుంచీ, బిల్లింగ్, వడ్డించడం వరకు అంతా మహిళలే.

### వాళ్లే ఎందుకంటే...

'కొందరు మహిళలు నిరాధారమైతే, మరికొందరు గృహహింస బాధితులు. ఇంకొందరికి ఇంట్లో చిన్నవయసులోనే పెళ్లి చేయాలనుకుంటారు. అలాంటివారిని ఎంపికచేసి శిక్షణ అందించా. అన్నిరకాలుగా మేం అండగా ఉంటామని చెప్పడంతో పనిచేయడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆ మహిళలకు స్థిరమైన ఆదాయం వస్తున్నా... కొన్ని సమస్యలు తప్పడంలేదు. ఒకామె భర్త ఓరోజు తాగొచ్చి నానా గొడవ చేశాడు. ఇక్కడ పనిచేసేదంతా ఆడవాళ్లే కాబట్టి... వచ్చే వినియోగదారులు అతిగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తారు. రోడ్డునపోయే వారి వెక్కిరింతలు మామూలే. ఎలాంటి సమస్యలు ఉన్నా.. మా దృష్టికి తీసుకురమ్మని చెబుతా. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయడానికీ నేను సిద్ధమేనని భరోసా ఇచ్చా. ఇప్పుడు వాళ్లపై వాళ్లకు నమ్మకం కలిగి, ధైర్యంగా పనిచేస్తున్నారు. మా రెస్టారెంట్‌లో ప్లాస్టిక్ నిషేధం. ఏదయినా సరే... అరిటాకులు లేదా స్టీలు ప్లేట్లలో వడ్డిస్తాం. పార్శిల్ కావాలనుకునే వినియోగదారులు సొంతంగా బాక్సులు తెచ్చుకోవాలి. కొందరికి ఇది నచ్చక తిట్టేవారు. మేం ముప్పైరకాల టిఫిన్లు అందిస్తాం. కడప కారం దోశ, ఉడిపి పదార్థాలు, దావణగిరి బెన్నె దోశ, ఉప్పిట్టు.. ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. మధ్యాహ్నం భోజనమూ ఉంటుంది...' అని చెబుతుంది హిమబిందు.



### విమర్శలు తప్పలేదు...

ఈ మహిళలకు పని ఇవ్వడానికి ముందు... హిమబిందు వాళ్లకు ఎంతో కౌన్సెలింగ్ ఇచ్చింది. వాళ్ల కుటుంబసభ్యులను ఒప్పించేందుకు ఎన్నో రోజులు కష్టపడింది. వాళ్లల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రయత్నించింది. వాళ్లను వాళ్లు కాపాడుకోవడం ఎలాగో నేర్పించింది. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా విమర్శించిన వారే ఎక్కువ. 'ఆడవాళ్లు మీరేం పనిచేస్తారు...' అని అన్నవాళ్లూ ఉన్నారు. కొందరు మహిళా ఉద్యోగులను చూసి వచ్చేవారు కాదు. రెస్టారెంట్ మాత్రమే కాదు... గ్రే అపారెల్ పేరుతో రెండు దుస్తుల దుకాణాలూ ప్రారంభించింది. అందులో మానసిక వైకల్యం ఉన్నవారికి ఉపాధి కల్పిస్తోంది.

### అధ్యయనం చేసింది...

దీన్ని ప్రారంభించే ముందు.. హిమబిందు కొన్నాళ్లపాటు ముంబయి, దిల్లీ వంటి ప్రాంతాలకు వెళ్లి అధ్యయనం చేసింది. ఎక్కడెక్కడ ఇలాంటి రెస్టారంట్లు పనిచేస్తున్నాయో తెలుసుకుంది. దీని నిర్వహణలో ఎదురయ్యే కష్టాలు, ఇబ్బందులపై అధ్యయనం చేసి ఓ వ్యాసమే రాసుకుంది. కొన్నిరకాల వంటల్ని నేర్చుకోవడానికి సిద్ధమైంది. మహిళలకు అండగా నిలబడితే... తనతోపాటు వాళ్లూ బాగుంటారనే సూత్రాన్ని నమ్మిన హిమబిందు... ఈ సిబ్బందికి అప్పుడప్పుడూ చిన్నచిన్న గెట్ టు గెదర్‌లు ఏర్పాటుచేస్తుంది. ఎప్పటికప్పుడు పనిపరంగా, కుటుంబపరంగా ఎదురయ్యే సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించేందుకు ముందుంటోంది.

# అమ్మాయి పెళ్లికోసం డబ్బులు దాస్తే... పారిపోయింది!

**?** మూడేళ్ల క్రితం వరకూ నేను ఓ ప్రైవేటు పాఠశాలలో టీచరుగా పనిచేశా. ఆ సమయంలో మా అమ్మాయి పెళ్లికోసమని నాకొచ్చే జీతాన్ని ఓ మహిళ దగ్గర చిట్టీ వేశా. గడువు ముగిసినా ఆమె డబ్బు ఇవ్వలేదు. గట్టిగా అడిగితే వడ్డీ చెల్లిస్తూ... అసలు మొత్తాన్ని పెళ్లి సమయానికి ఇస్తానని చెప్పింది. పెళ్లి సమయంలో తొమ్మిది లక్షలకు కేవలం లక్ష రూపాయల్ని మాత్రమే అప్పజెప్పింది. సొంతింట్లో ఉంటోంది కాబట్టి మోసం చేయదని, ఆలస్యంగానైనా ఇస్తుందని అనుకున్నా. ఈలోగా మా బాబు చదువు పూర్తి చేసుకుని వచ్చాడు. విషయం తెలిసి నిలదీస్తే వంద రూపాయల బాండ్‌పేపర్ మీద వేలిముద్రలు వేసి ఇచ్చింది. మర్నాడు రాత్రి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఆమె గురించి ఆరా తీస్తే... ఇలా చాలామందినే మోసం చేసిందని, ఇల్లుని అంతకు ముందే అమ్మేసిందని తెలిసింది. ఆమెకో కూతురు ఉంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఏమైనా ఫలితం ఉంటుందా?

**- ఓ సోదరి**

✔ మీలాంటివారు ఎంతోమంది ఇలా ప్రైవేట్ వ్యక్తుల దగ్గర చిట్టీలు వేసి మోసపోతున్నారు. ఎక్కువ వడ్డీకి ఆశపడి పొదుపు చేయాలనుకోవడం వల్ల ఇలాంటి సమస్యలే ఎదురవుతాయి. ఇలాంటి వ్యక్తుల కన్నా... రిజిస్టరైన చిట్స్ అండ్ ఫైనాన్స్ సంస్థల్ని ఎంచుకోవడం మంచిది. వాటిల్లోనూ కొన్నిసార్లు ఇలాంటి మోసాలు జరుగుతున్నా... సరైనవి ఎంచుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు. రిజిస్టర్డ్ సంస్థల్లో వాటి ఆస్తులను అటాచ్ చేసే అవకాశం ఉంటుంది. మీ విషయానికి వస్తే... మీరు ఆ మహిళకు డబ్బులు ఇచ్చినట్లు ఆధారం...చివర్లో ఆమె వేలిముద్రలు వేసిచ్చిన బాండ్ పేపర్ మాత్రమే అంటున్నారు. అదొక్కటే కాకుండా... నెలనెలా మీరు డబ్బులు కట్టినప్పుడు ఇచ్చిన రసీదుల్లాంటివి ఏమైనా ఉన్నాయా! ఆవిడ మీకు ఇచ్చిన బాండ్ పేపర్ ఖాళీదా... లేక ఏమైనా రాసి వేలిముద్రలు వేసి ఇచ్చిందా అనేది తెలియలేదు. ఒకవేళ అలా ఇస్తే వాటిని అగ్రిమెంట్ లేదా ప్రామిసరీ నోట్ కింద మార్చుకునే అవకాశం ఉందేమో లాయర్‌కి చూపించండి. బాండ్ పేపర్లతోపాటు ఖాళీ చెక్కూ తీసుకుని ఉండాల్సింది. ఓ పని చేయండి. పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేస్ కింద ఫిర్యాదు చేయండి. వాళ్లు ఆధారాలు అడుగుతారు. చిట్టీలు వేసిన మహిళ మీలానే మరికొందరినీ మోసం చేసిందంటున్నారు కదా! వాళ్లనూ కూడగట్టుకుని వెళ్తే మీ కేసుకి బలం చేకూరుతుంది. ఫిర్యాదులో ఆవిడ పాత చిరునామానే ఇచ్చి పరారీగా చెప్పండి. ఒక పత్రికా ప్రకటన ఇవ్వడం మంచిది. ఆమె కూతురు చదువుతుంటే ఆ విద్యాసంస్థ అడ్రస్ ఆధారంగా ఆ మహిళను పట్టుకునే అవకాశం ఉందేమో చూడండి. రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ తల్లీ కూతుళ్ల పేరుమీద ఇటీవల ఏమైనా లావాదేవీలు జరిగాయేమో పరిశీలించండి. ఒకవేళ ప్లాట్/ఇల్లు కొన్నా, అమ్మినా అవతలి వారి సాయంతో వారెక్కడున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చేమో ఆలోచించండి. మీకు రావలసిన డబ్బులకోసం కోర్టులో మనీ రికవరీ సూట్ దాఖలు చేయండి. ముందు పాత అడ్రస్‌తోనే దీన్ని కొనసాగించండి. నోటీస్ స్టేజ్‌లో దొరికిన కొత్త చిరునామా జతచేయొచ్చు. మీ లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలు తప్పనిసరిగా అవసరం. ఆవిడ ఫొటో, బాండ్ పేపర్లమీద సంతకాలు లాంటివి మీకు సాయపడతాయి. దీనంతటికీ సమయం పట్టొచ్చు. ఓపిక కావాలి. మీకు వేరే ఆధారం లేదు కాబట్టి పోయిన డబ్బుని రాబట్టుకోవడానికి కష్టపడక తప్పదు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. పోలీసులు సులువుగానే ఇలాంటివారు ఎక్కడున్నా గుర్తించగలుగుతారు. ప్రయత్నించండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మీ ప్రశ్నలు ఇకపై vasulegal@eenadu.net కు పంపించగలరు.

# ఉప్పు తగ్గించాలా

**అధికరక్తపోటు మొదలు... మరికొన్ని రకాల అనారోగ్యాల్ని అధిగమించాలంటే... ఆహారంలో ఉప్పు తగ్గించాలంటారు. అదెలా అనేది మీ సందేహమైతే... ఈ చిట్కాలు పాటించి చూడండి.**

- ఏ పదార్థాలు కొంటున్నా... వాటిపై ఉన్న వివరాలను ఒకటికి రెండుసార్లు చదవండి. ఉప్పుశాతం ఎంత ఉందో తెలుసుకోండి. చాలా తక్కువని తెలిస్తేనే కొనుక్కోండి. బయట హోటళ్లల్లో తింటున్నా... ఇదే సూత్రాన్ని పాటిస్తే ఉప్పుశాతాన్ని చాలామటుకూ తగ్గించొచ్చు.



- పదార్థాల్లో ఉప్పునకు ప్రత్యామ్నాయం ఆలోచించండి. నిమ్మరసం, పుదీనా, కొత్తిమీర, సన్నని అల్లంతరుగు... వంటివన్నీ సరైన ఎంపిక. రోజుకో చెంచా మాత్రమే.. ఉప్పు తీసుకునేలా చూడాలి.
- భోజనాలు చేసే చోట ఉప్పు డబ్బా లేకుండా చూసుకోవాలి. పెరుగులోనే కాదు... ఇతర పదార్థాల్లోనూ వేసుకోకుండా ఉంటారు.
- పండ్లు, పచ్చికూరగాయల్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఉప్పు వినియోగాన్ని తగ్గించొచ్చు.
- మనం గమనించం కానీ... సాస్, శాండ్‌విచ్, నూడుల్స్‌లో వాడే మసాలా పదార్థాల్లోనూ ఉప్పుశాతం ఎక్కువగా ఉంటుంది. అలాంటి వాటిని మితంగా ఎంచుకోవడమే మంచిది.

# ప్రణాళికతో తగ్గితేనే ఆరోగ్యమట!




సినీతారల్ని చూసి తామూ అలా మారిపోవాలని కోరుకునే వారు చాలామందే...! అందుకే ప్రజల నాడిని పసిగట్టి ఆయా సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారాలకు వారిని ఎంచుకుంటారు. తాజాగా శిల్పాశెట్టిని ఓ స్లిమ్మింగ్ పిల్ కోసం ప్రచారం చేయాలని కోరిందో ప్రముఖ సంస్థ. నిజానికి శిల్ప ఫిట్‌నెస్‌కి ఎంత ప్రాధాన్యం ఇస్తుందో అందరికీ తెలిసిన విషయమే. అందుకే వాస్తవానికి దూరంగా ఉన్న ఆ పదికోట్ల పిల్ ఆఫర్‌ని ఆమె తృణప్రాయంగా వదిలేసుకుంది. 'ఈ ప్రకటనలో నేను నటించాలి అంటే ముందు దాన్ని నేను నమ్మాలి కదా! ఇందుకోసం మరెవరినైనా చూసుకోండి'' అంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు స్లిమ్మింగ్ పిల్స్ వేసుకోవడం, శస్త్రచికిత్సలు ద్వారా బరువు తగ్గాలనుకోవడం, కడుపు మాడ్చుకోవడం వంటివిధానాలు బరువుని అదుపులో ఉంచవని ఆమె గట్టిగానే చెబుతోంది. ఒత్తిడితో కూడిన జీవనశైలిని మార్చుకోవడం, సరైన ఆహార పద్ధతులు అనుసరిస్తూ, వ్యాయామం చేయడం వంటివాటి వల్ల కాస్త ఆలస్యమైనా కోరుకున్న మార్పు సాధ్యమవుతుందని అంటోంది. సహజంగా బరువు తగ్గితే ఆరోగ్యానికి మేలు.. అందంగానూ కనిపించవచ్చని సూచిస్తోంది. ఇందుకు సంబంధించిన విధానాలను వివరించేందుకు ఇప్పటికే శిల్పాశెట్టి యాప్‌నీ అందుబాటులోకి తెచ్చింది. దీనిలో యోగా రొటీన్, ఫంక్షనల్ ట్రైనింగ్ వంటివన్నీ అందుబాటులో ఉంటాయి. రోజూ తీసుకునే ఆహారం తాలుకూ వివరాలన్నీ ఇందులో ఉన్నాయి. ఇప్పటికే ఈ యాప్‌ని ఐదులక్షల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వివిధ ఆసనాలు, వ్యాయామ పద్ధతుల్ని వివరిస్తూ ఎప్పటికప్పుడు వీడియోలు విడుదల చేస్తోంది శిల్ప.

**టెక్నాలజీతో ఎన్నో పనులు ఎంతో సులువుగా జరిగిపోతున్నప్పటికీ సమాచార భద్రత విషయంలో కొత్త ప్రమాదాలు ఎదురవుతున్నాయి. వెబ్‌సైట్లు హ్యాక్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు దోచేస్తున్నారు. సంస్థలకు, వినియోగదారులకు కొందరు సైబర్ దొంగలు ఎద్దఎత్తున నష్టాలు కలిగిస్తున్నారు. ఈ ఇబ్బందులను ఎలా తొలగించుకోవాలి... దీనికి సమాధానమే ఎథికల్ హ్యాకింగ్. మన సైట్‌ను మనమే హ్యాక్ చేయించుకోవడం, మన సొమ్మును దొంగిలించమని మంచి దొంగలకు మనమే చెప్పడం. అలా జరగడానికి ఉన్న అవకాశాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు తీసుకోవడం. దీన్నే ఎథికల్ హ్యాకింగ్ అంటారు. ఇప్పుడు ఈ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది.**

ఆర్థిక సేవలు అందిస్తున్న సంస్థలన్నింటిపై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. విలువైన సమాచారాన్ని (డేటా) కొట్టేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫేస్‌బుక్, గూగుల్ లాంటి దిగ్గజ కార్పొరేట్ సంస్థలకూ ఇలాంటి ప్రమాదాలు తప్పడం లేదు. సోఫోస్ సంస్థ సర్వే ప్రకారం 2018లో భారత్‌లో 76 శాతం కంపెనీలు సైబర్ దాడులకు గురయ్యాయి. ప్రపంచంలో మెక్సికో, ఫ్రాన్స్‌ల తర్వాత మనదేశంలోనే ఈ దాడులు ఎక్కువని తేలింది. సైబర్ సెక్యూరిటీ పెద్ద సవాల్‌గా మారుతోంది. దీన్ని ఎదుర్కోడానికి సమర్థ మానవ వనరులు అందుబాటులో లేవు. దీంతో అన్ని సంస్థలకు హ్యాకింగ్ నిపుణుల సేవలు అవసరమయ్యాయి. ఇప్పుడు అన్నిరకాల లావాదేవీలు దాదాపు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొనుగోళ్లు, నగదు బదిలీలు తదితరాలన్నింటికీ మొబైల్ ప్రధాన ఆధారమైంది. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, భీమ్ వంటి అప్లికేషన్లు లేని మొబైల్ లేదంటే అతిశయోక్తి కాదు. వీటన్నింటికీ సైబర్ దాడుల ప్రమాదం పొంచి ఉంది. ఐటీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రక్షణ రంగం, పోలీస్ సర్వీస్ మొదలైన విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని దొంగిలించడానికి కొందరు సిద్ధంగా ఉంటారు. అందుకే ఆయా కంపెనీలు, విభాగాలు అలాంటి దాడుల నుంచి కాపాడుకోడానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతుంటాయి. ఇలాంటి రక్షణ కార్యక్రమాలకే ఎథికల్ హ్యాకింగ్ నిపుణులు కావాలి.

# అవుతారా.. మంచి దొంగలు?

**కెరియర్ గైడెన్స్ ఎథికల్ హ్యాకింగ్**




## ఎవరీ హ్యాకర్లు?



సాంకేతిక పరిజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని మంచి కోసం వినియోగించేవారు ఎథికల్ హ్యాకర్లు. హ్యాకర్లలో స్థూలంగా మూడు రకాల వారున్నారు. వైట్ హ్యాట్, గ్రే హ్యాట్, బ్లాక్ హ్యాట్ హ్యాకర్లు. వైట్ హ్యాట్ వాళ్లు సంస్థలపై సైబర్ దాడులు జరగకుండా కాపాడతారు. సైబర్ నిపుణులుగా సేవలందిస్తారు. వీరు ఉద్యోగం ద్వారా సంపాదిస్తారు. కొంత మొత్తం ఇస్తే సంస్థల నెట్‌వర్క్‌లో లోపాలను సరిచేసేవారు గ్రే హ్యాట్ హ్యాకర్లు. లేదంటే ఆన్‌లైన్‌లో వివరాలు బట్టబయలు చేస్తామని బెదిరిస్తారు. వీళ్లు ఉనికి చాటుకోవడానికి లోపాలను అన్వేషిస్తారు. సైబర్ దాడులు చేసి పెద్ద మొత్తంలో దోచుకోవడం లేదా డిమాండ్ చేసేవాళ్లు బ్లాక్ హ్యాట్ హ్యాకర్లు.

## ఎథికల్ హ్యాకింగ్ అంటే?

సంస్థల అనుమతితో వాటి వెబ్‌సైట్ల (నెట్‌వర్క్)లోకి ప్రవేశించి అందులోని లోపాలను గుర్తించడం, కుదిరితే వాటిని సరిచేయడం ఎథికల్ హ్యాకర్ల విధి. సైబర్ దాడులు జరగడానికి ఉన్న అన్ని అవకాశాలూ వీరు పరిశీలిస్తారు. ఆ వివరాలను సంస్థలకు అందిస్తారు. అందుకే సంస్థలే ముందుగా అందులోని లోపాలను గుర్తించమని ఎథికల్ హ్యాకర్లను కోరతాయి. వీరు తమకున్న సాంకేతిక నైపుణ్యంతో లోపాలను పట్టుకుంటారు. నెట్ వర్కింగ్, ఆపరేటింగ్ సిస్టమ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లపై పట్టున్నవారు ఇలా చేయగలరు. పెనెట్రేషన్ టెస్టింగ్, సెక్యూరిటీ ఎనాలిసిస్, రివర్స్ ఇంజినీరింగ్, మాల్వేర్ ఎనాలిసిస్, సెక్యూరిటీ ఆడిటింగ్, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్...తదితర విధానాలను ఉపయోగించి దాడి జరగడానికి అవకాశం లేకుండా చూస్తారు. ఇప్పుడు కొన్ని సంస్థలు కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొస్తున్నప్పుడు లోపాలు గుర్తించమని



వినియోగదారులను కోరుతున్నాయి. ఇలా గుర్తించినవారికి పెద్ద మొత్తంలో పారితోషికం అందిస్తున్నాయి. వాళ్లు విడుదల చేసే తర్వాతి వెర్షన్‌లో ఆ లోపం లేకుండా చేసుకుంటున్నాయి. హ్యాకింగ్ పరిజ్ఞానం ఉన్నవారు ఈ సవాల్ స్వీకరించి డబ్బు, ఉద్యోగం, పేరు సంపాదించుకోవచ్చు. ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ కోర్సులు చదివినవారికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డైరెక్టర్, ఫోరెన్సిక్ అనలిస్ట్, కన్సల్టెంట్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ మేనేజర్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఎనలిస్ట్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ కన్సల్టెంట్, ఎథికల్ హ్యాకర్ మొదలైన హోదాలతో ఉద్యోగాలు ఉంటాయి.

## ఎథికల్ హ్యాకర్ కావాలంటే...

కొన్ని సంస్థలు యూజీ, పీజీ స్థాయుల్లో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు అందిస్తున్నాయి. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గణితం కోర్సులు చదువుకున్నవారు ఎథికల్ హ్యాకర్‌గా రాణించడానికి అవకాశాలున్నాయి. వీటితోపాటు సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, సృజనాత్మకంగా ఆలోచించగలగడం, ఒత్తిడిని అధిగమించడం ముఖ్యం. సీ++, జావా, పైథాన్, పీహెచ్‌పీ...మొదలైనవాటిపై పరిజ్ఞానం ఉండాలి. యునిక్స్, విండోస్, లైనక్స్, ఐఓఎస్ తదితర ఆపరేటింగ్ సిస్టంలపై అవగాహన ఉండాలి. కొత్త సాంకేతిక అంశాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలి. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకునే, అనువర్తించుకునే నైపుణ్యం పెంచుకోవాలి. ప్రాక్టికల్ పరిజ్ఞానం తప్పనిసరి. ఇందుకోసం వర్చువల్ ల్యాబ్స్‌లో ఫేక్ వెబ్‌సైట్లపై సాధన చేయాలి. కొత్తగా వస్తోన్న సవాళ్లను ఎదుర్కోవడానికి సంసిద్ధులై ఉండాలి. వీటిద్వారానే తమ ప్రావీణ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.



హ్యాకింగ్ పరిజ్ఞానానికి సంబంధించి కొన్ని సర్టిఫికేషన్లూ అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తి చేసినవారికి నియామకాల్లో ప్రాధాన్యం లభిస్తుంది. ఈసీ కౌన్సిల్ సంస్థ అందించే సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ (సీఈహెచ్) మంచి గుర్తింపు పొందింది.

## కోర్సులందిస్తోన్న సంస్థలు

**యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్:** ఎమ్మెస్సీ సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

**గుజరాత్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ:** ఎంఎస్ డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ అష్యూరెన్స్

**మణిపాల్ యూనివర్సిటీ:** ఎథికల్ హ్యాకింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీలో సర్టిఫికెట్ కోర్సు




**కేజే సోమయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ రిసెర్చ్:** ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ పీజీ

**సీ డాక్, హైదరాబాద్:** నెట్‌వర్కింగ్ అండ్ సిస్టమ్ సెక్యూరిటీలో సర్టిఫికెట్ కోర్సు

**ఇగ్నో:** పీజీ డిప్లొమా ఇన్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పీజీ సర్టిఫికెట్ ఇన్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

**ఐఐఐటీ– హైదరాబాద్:** ఎంటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కోర్సు

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), అలహాబాద్:** ఎంటెక్ సైబర్ లా అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కోర్సు

**ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (ఐఐడీటీ), తిరుపతి:** సైబర్ సెక్యూరిటీలో పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం అందిస్తోంది. ఇది 11 నెలల రెసిడెన్షియల్ కోర్సు. ఈ సంస్థను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డిగ్రీ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ లేదా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులు 60 శాతం మార్కులతో పూర్తిచేసినవారెవరైనా ఈ కోర్సులో చేరవచ్చు. ఫీజు రూ.5.25 లక్షలు (ట్యూషన్, వసతి, భోజనం, ల్యాప్‌టాప్... అన్నీ కలిపి). పరీక్షలో చూపిన ప్రతిభతో ప్రవేశాలు లభిస్తాయి.

**యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ (యూపీఈఎస్), డెహ్రాడూన్:** సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్ స్పెషలైజేషన్‌తో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సు అందిస్తోంది.

**సైబర్ సెక్యూరిటీ స్టడీస్ అండ్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (సీఎస్ఎస్ఆర్ఎల్), పుణె:** డిప్లొమా, సర్టిఫికేషన్ కోర్సులు

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఐఐటీఎం), త్రివేండ్రం:** ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్‌గా అందిస్తోంది.

**ఇంటర్నేషనల్ కాలేజ్ ఫర్ సెక్యూరిటీ స్టడీస్, న్యూదిల్లీ:** సైబర్ సెక్యూరిటీలో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు

## ఈసీ కౌన్సిల్ అందించే సర్టిఫికేషన్లు

సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ (సీఈహెచ్), కంప్యూటర్ హ్యాకింగ్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేటర్ (సీహెచ్ఎఫ్ఐ), ఈసీ కౌన్సిల్ సర్టిఫైడ్ సెక్యూరిటీ ఎనలిస్ట్ (ఈసీఎస్ఏ), లైసెన్స్ పెనెట్రేషన్ టెస్టర్ (ఎల్‌పీటీ), ఆన్‌లైన్ మోసాలు గుర్తించడానికి కంప్యూటర్ హ్యాకింగ్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేటర్ (సీహెచ్ఎఫ్ఐ) సర్టిఫికేషన్ ఉంది. సర్టిఫైడ్ అప్లికేషన్ సెక్యూరిటీ ఇంజినీర్ (సీఏఎస్ఈ) జావా, .నెట్‌ల్లో అందిస్తోంది. ఈ సంస్థ సిస్కోతో కలిసి సర్టిఫైడ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఐఎస్ఓ) కోర్సులో సర్టిఫికేషన్ అందిస్తోంది.

▲ **ఇతర సంస్థలు అందించే మరికొన్ని సర్టిఫికేషన్లు:** ఎస్ఏఎన్ఎస్ జీఐఏసీ, సర్టిఫైడ్ వల్నరబిలిటీ అసెసర్(సీవీఏ), సర్టిఫైడ్ ప్రొఫెషనల్ ఎథికల్ హ్యాకర్ (సీపీఈహెచ్), సర్టిఫైడ్ పెనెట్రేషన్ టెస్టింగ్ ఇంజినీర్(సీపీటీఈ)

వివిధ కార్పొరేట్ సంస్థలు, విద్యాలయాలు హ్యాకథాన్లు నిర్వహిస్తున్నాయి. టెడ్ఎక్స్, యూట్యూబ్‌ల్లో సైతం హ్యాకింగ్ సంబంధిత సమాచారం లభిస్తుంది.

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**ఏపీ బేవరేజస్‌లో సేల్స్ పోస్టులు**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) కాంట్రాక్టు/ అవుట్‌సోర్స్ ప్రాతిపదికన సేల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు:** సేల్స్ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్
**ఖాళీలు:** జిల్లాలవారీ ఖాళీలు వెబ్‌సైట్‌లో.. **అర్హత:** ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, బీకాం, కంప్యూటర్ పరిజ్ఞానం. **వయసు:** 21-40 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** ఆగస్టు 25 https://apsbcl.aponline.gov.in/

### ప్రవేశాలు

**బయోఇన్ఫర్మేటిక్స్‌లో పీజీ డిప్లొమా**

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా విభాగం 2019-20 విద్యాసంవత్సరానికిగానూ పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
**కోర్సు:** పీజీ డిప్లొమా ఇన్ బయోఇన్ఫర్మేటిక్స్
**కాలవ్యవధి:** ఏడాది **అర్హత:** సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 30 www.oucde.net

### స్కాలర్‌షిప్స్

**బాలికలకు డీఆర్‌డీఓ ఉపకారవేతనాలు**

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)... 2019-20 విద్యాసంవత్సరానికిగానూ అర్హులైన బాలికలకు ఉపకారవేతనాలు అందిస్తోంది.
**ఉపకారవేతనాల సంఖ్య:** 30 (యూజీ-20, పీజీ-10) **ఆర్థిక తోడ్పాటు:** యూజీ విద్యార్థినులకు ఏడాదికి రూ.1,20,000; పీజీకి రూ.1,86,000. **అర్హత:** 2019లో సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ ఇంజినీరింగ్, ఎంఈ/ ఎంటెక్/ ఎంఎస్సీ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందినవారు. **ఎంపిక:** జేఈఈ (మెయిన్)/ గేట్ స్కోరు ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 10 **వెబ్‌సైట్:** https://rac.gov.in/

### ఫెలోషిప్స్

**ఐఐటీబీ - మోనాష్ రిసెర్చ్ అకాడమీ**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే (ఐఐటీబీ)... మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)లోని మోనాష్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో పీహెచ్‌డీ కోర్సులను నిర్వహిస్తోంది. డిసెంబరు 2019 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. **కోర్సు:** పీహెచ్‌డీ **కాలవ్యవధి:** మూడున్నరేళ్లు. **అర్హత:** సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, గేట్/ జీఆర్ఈ/ సీఎస్ఐఆర్-నెట్, జామ్ ఉత్తీర్ణత. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** సెప్టెంబరు 11 **వెబ్‌సైట్:** www.iitbmonash.org

### వాక్-ఇన్స్

**డీఆర్‌డీఓ - డీఎఫ్ఆర్ఎల్**

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) పరిశోధనా విభాగమైన డిఫెన్స్ ఫుడ్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (డీఎఫ్ఆర్ఎల్) కాంట్రాక్టు పోస్టుల భర్తీకి వాక్ఇన్ నిర్వహిస్తోంది.
**పోస్టులు-ఖాళీలు:** రిసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)-01, జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-04. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ, నెట్/ గేట్, అనుభవం. **వాక్ఇన్ తేది:** సెప్టెంబరు 18 **వేదిక:** డీఎఫ్ఆర్ఎల్, మైసూరు-570011. www.drdo.gov.in

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో

# బడి బాటలో సాహస శిక్షణ!

**విద్యార్థి దశ నుంచే దేశం పట్ల అంకితభావాన్ని పెంపొందింపజేసే చక్కటి వేదికలు సైనిక్ స్కూళ్లు. రక్షణ రంగంలోకి ప్రవేశించడానికి కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వీటిని నెలకొల్పింది. ఏటా ఎందరో త్రివిధ దళాల్లో చేరడానికి ఇవి దోహదపడుతున్నాయి. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. ఇప్పటివరకు దాదాపు 10,000 మంది సైనిక్ స్కూల్ విద్యార్థులు త్రివిధ దళాల్లో పనిచేస్తున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీల్లో శిక్షణ పొందుతున్న 25 శాతం మంది ఇక్కడి నుంచి వెళ్లినవారే. ప్రస్తుతం ఈ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది**

**సైనిక్ స్కూళ్లలో 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రకటన**




దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం 31 సైనిక్ స్కూళ్లను కేంద్రప్రభుత్వం నిర్వహిస్తోంది. 2020-21 విద్యాసంవత్సరానికి ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు సైనిక్ స్కూల్స్ సొసైటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిల్లో ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు తరగతులుంటాయి. ఇంగ్లిష్ మాధ్యమం, సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన ఉంటుంది. అన్ని రకాల ఆటలు, షూటింగ్, ఫైరింగ్, హార్స్ రైడింగ్, సాహస క్రీడల్లో శిక్షణ ఇస్తారు. హాస్టల్ వసతి జూనియర్, సీనియర్ విద్యార్థులకు వేర్వేరు. ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరంలోని కోరుకొండ, చిత్తూరులోని కలికిరిలో సైనిక్ స్కూళ్లున్నాయి. వీటిలో ప్రవేశాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చు. బాలురకు మాత్రమే వీటిలో ప్రవేశాలుంటాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి 31 మార్చి 2020 నాటికి విద్యార్థి వయసు 12 ఏళ్లు మించకూడదు. తొమ్మిదో తరగతికి 15 సంవత్సరాలు దాటకూడదు. కింది తరగతులను ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదవడం తప్పనిసరి.

**ముఖ్యమైన తేదీలు**

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్ 23

**ప్రవేశపరీక్ష తేది:** జనవరి 05

**వెబ్‌సైట్:** http://kalikiri-sainikschool.com/

http://www.sainikschoolkorukonda.org/

## ఎంపిక విధానం

ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. మొదటిదశలో ఆలిండియా సైనిక్ స్కూల్స్ ప్రవేశపరీక్ష ఉంటుంది. వీటిలో ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలుంటాయి. ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మొదటి పేపర్ 250 మార్కులకు రెండున్నర గంటల వ్యవధితో ఉంటుంది. ఇందులో మ్యాథమేటిక్స్, జనరల్ నాలెడ్జ్, లాంగ్వేజ్ ప్రశ్నలు వస్తాయి. రెండో పేపర్ 50 మార్కులకు అరగంట సమయంతో ఉంటుంది. దీనిలో ఇంటెలిజెన్స్ టెస్ట్ ఉంటుంది. తొమ్మిదో తరగతి పరీక్షకు మొదటి పేపర్ 350 మార్కులకు రెండున్నర గంటల సమయంతో ఉంటుంది. దీనిలో మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్‌ల నుంచి ప్రశ్నలుంటాయి. రెండో పేపర్ 50 మార్కులకు అరగంట వ్యవధితో ఉంటుంది. ఇందులో ఇంటెలిజెన్స్ ప్రశ్నలుంటాయి. దీనిలో అర్హత సాధించినవారికి శరీర దార్ఢ్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు.

## ఎన్ని సీట్లు?

కోరుకొండ స్కూల్లో ఆరోతరగతిలో 60 సీట్లు, తొమ్మిదిలో 20 ఉన్నాయి. కలికిరిలో ఆరోతరగతిలో 70 సీట్లున్నాయి. పరీక్షలో ఉత్తీర్ణత, చేరికల ఆధారంగా సీట్ల సంఖ్య పెరగొచ్చు, తగ్గొచ్చు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలినవాటిలో 67 శాతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జనరల్ కేటగిరి విద్యార్థులకు కేటాయిస్తారు. అందులో 33 శాతం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారికి ఆయా రాష్ట్రాల పురుష జనాభా ఆధారంగా కేటాయిస్తారు. మరో 25 శాతం త్రివిధ దళాలకు చెందిన విధుల్లో ఉన్న లేదా పదవీ విరమణ పొందిన సైనికుల పిల్లలకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లను మెరిట్ ఆధారంగా సొంత రాష్ట్రం వారికి ఇస్తారు. ఒకవేళ ఎస్సీ, ఎస్టీ కేటగిరిల్లో సీట్లు మిగిలితే వాటిని జనరల్ కేటగిరి ద్వారా భర్తీ చేస్తారు. వీరు మొదటిదశలో అర్హత సాధించాలి.

## ఉపకారవేతనాలు

అర్హులైన స్థానిక విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తుంది. రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఉపకారవేతనాన్ని అందిస్తుంది. బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల నెలసరి ఆదాయం రూ.15000 లోపు ఉన్నవారికి స్కాలర్‌షిప్ ఇస్తారు. వార్షిక ఆదాయం రూ.65,000 - 2,00,000 లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు స్కాలర్‌షిప్ సదుపాయం ఉంటుంది. వార్షిక పరీక్షల్లో 70శాతం మార్కులు వచ్చిన బీసీలకు, 60శాతం వచ్చిన ఎస్సీ, ఎస్టీలకు మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తారు. అర్హత ఆధారంగా ఏటా రూ.34,000 వరకు వస్తుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.32,000, కేంద్ర ప్రభుత్వం రూ.2000 ఇస్తుంది. ప్రతి విద్యార్థికి దుస్తులకు రూ.1000, ఆహారానికి రూ.5900 అందిస్తారు.

# విరాట్ నిన్నొదల..



- భారత కెప్టెన్‌కు చేరువగా స్మిత్
- కేన్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి
- ఐసీసీ టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్

**దుబాయ్:** బాల్ టాంపరింగ్ ఉదంతం కారణంగా నిషేధానికి గురి కాక ముందు ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో స్టీవ్ స్మిత్ దీర్ఘ కాలం నంబర్‌వన్ బ్యాట్స్‌మన్‌గా ఉన్నాడు. కానీ అతను ఆటకు దూరంగా ఉన్న ఏడాది కాలంలో విరాట్ కోహ్లి భారీగా పరుగులు చేసి నం.1 అయిపోయాడు. ఐతే ఇటీవలే పునరాగమనం చేసిన స్మిత్.. మళ్లీ అగ్రస్థానం మీద కన్నేసినట్లున్నాడు. ర్యాంకింగ్స్‌లో అతను వడివడిగా ముందుకెళ్తున్నాడు. తాజాగా ర్యాంకింగ్స్‌లో కోహ్లి అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ... సూపర్‌ఫామ్‌లో స్మిత్ అతణ్ని సమీపించాడు. ఇద్దరి మధ్య తేడా తొమ్మిది పాయింట్లే. సోమవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో స్మిత్.. న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానం సాధించాడు. కోహ్లి 922 పాయింట్లతో జాబితాలో ముందుండగా యాషెస్ తొలి టెస్టులో రెండు శతకాలు, రెండో టెస్టులో 92 చేసిన స్మిత్.. 913 పాయింట్లతో అతడి వెనక ఉన్నాడు. కేన్ విలియమ్సన్ (887) మూడో స్థానంలో నిలిచాడు. పుజారా (4వ) టాప్-10లో కొనసాగుతున్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ప్యాట్ కమిన్స్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత స్పిన్నర్ రవీంద్ర జడేజా ఓ స్థానం మెరుగుపర్చుకుని ఐదో ర్యాంకు సాధించాడు. అశ్విన్ (10వ) ర్యాంకులో మార్పు లేదు. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా మూడో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 113 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# ఛాంపియన్

ప్రతిష్టాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులకు చక్కటి ఆరంభం లభించింది. తొలి రోజు బరిలో నిలిచిన ముగ్గురు క్రీడాకారులూ చక్కటి విజయాలతో రెండో రౌండు చేరారు. పురుషుల సింగిల్స్‌లో పతకాశలు రేపుతున్న కిదాంబి శ్రీకాంత్.. తడబడుతూ మ్యాచ్‌ను ఆరంభించినప్పటికీ.. తర్వాత పుంజుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సాయిప్రణీత్, హెచ్.ఎస్.ప్రణయ్ సైతం శుభారంభం చేశారు. మహిళల డబుల్స్‌లోనూ భారత్‌కు మంచి ఆరంభమే లభించింది.



శ్రీకాంత్

# ఆరంభం అదిరింది

- శ్రీకాంత్, ప్రణీత్, ప్రణయ్‌ల విజయం
- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

బాసెల్ (స్విట్జర్లాండ్)

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత క్రీడాకారులకు ఎదురు లేదు. పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగిన ముగ్గురూ తొలి రౌండు దాటారు. ఇటీవలే గాయం నుంచి కోలుకుని, పూర్వపు ఫామ్ అందుకోవాలని తహతహలాడుతున్న కిదాంబి శ్రీకాంత్‌కు తొలి రౌండ్లో ప్రత్యర్థి నుయెన్ (ఐర్లాండ్) నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఏడో సీడ్ శ్రీకాంత్ 17-21, 21-16, 21-6తో విజయం సాధించాడు. అలవోకగా మ్యాచ్ గెలిచేస్తాడనుకున్న శ్రీకాంత్‌కు అన్‌సీడెడ్ నుయెన్ షాకిచ్చేలా కనిపించాడు. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో చాలా వరకు శ్రీకాంతే ఆధిక్యంలో ఉన్నాడు. అయితే 17-17 దగ్గర స్కోరు సమమైన దశలో వరుసగా నాలుగు పాయింట్లతో గేమ్‌ను గెలిచి ఆశ్చర్యపరిచాడు. ఈ ఊపులో అతను రెండో గేమ్‌లో మరింత మెరుగ్గా ఆడాడు. పాయింట్ పాయింట్‌కూ శ్రీకాంత్ శ్రమించేలా


సాయిప్రణీత్

చేశాడు. 8-8, 13-13తో స్కోరు సమమవుతూ, తక్కువ అంతరంతో సాగింది. అయితే 17-16తో ఆధిక్యంలోకి వెళ్లిన శ్రీకాంత్.. వరుసగా నాలుగు పాయింట్లతో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. అప్పుడే శ్రీకాంత్‌లోని అసలు ఆటగాడు నిద్ర లేచాడు. తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించిన హైదరాబాదీ.. ప్రత్యర్థికి అవకాశమే ఇవ్వకుండా అలవోకగా గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో రౌండ్లో ఇజ్రాయెల్ ఆటగాడు మిషా జిల్బర్‌మ్యాన్‌ను శ్రీకాంత్ ఢీకొంటాడు. పోటాపోటీగానే సాగిన మరో మ్యాచ్‌లో సాయిప్రణీత్ 21-17, 21-16తో జేసన్ ఆంథోనీ (కెనడా)ను ఓడించాడు. తొలి గేమ్‌లో 8-7తో ఆధిక్యంలో ఉన్న ప్రణీత్ వరుసగా 9 పాయింట్లు సాధించడం విశేషం. కానీ ప్రత్యర్థి కూడా అతడికి దీటుగా స్పందించాడు. వరుసగా 8 పాయింట్లు గెలిచాడు. కానీ గేమ్ చివర్లో సాయిప్రణీత్‌దే పైచేయి అయింది. రెండో గేమ్ కూడా దాదాపుగా ఇలాగే సాగింది. ఇంకో మ్యాచ్‌లో ప్రణయ్ 17-21, 21-10, 21-11తో ఈటు హీనో (ఫిన్లాండ్)పై విజయం సాధించారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో జక్కంపూడి మేఘన- పూర్విష రామ్ 21-10, 21-18తో డయానా సోటో- అలెగ్జాండ్ర సోటోమేయర్ (గాటెమాల)పై నెగ్గి ముందంజ వేశారు.

# రాహుల్ కొత్త ప్రేమకథ



**ముంబయి:** ఆటతోనే కాదు.. ఆటేతర విషయాలతోనూ తరచుగా వార్తల్లో నిలుస్తుంటాడు టీమ్‌ఇండియా యువ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్. హార్దిక్ పాండ్యతో కలిసి అతను పాల్గొన్న ఓ టీవీ షోకు సంబంధించిన వివాదం ఎంతగా కుదిపేసిందో తెలిసిందే. మరోవైపు రాహుల్‌కు బాలీవుడ్ భామలతో ముడిపెడుతూ తరచుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. నిధి అగర్వాల్, అతియా శెట్టి, సోనమ్ బజ్వా.. లాంటి కథానాయికలతో అతడి ప్రేమాయణం గురించి వేర్వేరు సందర్భాల్లో గుసగుసలు వినిపించాయి. ఇప్పుడు ఆకాంక్ష సింగ్ అనే కొత్తమ్మాయితో అతను పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లుగా గట్టిగా ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ నటి ఆలియా బట్ స్నేహితురాలైన ఆకాంక్షతో రాహుల్ కలిసి ఉన్న ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. ఇటీవలే ఆకాంక్ష.. రాహుల్‌ను ఆలియాకు పరిచయం చేయడం కూడా చర్చనీయాంశమైంది. ఈ విషయమై రాహుల్‌ను ప్రశ్నిస్తే.. సూటిగా సమాధానం చెప్పలేదు. "నేను పత్రికలు చదవను. కాబట్టి నా గురించి ఏం రాశారో తెలియదు. వ్యక్తిగత జీవితాన్ని వ్యక్తిగతంగానే ఉంచాలనుకుంటా. దాని గురించి ఏమీ మాట్లాడను. నా దృష్టంతా క్రికెట్ మీదే" అన్నాడు. మీరిప్పుడు ఒంటరా కాదా అని రాహుల్‌ను అడిగితే.. "ఏమో తెలియదు. ఆ సంగతే తేల్చాలి. తెలిశాక చెబుతా" అని సమాధానం ఇవ్వడం విశేషం.

# బ్యాటింగ్ కోచ్ రేసులో రాజ్‌పుత్



**ముంబయి:** టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ అవకాశం దక్కని లాల్‌చంద్ రాజ్‌పుత్ ఇప్పుడు బ్యాటింగ్ శిక్షకుడి రేసులో నిలిచాడు. ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ టీమ్‌ఇండియా సహాయక సిబ్బంది ఎంపిక కసరత్తును సోమవారం ప్రారంభించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లతో పాటు అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌ను ప్రసాద్ కమిటీ ఎంపిక చేయనుంది. ప్రస్తుత బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆ పదవి కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. రాజ్‌పుత్, విక్రమ్ రాథోడ్, ప్రవీణ్ ఆమ్రే, అమోల్ మజుందార్, సితాంషు కొటక్, హృషికేశ్ కనిత్కర్, మిథున్ మన్హాస్ బ్యాటింగ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్, ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్‌లు తిరిగి ఎంపికవడం లాంఛనమే! ఐతే బౌలింగ్ కోచ్ పదవి కోసం వెంకటేశ్ ప్రసాద్, పారస్ మాంబ్రే, అమిత్ భండారీలు కూడా దరఖాస్తు చేశారు. నిబంధనల ప్రకారం బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్ పదవులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10 టెస్టులు లేదా 25 వన్డేలు ఆడాలి. 60 ఏళ్లలోపు వయసుండాలి. ఎంపిక ప్రక్రియ గురువారం ముగుస్తుంది.

# ఇబ్బందులున్నాయి

- శ్వేతపత్రం సిద్ధం చేస్తున్నాం
- విరుద్ధ ప్రయోజనాల నిబంధన అమలుపై ఎడుల్జీ


ఎడుల్జీ

**ముంబయి:** విరుద్ధ ప్రయోజనాల నిబంధనను అమలు చేయడంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని బీసీసీఐ పరిపాలకుల కమిటీ (సీఓఏ) సభ్యురాలు డయానా ఎడుల్జీ చెప్పింది. ఈ ఇబ్బందులను వివరిస్తూ శ్వేతపత్రం తయారు చేస్తామని తెలిపింది. ఈ వివాదాస్పద విరుద్ధ ప్రయోజనాల అంశంపై చర్చించేందుకు సోమవారం ఇక్కడ జరిగిన అనధికార సమావేశంలో వెంగ్‌సర్కార్, సౌరభ్ గంగూలీ (స్కైప్ ద్వారా) సహా పలువురు మాజీ, ప్రస్తుత క్రికెటర్లు, ఎడుల్జీ, మరో సీఓఏ సభ్యుడు రవి తొగ్డె పాల్గొన్నారు. దిగ్గజ ఆటగాళ్లు సచిన్ తెందుల్కర్, సౌరభ్ గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్‌లు విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. బీసీసీఐ అంబుడ్స్‌మన్ డీకే జైన్ నుంచి వీళ్లు నోటీసులు అందుకున్నారు కూడా. ఈ నేపథ్యంలోనే సమావేశం జరిగింది. "విరుద్ధ ప్రయోజనాల అంశానికి సంబంధించి సమగ్రంగా చర్చించాం. క్రికెటర్లు ఎదుర్కొంటున్న సమస్యలేంటి, నిబంధనను అమలు చేయడంలో మేం ఎదుర్కొంటున్న సమస్యలేంటి అన్నదానిపై మాట్లాడుకున్నాం" అని సమావేశం అనంతరం ఎడుల్జీ విలేకర్లతో చెప్పింది. "ఈ నిబంధనతో మన క్రికెటర్లు నిజంగానే ఇబ్బందిపడుతున్నారు. కొన్ని అంశాలతో మేం ఏకీభవించకపోవచ్చు. కొన్నింటిని మాత్రం అంగీకరించాల్సిందే. ఆటగాళ్ల సమస్యలను పరిష్కరించాలన్నదే మా ఉద్దేశం" అని తొగ్డె అన్నాడు. సంజయ్ మంజ్రేకర్, ఇర్ఫాన్ పఠాన్, పార్థివ్ పటేల్, అజిత్ అగార్కర్, రోహన్ గావస్కర్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. బీసీసీఐ కొత్త రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తికి ఒకే పదవి ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ పదవులు ఉంటే విరుద్ధ ప్రయోజనాలు ఉన్నట్లు పరిగణిస్తున్నారు. 'స్కైప్ ద్వారా సమావేశంలో పాలుపంచుకున్న గంగూలీ.. కొన్ని సూచనలు చేశాడు. విరుద్ధ ప్రయోజనాల అంశంపై మేం శ్వేతపత్రాన్ని సిద్ధం చేసి సుప్రీం కోర్టుకు సమర్పిస్తాం" అని ఎడుల్జీ చెప్పింది. మార్పులకు కోర్టు అనుమతించే వరకు ప్రస్తుత నిబంధనను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

# అక్తర్‌కు యువీ బౌన్సర్!





**లండన్:** యాషెస్ సిరీస్ రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఫాస్ట్‌బౌలర్ జోఫ్రా ఆర్చర్ విసిరిన బౌన్సర్లు ఎంతటి ప్రకంపనలు రేపాయో తెలిసిందే. అతడి ధాటికి స్టీవ్ స్మిత్ మెడకు గాయమై కొన్ని రోజులు మైదానానికే దూరమయ్యాడు. ఇంకో ఇద్దరు ముగ్గురు బ్యాట్స్‌మెన్‌ను కూడా ఆర్చర్ బౌన్సర్లు గాయపరిచాయి. అయితే తన బౌలింగ్‌లో బ్యాట్స్‌మన్ గాయపడితే.. కనీసం పరామర్శకు కూడా వెళ్లలేదంటూ ఆర్చర్ మీద విమర్శలు గుప్పించాడు పాకిస్థాన్ మాజీ ఫాస్ట్‌బౌలర్ షోయబ్ అక్తర్. "బౌన్సర్లు ఆటలో భాగం. కానీ తన బంతికి బ్యాట్స్‌మన్ గాయపడితే వెళ్లి ఏమైందని చూడటం, పరామర్శించడం బౌలర్ ధర్మం. కానీ స్మిత్ బాధతో అల్లాడుతుంటే ఆర్చర్ తన పాటికి తాను నడుచుకుంటూ వెళ్లాడు. నేను ఆడే రోజుల్లో బ్యాట్స్‌మన్ దగ్గరికి వెంటనే వెళ్లేవాడిని" అని అక్తర్ ట్వీట్ చేశాడు. దీనిపై టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తనదైన శైలిలో స్పందించాడు. "అవును. నువ్వు వచ్చేవాడివి. బాగానే ఉన్నావ్ కదా.. ఇంకా కొన్ని బౌన్సర్లు సంధించబోతున్నా అని చెప్పడానికి" అంటూ అక్తర్‌కు పంచ్ ఇచ్చాడు యువీ.

# వెస్టిండీస్-ఎ లక్ష్యం 305

## భారత్‌తో మూడు రోజుల సన్నాహక మ్యాచ్


విహారి (64)

**కూలిడ్జ్:** వెస్టిండీస్-ఎతో మూడు రోజుల సన్నాహక మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన భారత్.. ప్రత్యర్థి ముందు 305 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగుల ఆధిక్యం సంపాదించిన భారత్.. చివరి రోజు, సోమవారం 188/5 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సత్తా చాటిన రెండో ఇన్నింగ్స్‌లో ఇంకా మెరుగ్గా ఆడాడు. విహారి (64; 125 బంతుల్లో 9×4, 1×6)నే ఇన్నింగ్స్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రహానె (54) కూడా ఫామ్ అందుకున్నాడు. వీళ్లిద్దరూ రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. కడపటి వార్తలందేసరికి వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. సొలోజానో (16), హాడ్జ్ (5), కింగ్ (14) ఔటయ్యారు. జేసన్ మహ్మద్ (2 బ్యాటింగ్), కార్టర్ (0) క్రీజులో ఉన్నారు. బుమ్రా, అశ్విన్, జడేజా తలో వికెట్ పడగొట్టారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 297/5 వద్ద డిక్లేర్ చేయగా.. విండీస్ 181 పరుగులకే ఆలౌటైంది.

# టెస్టులకు నెట్ బౌలర్‌గా సైని




**దిల్లీ:** టీ20 సిరీస్‌లో సత్తా చాటిన యువ పేసర్ నవ్‌దీప్ సైనిని మరింత సానబట్టే ప్రయత్నంలో భాగంగా అతణ్ని టెస్టుల్లో నెట్ బౌలర్‌గా వినియోగించుకోవాలని భారత జట్టు యాజమాన్యం నిర్ణయించింది. వెస్టిండీస్‌తో రెండు టెస్టు సిరీస్‌లో పాల్గొనే భారత జట్టుకు సైని ప్రత్యామ్నాయ బౌలర్‌గానే కాక, నెట్ బౌలర్‌గా అందుబాటులో ఉండనున్నాడు. "సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ సైని కొంతకాలంగా స్థిరంగా రాణిస్తున్నాడు. అతని బౌలింగ్‌లో పేస్ ఉంది.. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలడు. అందుకే టెస్టు సిరీస్ కోసం జట్టుతో పాటే ఉండాలని సూచించాం' ' అని బీసీసీఐ అధికారొకరు తెలిపాడు.

# కలలో కూడా అనుకోలేదు




**కూలిడ్జ్ (ఆంటిగ్వా):** ఇంత సుదీర్ఘ కాలం అంతర్జాతీయ క్రికెటర్‌గా కొనసాగుతానని కలలో కూడా అనుకోలేదని భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. అంతర్జాతీయ క్రికెటర్‌గా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో విరాట్ ఉద్వేగ పూరిత ట్వీట్ చేశాడు. 'టీనేజర్‌గా 2008లో ఇదే రోజు కెరీర్ ప్రారంభించిన నేను.. ఈ 11 ఏళ్లలో ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. దేవుడి ఆశీస్సులతోనే ఇది సాధ్యమైంది. మీ కలను నెరవేర్చుకునే శక్తి సామర్థ్యాలు సొంతం కావాలంటే సరైన మార్గంలో నడవాలి" అని విరాట్ ట్వీట్ చేశాడు. ఈ పోస్టులో శ్రీలంకపై తన అరంగేట్ర మ్యాచ్ నాటి ఫొటోతో పాటు తాజా చిత్రం కూడా ఒకటి జోడించాడు విరాట్.

## శ్రేయస్ నం.4లో: శాస్త్రి

**ఆంటిగ్వా:** యువ బ్యాట్స్‌మెన్ శ్రేయస్ అయ్యర్ భవిష్యత్ వన్డేల్లో బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానంలో వస్తాడని భారత క్రికెట్ జట్టు కోచ్ రవిశాస్త్రి అన్నాడు. "రాబోయే వన్డేల్లో శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో రావొచ్చు. భవిష్యత్‌లో మరి కొందరు కుర్రాళ్లను పరీక్షించాల్సి ఉంది" అని శాస్త్రి అన్నాడు. విండీస్‌తో సిరీస్‌లో ఐదో స్థానంలో ఆడిన శ్రేయస్ వరుసగా 71, 65 పరుగులతో సత్తా చాటాడు. నం.4లో ఆడిన పంత్ విఫలమైన నేపథ్యంలో శ్రేయస్‌కే ఆ స్థానం దక్కేలా ఉంది.

# ముంబాపై స్టీలర్స్ గెలుపు

**చెన్నై:** అభిషేక్ సింగ్ (6) రైడింగ్‌లో, ఫాజెల్ (4) ట్యాక్లింగ్‌లో సత్తా చాటడంతో ప్రో కబడ్డీ లీగ్‌లో సోమవారం జరిగిన పోరులో హరియాణా స్టీలర్స్ 30-27తో యు ముంబాను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి స్టీలర్స్ ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి స్టీలర్స్ 16-8తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ద్వితీయార్ధంలో క్యాచింగ్‌లో మెరుగైన ముంబా.. వరుస పాయింట్లు సాధించి 17-22తో ప్రత్యర్థిని సమీపించింది. అభిషేక్‌సింగ్ రాణించడంతో ముంబా 24-26తో మరింత చేరువగా వచ్చింది. కానీ ఆఖర్లో వికాస్ ఖండోలా వరుసగా రెండు రైడ్ పాయింట్లు తేవడంతో ఆధిక్యాన్ని కాపాడుకున్న స్టీలర్స్.. 30-27తో విజయాన్ని సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో యూపీ యోధ 31-24తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది. యోధ జట్టులో సురేందర్ గిల్ (7), సుమిత్ (4) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.



యూపీ-జైపూర్ మ్యాచ్‌లో..




| సెన్సెక్స్ ▲ 52 | నిఫ్టీ ▲ 06 |
|---|---|
| 37402 | 11054 |

| డోజోన్స్ ▲ 277 | నాస్‌డాక్ ▲ 120 |
|---|---|
| 26163 | 8016 |

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

| రూపాయి ▼ | ముడిచమురు ▲ |
|---|---|
| 71.43 29 పైసలు | 59.58 |
| (ఒక అమెరికా డాలరుకు) | (బ్రెంట్ ధర డాలర్లలో) |

## ఘనం (+) / గ్రహణం (-)

| నిఫ్టీ | 19న | మార్పు% | నిఫ్టీ | 19న | మార్పు% |
|---|---|---|---|---|---|
| SUN PHARMA | 426.00 | 2.72 | YES BANK | 76.65 | -3.52 |
| BHARTI INFRATEL | 255.30 | 2.45 | GRASIM | 732.35 | -2.65 |
| TECH MAHINDRA | 670.35 | 1.72 | INDIABULLS HSG | 536.85 | -2.52 |
| AXIS BANK | 685.00 | 1.38 | POWER GRID CORP. | 207.05 | -1.94 |
| L & T | 1352.20 | 1.27 | GAIL (INDIA) | 127.30 | -1.81 |
| TITAN COMPANY | 1088.95 | 1.22 | EICHER MOTORS | 16337.70 | -1.58 |
| WIPRO | 252.10 | 1.16 | COAL INDIA | 198.95 | -1.49 |

## విదేశీ మారకపు రేట్లు



(థామస్ కుక్) (రూ.లలో)

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం | | | |
|---|---|---|---|---|---|
| అమెరికా డాలరు | 64.69 | 75.01 | బహ్రెయిన్ దీనార్ | 174.85 | 200.32 |
| పౌండ్ స్టెర్లింగ్ | 78.60 | 91.15 | కువైట్ దీనార్ | 193.16 | 240.53 |
| యూరో | 71.75 | 83.20 | ఒమన్ రియాల్ | 171.32 | 196.26 |
| జపనీస్ యెన్/100 | 60.82 | 70.52 | సౌదీ రియాల్ | 17.16 | 20.39 |
| ఆస్ట్రేలియా డాలరు | 43.84 | 50.72 | యూఏఈ దిర్హమ్ | 17.56 | 20.59 |
| సింగపూర్ డాలరు | 46.69 | 55.31 | మలేషియా రింగిట్ | 15.19 | 18.68 |
| థాయ్ బాత్/100 | 209.48 | 250.54 | చైనీస్ యువాన్ | 7.15 | 11.59 |

## 19న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 341 | వరంగల్ | 344 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.00 | విశాఖపట్నం | 361 |
| బెంగళూరు | 350 | చెన్నై | 365 |
| 20వ తేదీకి... | | చిత్తూరు | 358 |
| విజయవాడ | 348 | | |
| గోదావరి | 343 | నమక్కల్ | 365 |

### గృహరుణ, ఎన్‌బీఎఫ్‌సీ విభాగాలు కలిగిన కంపెనీల విషయంలో

# బైబ్యాక్ నిబంధనల సడలింపు!

దిల్లీ: గృహరుణ, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లను అనుబంధ సంస్థలుగా కలిగి ఉన్న నమోదిత కంపెనీలు ప్రస్తుతం షేర్ల బైబ్యాక్ చేసేందుకు ఉన్న నిబంధనలు సడలించాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ భావిస్తోంది. ఈ వారంలో జరిగే సెబీ బోర్డు సమావేశంలో దీనిపై చర్చించి, నిర్ణయం తీసుకుంటారని ఉన్నతాధికారులు తెలిపారు. షేర్ల బైబ్యాక్ ప్రక్రియ సెబీ బైబ్యాక్ నిబంధనలతో పాటు కంపెనీల చట్టం నిబంధనలకు అనుగుణంగా జరగాల్సి ఉంది.



**ప్రస్తుత నిబంధనల ప్రకారం..**

- చెల్లించిన మూలధనం, కంపెనీ వద్ద ఉన్న మిగులు నిల్వల్లో 25 శాతానికి మించి బైబ్యాక్ ఉండకూడదు. అయితే వాటాదార్ల ప్రత్యేక తీర్మాన ఆమోదం ద్వారా మరో 10% వరకు అదనంగా కొనుగోలు చేయొచ్చు.
- కంపెనీ సురక్షిత, అరక్షిత రుణాల వాటా, బైబ్యాక్ తరవాత చెల్లించిన మూలధనం, మిగులు నిల్వల కంటే రెట్టింపు కాకూడదు. కంపెనీల చట్టంలోని అధిక రుణం, వాటా శాతాలపై ప్రత్యేకంగా నిబంధన ఉంటే మినహా ఇలా చేయకూడదు.
- బైబ్యాక్ పరిమితులు నిర్ధారించడానికి కంపెనీల ఏకీకృత, స్టాండలోన్ ఖాతాలను సెబీ పరిగణనలోకి తీసుకుంటుంది. ఏకీకృత ఖాతాలను పరిశీలిస్తున్నప్పుడు ఎన్‌బీఎఫ్‌సీ, గృహరుణ సంస్థలను అనుబంధ సంస్థలుగా కలిగి ఉన్న కంపెనీలకు అధిక రుణాలు ఇబ్బంది పెడుతున్నాయి. దీనికి పరిష్కారంగా, కార్పొరేట్ వ్యవహారాల శాఖ జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం నిబంధనలు సడలించాలని సెబీ భావిస్తోంది. దీనిప్రకారం ఇలాంటి అనుబంధ సంస్థలను కలిగి ఉన్న ప్రభుత్వ కంపెనీలు, షేర్ల తిరిగి కొనుగోలు తరవాత రుణ, వాటా నిష్పత్తి 6:1 శాతం ఉండేందుకు అనుమతిస్తున్నారు. దీనిపై మే నుంచి సంప్రదింపులను సెబీ నిర్వహిస్తోంది. దీనిలో వచ్చిన సూచనల ప్రకారం..
- స్టాండలోన్, ఏకీకృత ఖాతాల ప్రకారం.. బైబ్యాక్ తరవాత సాధారణ కంపెనీలకు రుణ, వాటా నిష్పత్తి 2:1 శాతం ఉండేలా కొనసాగాలని భావిస్తోంది. కంపెనీల చట్టంలో అధిక నిష్పత్తిని ప్రతిపాదించే కంపెనీలకు మాత్రం మినహాయింపు ఇస్తారు.
- ఒకవేళ స్టాండలోన్ ఖాతాల ప్రకారం రుణ, వాటాల నిష్పత్తి 2:1 శాతాన్ని మించకుండా, ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ శాతం అధికమైనా కూడా, బైబ్యాక్‌లను అనుమతిస్తారు. అయితే ఎన్‌బీఎఫ్‌సీ, గృహరుణ కంపెనీల గణాంకాలను మినహాయించినప్పుడు రుణ, వాటాల నిష్పత్తి 2:1 శాతం వరకు మాత్రమే ఉండాలి. ఈ ఎన్‌బీఎఫ్‌సీ, గృహరుణ కంపెనీలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నియంత్రణ పరిధిలో ఉండాలి.
- కానీ స్టాండలోన్ ఖాతాల ప్రకారం రుణ, వాటాల నిష్పత్తి, అనుబంధ సంస్థలను మినహాయించినా 5:1 కు మించకూడదు.
- ఏకీకృత ఖాతాలను పరిగణనలోకి తీసుకునేప్పుడు, రుణ, వాటాల నిష్పత్తిని లెక్కించేప్పుడు ఏఏఏ రేటింగ్ కలిగిన నియంత్రణా అనుబంధ సంస్థలను మినహాయించాలని సెబీ ప్రాథమిక మార్కెట్ సలహా సంఘం సూచించింది. అయితే ఆచరణలోకి వచ్చేసరికి రేటింగ్ తరచు మారుతున్నందున, ఈ ప్రతిపాదనను అమలు చేయడం కష్టమని సెబీ నిర్ణయించింది. స్వల్పకాల, దీర్ఘకాల అంశాల్లో రేటింగ్‌లు మారుతుంటాయి కూడా.

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన ఐటీ రిటర్నులు

ఈనాడు, హైదరాబాద్: గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసిన వారి సంఖ్య తగ్గిందని ఏపీ, తెలంగాణ ప్రాంతీయ ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎన్.శంకరన్ అన్నారు. 2018-19లో ఈ ప్రాంతం నుంచి రూ.58,040 కోట్లు ఆదాయపు పన్నును వసూలు చేశామని తెలిపారు. ఈ ఏడాది రూ.70,574 కోట్లు పన్ను వసూలును లక్ష్యంగా పెట్టుకొన్నట్లు వివరించారు. దీన్ని సాధించగలమని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. పన్ను దాఖలుకు చివరి రోజు ఆగస్టు 31కల్లా రిటర్నులు దాఖలు చేసేవారి సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐలో ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్పొరేట్లు, వ్యాపారవేత్తలు, సాధారణ ప్రజలకు పన్ను దాఖలులో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ఆదాయపు పన్ను దాఖలు చేసే వారికి సహాయపడేందుకు రెండు మొబైల్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## మార్కెట్ కబుర్లు

- కేన్సర్ చికిత్సలో ఉపయోగించే రేషే అవాస్టిన్ బయోసిమిలర్ ఔషధాన్ని భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు **డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్** ప్రకటించింది.
- ముందస్తు ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.300 కోట్లు సమీకరించేందుకు **ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్** సన్నాహాలు చేస్తోంది.
- నాగ్‌పూర్‌లోని మిహాన్ క్యాంపస్ విస్తరణ నిమిత్తం మహారాష్ట్ర ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కంపెనీతో **హెచ్‌సీఎల్ టెక్నాలజీస్** ఒప్పందం కుదుర్చుకుంది.
- మధుమేహ చికిత్సలో వినియోగించే రెమోగ్లిఫోజిన్ ఎటాబోనేట్, మెట్‌ఫోర్మిన్ హైడ్రోక్లోరైడ్ సమ్మేళన ఔషధానికి అనుమతులు లభించినట్లు **గ్లెన్‌మార్క్ ఫార్మా** తెలిపింది.
- ప్రభుత్వం గత ఏడాది చివర్లో ప్రవేశపెట్టిన 59 మినిట్ లోన్స్‌కి చిన్న వ్యాపార యజమానుల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ రాలేదని, అయినప్పటికీ కార్ల రుణాలకు దీన్ని కొనసాగిస్తామని **ఎస్‌బీఐ** ఛైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడించారు.
- రూ.1,571 కోట్ల బాండ్ల తిరిగి చెల్లింపుల్లో తాజాగా డిఫాల్ట్ అయినట్లు **దేవన్ హౌసింగ్ ఫైనాన్స్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్)** ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది.
- రైల్వేలో మౌలిక సదుపాయాలకు సంబంధించిన రూ.845 కోట్ల విలువైన ఆర్డర్లను **కేఈసీ ఇంటర్నేషనల్** సంస్థ దక్కించుకున్నట్లు తెలిపింది.
- **డీఎల్‌ఎఫ్** శాశ్వత డైరెక్టర్ కేపీ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు.
- ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేవల సంస్థ **పెన్నార్ ఇండస్ట్రీస్** జూన్, జులై నెలల్లో రూ.538 కోట్ల పనులను దక్కించుకుంది.
- వొడాఫోన్ ఐడియా సీఈఓగా **బాలేశ్ శర్మ** వ్యక్తిగత కారణాలతో తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. ఎండీ, సీఈఓగా రవీందర్ టక్కర్‌ను నియమిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

## ఎస్‌బీఐ డెబిట్‌కార్డులు ఉండవ్!

- **అయిదేళ్లలో కార్డు అవసరం అత్యంత పరిమితం**
- **ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్**




ముంబయి: డెబిట్, క్రెడిట్ కార్డులు తొలగించి, మరిన్ని డిజిటల్ చెల్లింపు విధానాలను అమల్లోకి తీసుకు రావాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) యోచిస్తోంది. దేశంలో అయిదోవంతు జనాభాకు ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. ఎస్‌బీఐ ఖాతాదార్లలో అత్యధికులు డెబిట్‌కార్డులపై ఆధారపడి ఉన్న సంగతి విదితమే. అయినా కూడా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి ప్లాస్టిక్ కార్డులను తొలగించాలన్నది తమ యోచన అని, ఇది సాధ్యం చేయగలమని భావిస్తున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్ ఇక్కడ జరిగిన ఒక సమావేశంలో తెలిపారు. దేశం మొత్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు వినియోగంలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఎస్‌బీఐ అందుబాటులోకి తెచ్చిన యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్‌కార్డుల వినియోగాన్ని తగ్గించగలమనే అభిప్రాయాన్ని రజనీశ్ వ్యక్తం చేశారు. యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. యోనో కేంద్రాల సంఖ్యను ప్రస్తుత 68 వేల నుంచి ఏడాదిన్నరలో 10 లక్షలకు చేర్చాలనే ప్రణాళికతో ఉన్నామని వివరించారు. అప్పుడు కార్డు అవసరమే రాకపోవచ్చన్నారు. కొన్ని ఉత్పత్తుల కొనుగోలుకు యోనో యాప్ ద్వారా రుణం కూడా పొందవచ్చని, అందువల్ల క్రెడిట్‌కార్డు కూడా 'జేబులో ప్రత్యామ్నాయ సాధనం'గా మిగిలిపోతుందని ఎస్‌బీఐ ఛైర్మన్ వివరించారు. రాబోయే అయిదేళ్లలో దేశీయంగా కార్డు అవసరం అత్యంత పరిమితం అవుతుందని, వర్చువల్ కూపన్లే ప్రధానపాత్ర పోషిస్తాయని తెలిపారు. చెల్లింపులకు ప్రస్తుతం అనుసరిస్తున్న క్యూఆర్ కోడ్ విధానం కూడా ఖరీదైనదేనని పేర్కొన్నారు.

| | |
|---|---|
| **90 కోట్లు** దేశంలో డెబిట్ కార్డులు | **3 కోట్లు** వినియోగంలో ఉన్న క్రెడిట్‌కార్డులు |
| **68,000** యోనో నగదు కేంద్రాలు | **10 లక్షలు** 18 నెలల్లో యోనో కేంద్రాల లక్ష్యం |

# ఆరంభ జోరుకు కళ్లెం

- **సూచీలకు స్వల్ప లాభం**
- **బ్యాంకింగ్, వాహన షేర్లు డీలా**

**మార్కెట్ సమీక్ష**

సూచీల ఆరంభ జోరుకు కళ్లెం పడింది. చివరి గంటన్నర ట్రేడింగ్‌లో వాహన, బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో స్వల్ప లాభాలకు పరిమితమయ్యాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి ప్రభుత్వం ఉద్దీపన చర్యలు ప్రకటించొచ్చన్న ఆశలతో ప్రారంభ ట్రేడింగ్‌లో మార్కెట్లు పరుగులు తీశాయి. మాంద్యంపై భయాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొట్టిపారేయడం కలిసొచ్చింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 29 పైసలు తగ్గి 71.43 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు సానుకూలంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 37,485.92 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజులో అధిక భాగం లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 37,718.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో 37,358.49 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 52.16 పాయింట్ల లాభంతో 37,402.49 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 6.10 పాయింట్లు పెరిగి 11,053.90 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,037.85- 11,146.90 పాయింట్ల మధ్య కదలాడింది.

**తడబడిన స్పందన స్ఫూర్తి:** స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ షేరు స్టాక్ మార్కెట్లలో నమోదైన తొలిరోజే తడబడింది. బీఎస్ఈలో ఇష్యూ ధరైన రూ.856తో పోలిస్తే 3.73 శాతం తక్కువగా రూ.824 వద్ద షేరు నమోదైంది. ఇంట్రాడేలో ఈ షేరు రూ.865 వద్ద గరిష్ఠాన్ని, రూ.690 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 0.89 శాతం నష్టంతో రూ.848.40 వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈలో 0.96 శాతం తగ్గి రూ.847.80 దగ్గర స్థిరపడింది. బీఎస్ఈలో 4.72 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 46 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.5,444.78 కోట్లుగా నమోదైంది.



సోమవారం నిఫ్టీ కదలికలు

సెన్సెక్స్ 30 షేర్లలో 14 లాభాలతో ముగిశాయి. సన్‌ఫార్మా 2.66%, టెక్ మహీంద్రా 1.84%, యాక్సిస్ బ్యాంక్ 1.40%, ఎల్ అండ్ టీ 1.30%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.15%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.01%, ఎన్‌టీపీసీ 0.89% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. యెస్ బ్యాంక్ 3.46%, పవర్‌గ్రిడ్ 2.01%, ఓఎన్‌జీసీ 1.48%, ఎస్‌బీఐ 1.46%, ఎం అండ్ ఎం 1.36%, హీరో మోటోకార్ప్ 1.32% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు, ఆరోగ్య సంరక్షణ, ఇంధన, ఐటీ 1.57% వరకు రాణించాయి. చమురు- గ్యాస్, వాహన, లోహ, ఎఫ్‌ఎమ్‌సీజీలు మాత్రం 0.59% వరకు పడ్డాయి.

# చేనేత వస్త్రాలకు మినహాయింపు లేదు



సతీష్ సరాఫ్,
చార్టర్డ్ అకౌంటెంట్

**? 15 నెలల క్రితం మేం కలంకారి, చేనేత వస్త్రాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించాం. తొలి ఏడాది మా టర్నోవరు దాదాపు రూ.20 లక్షల వరకు ఉంటుంది. మేం జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సిన అవసరం ఉందా? జౌళి మంత్రిత్వశాఖ నుంచి నాకు మహిళా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం కింద ధ్రువీకరణ పత్రం ఉంది. ఈ ధ్రువీకరణ పత్రం ఉన్నవారికి జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఏమైనా ఉందా**

– తేజోమూర్తి పింజల

మహిళా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి, కలంకారి/ చేనేత వస్త్రాలకు జీఎస్‌టీ మినహాయింపునకు సంబంధించి జీఎస్‌టీ చట్టంలో ఎటువంటి నిబంధనలు లేవు. అందువల్ల జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. తొలి ఏడాది మీ వార్షిక టర్నోవరు రూ.20 లక్షలకు మించినందున, మీరు తెలంగాణలోనే వ్యాపారం చేస్తుంటే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపారం చేస్తుంటే కనుక ఈ పరిమితి రూ.40 లక్షలు. అంటే మీ వార్షిక టర్నోవరు రూ.40 లక్షలు మించితేనే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సి ఉంటుందన్నమాట.

**? పాఠశాలలకు/వాణిజ్య కార్యకలాపాలకు భవనాలను అద్దెకిస్తే ఆ అద్దెపై జీఎస్‌టీ మినహాయింపు ఉంటుందని 2019 ఆగస్టు 7న ఈనాడులో ప్రచురితమైన జీఎస్‌టీ ప్రశ్నలు- సమాధానాల్లో మీరు వెల్లడించారు. అయితే వాణిజ్య కార్యకలాపాలకు ఇచ్చిన భవనాల ద్వారా రూ.20 లక్షల వరకు అద్దె వస్తుంటే జీఎస్‌టీ కట్టనక్కర్లేదని కొన్ని రోజుల క్రితం నేను అడిగిన ఓ ప్రశ్నకు మీరు బదులిచ్చారు. ఇందులో ఏది సరైనదో తెలియజేయగలరు.**

– పి.వెంకటేశ్వరరావు

భవనాలను పాఠశాలలకు అద్దెకిస్తే జీఎస్‌టీ మినహాయింపు ఉంటుందని మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఆగస్టు 7న ప్రచురితమైన ప్రశ్నలు- సమాధానాల్లో నేను పాఠశాలలకు అద్దెకిస్తే జీఎస్‌టీ వర్తిస్తుందనే బదులిచ్చాను. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోనంత వరకు రూ.20 లక్షల దాకా అద్దెలపై జీఎస్‌టీ మినహాయింపు ఉంటుంది. అయితే ఎప్పుడైతే మీరు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకుంటారో.. జీఎస్‌టీ మినహాయింపునకు సంబంధించి కనీస పరిమితి నిబంధనలు వర్తించవు.

**? తంబోలా టికెట్‌కు జీఎస్‌టీ వర్తిస్తుందా? ఒకవేళ వర్తిస్తే.. ఏ రేటు ప్రకారం చెల్లించాలి. మా వస్తువుల అమ్మకాలను పెంచుకునేందుకు బహుమతి కూపన్‌గా తంబోలా టికెన్‌ను ఇస్తే కూడా జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా**

– బి.జె.రెడ్డి, ప్రొద్దుటూరు

నోటిఫికేషన్ సంఖ్య: 1/2017, తేదీ: 28-06-2017లోని షెడ్యూల్-4, ఐటమ్ సంఖ్య 229 ప్రకారం తంబోలాకు 28 శాతం జీఎస్‌టీ రేటు వర్తిస్తుంది. మీరు మీ వ్యాపారాన్ని పెంచుకునేందుకు తంబోలా టికెట్లను ఉపయోగిస్తే కూడా 28 శాతం జీఎస్‌టీ రేటు ప్రకారం చెల్లించాల్సిందే.

**? మున్సిపల్ ఇంజినీర్ అండ్ మున్సిపల్ కమిషనర్ కోసం అద్దెకు తీసుకున్న కారుకు ప్రతి నెల రూ.35,000 కాంట్రాక్టరుకు చెల్లిస్తున్నాం. దీనిపై 18 శాతం జీఎస్‌టీని అడుగుతున్నారు. ఆ కాంట్రాక్టరు వార్షిక టర్నోవరు రూ.2 కోట్ల వరకు ఉంటుంది. కారు అద్దె రుసుముకు జీఎస్‌టీ వర్తిసుందా? లేదా**

– వెంకట సుబ్బారావు

సెంట్రల్ ట్యాక్స్ రేట్ నోటిఫికేషన్ సంఖ్య: 11/2017, తేదీ 28-06-2017, ఎంట్రీ సంఖ్య: 18(7), దీనిలోని సవరణల ప్రకారం.. ఏదేని ఒక వాహనం ద్వారా ప్రయాణికులను రవాణా చేసినప్పుడు జీఎస్‌టీ 18 శాతం వర్తిస్తుంది. కాంట్రాక్టరు వార్షిక టర్నోవరు రూ.2 కోట్ల వరకు ఉంటుందని మీరు చెప్పినందున, ఆయనకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉంటుందనే అనుకుంటున్నాను. అందువల్ల పైన చెప్పిన విధంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.




**? మా కంపెనీ వాణిజ్య కార్యకలాపాలకు భవనాలను నిర్మించి, అద్దెకిస్తుంటుంది. అయితే ఈ భవనాల నిర్మాణానికి వాడిన సామగ్రిపై చెల్లించిన పన్నును ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద తిరిగి పొందొచ్చనే విషయం ఈ మధ్యనే మాకు తెలిసింది. నిజంగానే అలా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందే వీలుందా**

– రాజు సూర్యవంశీ

అవును.. మీరు విన్నది నిజమే. ఒడిశా హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం... వాణిజ్య కార్యకలాపాలకు అద్దెకు ఇచ్చే ఉద్దేశంతో నిర్మించే భవనాలకు వాడే సామగ్రిపై చెల్లించిన పన్నును మీరు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా తిరిగి పొందొచ్చు. అయితే ఐటీసీ క్లెయిమ్ చేసుకోవడానికి ముందు మీ రాష్ట్రంలో ఒడిశా హైకోర్టు తీర్పు వర్తిస్తుందా లేదా అనే విషయాన్ని ఓ న్యాయవాదిని కలిసి తెలుసుకోండి.

**? కొన్ని వ్యయాలకు రివర్స్ ఛార్జీ పద్ధతిలో జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందనే విషయం నాకు తెలియదు. అందుకే 2017-18 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ రిటర్న్‌లు దాఖలు చేసే సమయంలో రివర్స్ ఛార్జీ కింద పన్ను చెల్లించలేదు. ఇప్పుడు ఆ పన్ను బకాయిలను చెల్లించాలని అనుకుంటున్నాం. ప్రస్తుత రిటర్న్‌లో ఆ వివరాలు పొందుపరిచి మేం పన్ను చెల్లించవచ్చా? లేదంటే పన్ను చెల్లించేందుక వేరే మార్గాలు ఏమైనా ఉన్నాయా**

– ఎ.సాయారెడ్డి

2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రివర్స్ ఛార్జీ కింద చెల్లించాల్సిన పన్నును ప్రస్తుత నెల రిటర్న్‌లో చూపించలేం. 2017-18 ఆర్థిక సంవత్సరానికి మీరు వార్షిక రిటర్న్‌లను 2019 ఆగస్టు 31న లేదంటే ఆ లోగా దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ వార్షిక రిటర్న్‌లో రివర్స్ ఛార్జీ పన్ను బకాయిలను పొందుపరిచి, వడ్డీతో కలిపి పన్ను చెల్లించొచ్చు. అయితే ఇప్పటికే 2017-18 వార్షిక రిటర్న్‌ను దాఖలు చేసినట్లయితే, జీఎస్‌టీ డీఆర్‌సీ-03 ఫారం ద్వారా పన్ను బకాయిలు చెల్లించొచ్చు. పన్ను చెల్లించాక ఆ విషయాన్ని మీ పరిధిలోని జీఎస్‌టీ అధికారికి తెలియజేయండి.

**? ఈ ఏడాది జూన్‌లో నా స్నేహితుడు ఒక ఫ్లాటు బుక్ చేసుకున్నారు. ఫ్లాటు విలువ రూ.60 లక్షల వరకు ఉంటుంది. అడ్వాన్స్‌గా ఇచ్చిన డబ్బులపై 5 శాతం జీఎస్‌టీ కట్టాలని నిర్మాణదారు అడుగుతున్నారు. మా స్నేహితుడు అడ్వాన్స్ డబ్బులపై జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందా? లేదంటే ఫ్లాటును స్వాధీనం చేశాక మొత్తం ఫ్లాటు ధరపై చెల్లించాలా? అసలు 5 శాతం జీఎస్‌టీ రేటు సరైనదేనా? కాదా**

– ప్రేమ్‌నాథ్ డేగల

మీ స్నేహితుడి ఫ్లాటు విలువ రూ.60 లక్షలు చెప్పారు. అంటే ఇది రూ.45 లక్షలు కంటే ఎక్కువే కనుక అందుబాటు గృహం కిందకు రాదు. అందువల్ల జీఎస్‌టీ చట్టంలోని నిబంధనల ప్రకారం.. 5 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. అడ్వాన్స్ డబ్బులతో కలిపి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. నిర్మాణదారు మీకు పన్ను రశీదు ఇచ్చిన తర్వాతే జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. సాధారణంగా ఫ్లాటును స్వాధీనం చేసే సమయంలోనే నిర్మాణదారు పన్ను రశీదు ఇస్తుంటారు. ఒకవేళ నిర్మాణదారు అడ్వాన్స్‌పై పన్ను చెలిస్తే.. ఆ చెల్లించిన పన్ను మొత్తాన్ని పన్ను రశీదు ఇచ్చిన సమయంలో నిర్మాణదారు మినహాయించుకొని, మిగతా మొత్తాన్ని ప్రభుత్వానికి ఆయన కట్టాల్సి ఉంటుంది.

**మీ సందేహాలు పంపండి**

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net



ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఇంటర్వ్యూ
హీరో ఎలక్ట్రిక్ సీఈఓ
సొహిందర్ గిల్

ఈనాడు బిజినెస్

# 20-30 లక్షల విద్యుత్ వాహనాలు రోడ్డెక్కాలి

## అప్పుడే వినియోగదారుల్లో అవగాహన పెరిగి భ్రమలు తొలుగుతాయ్

● ఆరేళ్లు కాకుండా రెండేళ్లలోనే ప్రభుత్వం ప్రోత్సాహకాలన్నీ ఇవ్వాలి ● ప్రాధాన్య రుణ రంగాల్లోనూ చేర్చాలి

**విద్యుత్ వాహనాల ప్రోత్సాహానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. కంపెనీలు కూడా విద్యుత్ వాహనాల తయారీదిశగా అడుగులు వేస్తున్నాయి. మరికొన్ని కంపెనీలైతే ఈ తరహా వాహనాలను అందుబాటులోకి తెస్తున్నాయి కూడా. తాజాగా హీరో ఎలక్ట్రిక్ ఇండియా రెండు విద్యుత్ బైకులను విడుదల చేసింది. ఈ సందర్భంగా బైకుల ప్రత్యేకతలను కంపెనీ సీఈఓ సొహిందర్ గిల్ వివరించారు. వివిధ అంశాలపై ఆయన ఈటీవీ భారత్‌కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..**

**? హీరో ఎలక్ట్రిక్ ఇండియా విడుదల చేసిన రెండు విద్యుత్ వాహనాల వివరాలు చెబుతారా..**

**సొహిందర్:** తొలిసారి భారత్‌లో.. అది కూడా బెంగళూరులో రెండు విద్యుత్ వాహనాలను విడుదల చేశాం. బెంగళూరులోనే ఎందుకంటే.. విద్యుత్ వాహనాలకు ఓ హబ్‌గా దీనిని మేం భావిస్తున్నాం. అందుకే ఇక్కడే వీటిని మొట్టమొదట ఆవిష్కరించాం. ఇక్కడ నుంచి దఫాలవారీగా దేశవ్యాప్తంగా పరిచయం చేస్తాం. విద్యుత్ వాహనాల కొనుగోలు విషయంలో ప్రస్తుతం వినియోగదార్లలో నెలకొన్న భ్రమలను తొలగించడమే ఈ రెండు బైకుల విడుదల వెనక మా ప్రధాన ఉద్దేశం. ఒక వినియోగదారుడు షోరూంకి వచ్చి.. ఈ బైకులను చూసి అమితంగా ఇష్టపడాలి. ఎందుకంటే దానిపై కూర్చుంటే శబ్దం ఉండదు.. పొగ రాదు.. చాలా సున్నితంగా, అనువుగా ఉంటుంది. నగర రహదారులపై సగటు వేగానికి మించి ఇది నడుస్తుంది. మంచి పికప్‌తో గంటకు 40 కి.మీ వేగంతో వెళ్తుంది. ఒక్కసారి ఛార్జింగ్‌తో 110- 115 కి.మీ వరకు వెళ్లొచ్చు. పూర్తి ఛార్జింగ్‌కు నాలుగున్నర గంటల సమయం తీసుకుంటుంది. ఈ ప్రత్యేకతలన్నింటితో ఈ బైకులను అభివృద్ధి చేశాం. ఈ బైకును కొనడం ప్రయోజనమేనా, ఇక్కడి రోడ్లకు ఇది అనువుగానే ఉంటుందా అని వినియోగదారుడు మదిలో నెలకొన్న ప్రశ్నలకు వీటితో సమాధానం దొరుకుతుందని అనుకుంటున్నాను.

**? పెట్రోలు వాహనాల కోసం బంకులు అనేకం ఉన్నాయి. విద్యుత్ వాహనాల విషయానికొస్తే ఆ మౌలిక వసతులు ఇప్పటికీ అంతంత మాత్రమే. వీటి ఛార్జింగ్ కోసం ఎక్కడికి వెళ్లాలనే ప్రశ్న ప్రస్తుతం వినియోగదారులను వెంటాడుతోంది..**

విద్యుత్ వాహనాల ఛార్జింగ్‌కు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేస్తోంది. ఇది పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చాలంటే నాలుగేళ్లు పట్టొచ్చని నా అభిప్రాయం. అయితే మా బైకుల విషయంలో ఛార్జింగ్ సమస్యకు విభిన్న పరిష్కారాన్ని చూపాం. అదేమిటంటే.. బ్యాటరీలను ఎక్కడి కంటే అక్కడికి తీసుకుని వెళ్లే (పోర్టబిలిటీ) వెసులుబాటు ఉండడం. ఈ బైకుల్లో రెండు బ్యాటరీలు ఉంటాయి. అవి కూడా తేలికపాటివి. ఆఫీసుల్లో, ఇంట్లో మొబైళ్ల ఛార్జింగ్ మాదిరి ఎప్పుడంటే అప్పుడు వీటిని ఛార్జి చేసుకోవచ్చు. అరగంట ఛార్జ్ చేసుకుంటే చాలు పదిహేను కిలో మీటర్ల వరకు వెళ్లొచ్చు. ఛార్జింగ్ స్టేషన్లలో రెండు గంటల పాటు నిల్చునే దాని కంటే ఇది మేలే కదా. అందుకే స్వల్పకాలం పాటు ఈ సమస్యకు ఇది ఓ తాత్కాలిక పరిష్కారమని మేం అనుకుంటున్నాం.

**? విద్యుత్ వాహనాల వల్ల ప్రయోజనాలు అధికమని, వాతావరణ కాలుష్యానికి వీటితోనే పరిష్కారం దొరుకుతుందని కంపెనీలు అంటున్నాయి. మరి రోడ్లపై చూస్తే ఈ వాహనాలు పెద్దగా కనిపించడం లేదు**

మాట్లాడటం వేరు.. కొనడం వేరు. పెట్రోలు, విద్యుత్ వాహనాల్లో మీరు దేనిని ఎంపిక చేసుకుంటారని ఎవరైనా నన్ను అడిగితే? అసలు నేను ఎందుకు విద్యుత్ వాహనాన్ని కొనాలని ముందు ప్రశ్నిస్తాను. పర్యావరణం గురించి ఆలోచించేందుకు అందరూ పర్యావరణవేత్తలు కాదు కదా. పోనీ విద్యుత్ వాహనాలు ఏమైనా రహదారులపైనా తిరుగుతున్నాయా? అంటే అది కూడా అంతంతే. అలాంటప్పుడు వినియోగదారులకు వీటిపై సానుకూల భావన ఎక్కడ ఉంటుంది. అందుకే విద్యుత్ వాహనాలపై అవగాహన పెరగాలి. కనీసం 20-30 లక్షల వరకు విద్యుత్ వాహనాలు రోడ్లపై తిరగాలి. అప్పుడే అవగాహన పెరుగుతుంది. వీటిని కొన్న వ్యక్తికి ఆరు నెలల తర్వాత ఒక అద్భుతమైన వస్తువును కొన్నామనే భావన ఏర్పడాలి. తనకే కాదు.. సమాజానికి, దేశానికి, పర్యావరణానికి మేలు చేశాననే అభిప్రాయం కలగాలి. అలాంటి రోజు కోసమే మేం ఎదురుచూస్తున్నాం.

**? వాహన పరిశ్రమకు ప్రభుత్వం అందివ్వాల్సిన ప్రోత్సాహకాలపై మీ నుంచి ఇంకా ఏమైనా డిమాండ్లు ఉన్నాయా?**

విద్యుత్ వాహన పరిశ్రమ సంఘానికి నాయకుడిగా నేను తప్పకుండా ప్రోత్సాహకాల కోసం ప్రభుత్వాన్ని డిమాండు చేస్తాను. వీటిల్లో మొదటిది.. ప్రభుత్వం ఆరేళ్లలో ఇవ్వాలనుకుంటున్న ప్రోత్సాహకాలను రెండేళ్లలో ఇవ్వాలి. తద్వారా విద్యుత్, పెట్రోలు వాహనాల మధ్య ధరల వ్యత్యాసం తగ్గించాలి. విద్యుత్ వాహనాలతో ఇంధన వ్యయాలు ఆదా అవుతుందనే విషయం కంటే కూడా ధర ఎక్కువనే విషయంపైనా వినియోగదారుడు దృష్టి సారిస్తాడు. కనీసం రెండేళ్ల వరకైనా పెట్రోలు, విద్యుత్ వాహనాల ధరలు ఒకేలా ఉంటే.. విద్యుత్ వాహనాల కొనుగోలుకు వినియోగదార్లు మొగ్గుచూపుతారు. ఎక్కువ వాహనాలు రోడ్లపైకి వస్తే.. వాటిపై అవగాహన పెరుగుతుంది. విద్యుత్ వాహనాలకు ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణాలిచ్చేలా ఒత్తిడి పెంచాలి. ప్రాధాన్య రంగాల్లో వీటిని చేర్చాలి. చివరగా.. కొరియర్, సరకు రవాణా సేవలు అందించే సంస్థలు వినియోగిస్తున్న వాహనాల్లో ఏడాదికి 20 శాతం వాహనాలనైనా తప్పక విద్యుత్ వాహనాలుగా మార్చేలా నిర్ణయం తీసుకోవాలి.

**? విద్యుత్ వాహనాల విభాగంలో హీరో ఎలక్ట్రిక్ ఓ దిగ్గజ సంస్థగా ఉంది. అటు చూస్తే విద్యుత్ వాహనాల విభాగంలో చాలానే అంకుర సంస్థలు ఏర్పాటవుతున్నాయి. వీటిపై మీ అభిప్రాయం ఏమిటి**

ఈ రంగంలో అంకురాలు అడుగుపెడుతుండటాన్ని స్వాగతిస్తున్నాను. తమ ఆలోచనలను, కలలను అద్భుతాలుగా ఆవిష్కరించి, వినూత్న ఉత్పత్తులను తీసుకొచ్చే దిశగా ఈ అంకురాలు పనిచేస్తున్నాయి. ఏడాదికి 2 కోట్ల వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చగలగాలి. దిగ్గజ కంపెనీలకు అంకురాలు కూడా తోడైతే ఇది సులభం అవుతుంది. ఆవిష్కరణ పరంగా, సాంకేతికతపరంగా వినూత్న మార్పులను తీసుకొని రావడంలో అంకురాలు కీలక పాత్ర పోషిస్తాయని మా విశ్వాసం. అలాంటప్పుడు మేం అంకురాలతో కలిసి ఎందుకు పనిచేయకూడదు.

– బెంగళూరు

### రెండు కొత్త విద్యుత్ స్కూటర్లు



హీరో ఎలక్ట్రిక్ విద్యుత్ స్కూటర్లు ఆప్టిమా ఈఆర్, ఎన్‌వైఎక్స్ ఈఆర్‌లో కొత్త శ్రేణిని విపణిలోకి ప్రవేశపెట్టింది. ఆప్టిమా ఈఆర్ ధర రూ.68,721, ఎన్‌వైఎక్స్ ఈఆర్ ధర రూ.69,754 (ఎక్స్-షోరూమ్ ఇండియా)గా నిర్ణయించారు. పూర్తిగా ఛార్జింగ్ చేస్తే 100 కి.మీ ప్రయాణం చేయొచ్చని, బ్యాటరీపై మూడేళ్ల వారెంటీ ఇస్తున్నామని కంపెనీ వెల్లడించింది.

# కార్పొరేట్ పన్నులో క్రమంగా కోత

## ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**దిల్లీ:** రూ.400 కోట్లకు పైబడి టర్నోవరు ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును క్రమంగా 25 శాతానికి తీసుకొస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సంపద సృష్టికర్తలకు ప్రభుత్వం మద్దతునిస్తుందని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ అన్న మాటలను ఆమె పునరుద్ఘాటించారు. తన తొలి బడ్జెట్లో రూ.400 కోట్ల వరకు టర్నోవరు ఉన్న కంపెనీలపై కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి సీతారామన్ తగ్గించిన సంగతి తెలిసిందే. రూ.250 కోట్ల వరకు టర్నోవరు ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 2018లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 25 శాతానికి పరిమితం చేసిన సంగతి తెలిసిందే. సోమవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో సీతారామన్ మాట్లాడుతూ 'భారత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ దేశ సంపద సృష్టికర్తలు, ఉద్యోగ సృష్టికర్తలన్న విషయాన్ని మేం గుర్తించాం. వారికి మద్దతునివ్వడం మాకు గర్వకారణం. వారికి ప్రోత్సాహమిచ్చే దిశగా ప్రతి అడుగు ఉంటుంద'ని అన్నారు. 'కేవలం 0.7 శాతం కంపెనీలు మాత్రమే మిగిలాయి. దీర్ఘకాలంలో వాటికి కూడా కార్పొరేట్ పన్నును 25 శాతానికి పరిమితం చేస్తామ'ని వివరించారు. అయితే ఎప్పటిలోగా ఆ పనిచేయనున్నదీ తెలపలేదు.

**ఎన్‌బీఎఫ్‌సీలకు ఊరట:** బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లకు మూలధన సమీకరణ వ్యయాలను తగ్గించడానికి వీలు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్‌బీఎఫ్‌సీలు డిబెంచర్లను జారీ చేసే సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన డిబెంచర్ రెడెమ్షన్ రిజర్వ్(డీఆర్ఆర్) నిబంధనను తొలగించింది. కంపెనీల చట్టం కింద నిధులు సమీకరించే కంపెనీలు డీఆర్ఆర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఒక వేళ కంపెనీలు ఎగవేతకు పాల్పడే పక్షంలో మదుపర్లకు ఇబ్బంది లేకుండా చేయడం ఈ నిబంధన ఉద్దేశం. అయితే.. ఇపుడు గతంలోలాగా నమోదిత కంపెనీలు తాము జారీ చేసే డిబెంచర్ల విలువలో 25 శాతాన్ని డీఆర్ఆర్ రూపంలో ఉంచాల్సిన అవసరం ఉండదు.

**ప్రత్యక్ష పన్నుల స్మృతిపై నివేదిక:** కొత్త ప్రత్యక్ష పన్నుల స్మృతిపై సీబీడీటీ సభ్యుడు అఖిలేష్ రంజన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యాచరణ బృందం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రస్తుత ఆదాయ పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టం తీసుకురావడం కోసమే ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

**న్యూస్‌ప్రింట్‌పై కస్టమ్స్ సుంకాన్ని వెనక్కి తీసుకోం**

పత్రికల ముద్రణకు ఉపయోగించే పేపరు(న్యూస్‌ప్రింట్)పై విధించిన 10 శాతం కస్టమ్స్ సుంకాన్ని వెనక్కి తీసుకోవాలన్న విజ్ఞప్తులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. దేశీయ తయారీదార్లను ప్రోత్సహించడం కోసం సుంకాన్ని విధించామని.. దిగుమతిదార్లు పన్ను చెల్లించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. దిగుమతి చేసుకునే న్యూస్‌ప్రింట్‌పై కస్టమ్స్ సుంకాన్ని విధించాలన్న బడ్జెట్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ద ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ(ఐఎన్ఎస్) గత నెలలో కోరిన విషయం తెలిసిందే. ఇప్పటిదాకా న్యూస్‌ప్రింట్‌పై ఎటువంటి దిగుమతి సుంకం లేదు.

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



# సవాళ్లున్నాయ్..

● అవకాశాలపై దృష్టి సారించాలి
● ఆర్థిక వ్యవస్థ మందగమనం వాస్తవమే
● రెపో రేటుతో రుణ రేట్లు అనుసంధానించాలి
● మరో ఎన్‌బీఎఫ్‌సీని విఫలం కానివ్వం

**ముంబయి:** ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి వెళ్లిందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అంగీకరించారు. ఇంటాబయటా చాలా సవాళ్లున్నాయనీ అన్నారు. అయితే ప్రతి ఒక్కరూ భవిష్యత్‌లో ఎదురయ్యే అవకాశాలపై దృష్టి సారించాలని.. నిరాశవాదాన్ని వీడాలని పిలుపునిచ్చారు. ఇటీవలి బడ్జెట్‌లో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న పలు చర్యలపై కార్పొరేట్ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. ధనవంతులు, విదేశీ మదుపర్లపై బడ్జెట్లో అధిక పన్నులు విధించిన సంగతి తెలిసిందే. పారిశ్రామికోత్పత్తి, ఎగుమతులు, వాహన విక్రయాల వంటివి స్థూల ఆర్థిక అంశాలు కూడా నేలచూపులు చూసిన ఈ తరుణంలో దాస్ ఈ విధంగా స్పందించడం విశేషం. బడ్జెట్ ప్రతిపాదనలు, ఆర్థిక మందగమనం కారణంగా మార్కెట్లు డీలా పడ్డాయి కూడా. ద్రవ్యోల్బణ గణాంకాలు తప్ప ఇటీవలి కాలంలో ఎటువంటి సానుకూల వార్తా వెలువడలేదు.

**ఇతర బ్యాంకులూ ఆ బాట పట్టాలి:** ఎస్‌బీఐ సహా 12 బ్యాంకులు తమ రుణాలు, డిపాజిట్ రేట్లను రెపో రేటుకు అనుసంధానం చేసినట్లే.. వ్యవస్థలోని ఇతర బ్యాంకులూ స్వచ్ఛందంగా ఆ పనిచేయాల్సిన అవసరం ఉందని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఇలాంటివి పరపతి విధాన ప్రక్రియ బదిలీని వేగవంతం చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని బ్యాంకుల కంటే ముందుగా ఎస్‌బీఐ తన రుణ, డిపాజిట్ రేట్లను మే నుంచే రెపో రేటుకు అనుసంధానం చేసిన సంగతి తెలిసిందే. 'బ్యాంకులు ఇపుడే మొండి బకాయిల సంక్షోభం నుంచి బయటకు వస్తున్నాయి. అవి తమ బ్యాలెన్స్‌షీట్లను బలోపేతం చేసుకోవడానికి సమయం ఇవ్వాల'ని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఎన్‌బీఎఫ్‌సీల నాణ్యత సమీక్ష ఇప్పట్లో లేదు :** భారీ స్థాయి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ) ఏదీ విఫలం కాకుండా చూసే బాధ్యతకు కట్టుబడి ఉన్నట్లు దాస్ పేర్కొన్నారు. అదే సమయంలో ప్రస్తుతానికి ఎన్‌బీఎఫ్‌సీల ఆస్తుల నాణ్యతను సమీక్షించే ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేశారు. అయితే 500కు పైగా ఎన్‌బీఎఫ్‌సీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు.

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



# ఆర్థిక మందగమనం తీవ్ర ఆందోళనకరం

● సరికొత్త సంస్కరణలు కావాలి

దిల్లీ

ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని రాజన్ గుర్తు చేశారు. మొత్తంమీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని సీఎన్‌బీసీ టీవీ 18తో అన్నారు.

వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం 2 దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడుకాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు.

**ప్రస్తుతం కంటే 2-3 శాతం వృద్ధి పెంచాలంటే..**

'ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2-3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. '2011-12 నుంచి 2016-17 వరకు జీడీపీని 2.5 శాతం అధికంగా గణించారన్న మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వాదనలపై మనం దృష్టి కేంద్రీకరించాలి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలి' అని రాజన్ విశదీకరించారు.

**బ్యాంకుల స్థితి ఫరవాలేదు**

2008 ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదు. ఒకవేళ వచ్చిందంటే, అందుకు మార్గాలు కూడా వేరేవి అవుతాయి. అందువల్ల గతంలో ఎదురైన సమస్యలు పెరగకుండా చూద్దామనుకుంటే సరిపోదు' అని స్పష్టం చేశారు.

» అమెరికాకు మాంద్యం ముప్పు



# 2020 లేదా 2021 లో..

## ఈ ఏడాది మాత్రం ఉండదు

## ఆర్థికవేత్తల అంచనా

**వాషింగ్టన్:** అమెరికాలో ఆర్థిక మాంద్యం ఈ ఏడాది ఉండకపోవచ్చని, వచ్చే ఏడాది లేక ఆపై ఏడాది చూపొచ్చని ఆర్థికవేత్తల్లో అధికులు అంచనా వేస్తున్నారు. సోమవారం విడుదలైన సర్వే ఒకటి ఈ విషయాన్ని తెలిపింది. ఒక పక్క మాంద్యం వాదనను అమెరికా అధ్యక్షుడు తోసిపుచ్చుతున్న తరుణంలో ఈ నివేదిక వెలువడటం గమనార్హం.

**ట్రంప్ ఏమంటున్నారంటే..**

'నేను అన్నింటికీ సిద్ధంగా ఉన్నాను. మనకు మాంద్యం ఉందని నేను భావించడం లేదు. మనం ఎంతో బాగా ఉన్నాం. మన ఖాతాదార్లు ధనవంతులు' అని ట్రంప్ విలేకరులతో ఆదివారం పేర్కొన్నారు. 'నేను పన్నులను గణనీయంగా తగ్గించా. అందువల్ల ప్రజల వద్ద నగదు అధికంగా ఉంది. వారు కొనుగోళ్లు బాగా చేస్తున్నారు. వాల్‌మార్ట్ విక్రయ గణాంకాలు నేను పరిశీలించా. ఎంతో బాగున్నాయి. ఎక్కువమంది ఆర్థికవేత్తలు మనం మాంద్యంలోకి వెళ్లడం లేదు అని చెప్పారు. మిగతా ప్రపంచం మాత్రం మన లాగా చేయడం లేదు' అని ట్రంప్ తెలిపారు. ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారు లారీ కుడోవ్ కూడా మాంద్యం అంచనాలను తగ్గించి చూపారు. 'మాంద్యం లేదనే గట్టిగా భావిస్తున్నా' అని ఎన్‌బీసీ మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. 'వినియోగదారులకు అధిక వేతనాలు అందుతున్నాయి. అదేవిధంగా వాళ్లు ఖర్చు చేస్తున్నారు. అదే సమయంలో పొదుపు కూడా చేస్తున్నారు. అందువల్ల ఈ ఏడాది ద్వితీయార్థం మరింత బాగుంటుందని ఆశిస్తున్నా' అని లారీ పేర్కొన్నారు. 'మనం ఎంతో బాగా పనిచేస్తున్నామన్నది నా భావన. అందువల్ల ఏదో జరుగుతుందని తలచుకుని ఆందోళన చెందొద్దు' అని తెలిపారు.

**ఇదీ ఆర్థిక వేత్తల అంచనా**

నేషనల్ అసోసియేషన్ ఫర్ బిజినెస్ ఎకనామిస్ట్స్ (ఎన్ఏబీఈ) గుర్తించింది ఏంటంటే.. గత ఫిబ్రవరితో పోలిస్తే, ఇప్పుడు అతి తక్కువమంది నిపుణులు మాత్రమే ఈ ఏడాది అమెరికాలో మాంద్యం తలెత్తుతుందని భావిస్తున్నారు. అమెరికా కేంద్ర బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్‌పై మరిన్ని ఉద్దీపనల కోసం అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో, ఎన్ఏబీఈ ఒక సర్వే నిర్వహించింది. 2018లో ప్రకటించిన విధంగా వడ్డీరేట్లు పెంచాలనే నిర్ణయంపై కాస్త నెమ్మదిస్తామని ఫెడ్ ఇప్పటికే సంకేతాలివ్వడం గమనార్హం. చైనాతో వాణిజ్యయుద్ధంతో పాటు ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఫెడ్ ఇలా వ్యవహరిస్తోంది. 'ఫెడ్ ద్రవ్య పరపతి విధానంలో మార్పు వల్ల, మాంద్యం ప్రభావం ఈ ఏడాదిలో ఉంటుందని భావించడం లేదు' అని ఎన్ఏబీఈ అధ్యక్షుడు, కేపీఎంజీ ముఖ్య ఆర్థికవేత్త కాన్స్టన్స్ హంటర్ తెలిపారు. అయితే మాంద్యం 2020లోనా, లేక 2021లో ప్రభావం చూపుతుందా అనే అంశంపై ఆర్థికవేత్తలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాదిలో ఫెడ్ మరోసారి రేట్ల కోత విధిస్తుందని 46 శాతం మంది అంచనా వేస్తున్నారు. ట్రంప్ వాణిజ్యయుద్ధాలపైనా అత్యధికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఒప్పందం సాధ్యమేనని 64 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెడ్ నిర్ణయాలపై ట్రంప్ వ్యాఖ్యల ప్రభావం ఉండదని 55 శాతం మంది పేర్కొంటూనే, కేంద్రబ్యాంక్‌పై ప్రజా విశ్వాసం సడలేలా చేస్తుందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. తనఖా వడ్డీ కోతల్లో చేసిన మార్పుల వల్ల గృహ విభాగం గత 18 నెలలుగా నెమ్మదించిందని అత్యధికులు పేర్కొన్నారు.

**అమెరికా మాంద్యం అంచనాలపై సర్వే ప్రకారం..**

**226**
సర్వేలో పాల్గొన్న ఆర్థికవేత్తలు

**38%**
2020లో అమెరికాలో మాంద్యం ఏర్పడుతుందని తాజాగా అంచనా వేస్తున్నవారు

**34%**
2021 వరకు మాంద్యం ఇబ్బంది ఉండదని భావిస్తున్నవారు

**2%**
ఈ ఏడాదే అమెరికాలో మాంద్యం తలెత్తుతుందని భావిస్తున్నవారు

**10%**
గత ఫిబ్రవరి సర్వేలో 2019లోనే మాంద్యం వస్తుందన్న వారు

